## ఇంగ్లాండ్‌తో తొలి టీ20..
## స్మృతి మంధాన సెంచరీ హైలెట్స్



9


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 30 జూన్ 2025 | సంపుటి: 9 | సంచిక: 183 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## డ్రైవర్ లెస్ కారు

తనకు తానే డ్రైవింగ్ చేసుకుంటూ గమ్యం చేరిన టెస్లా కారు



2

## జూబ్లీహిల్స్‌లో
# గెలుపు మాదే

ఉప ఎన్నిక ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌దే జయ కేతనం

4న ఎల్బీ స్టేడియంలో గ్రామ స్థాయి నేతలతో బహిరంగ సభ

వరంగల్ నేతల వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుంది

మహేష్ కుమార్ గౌడ్ చిట్‌చాట్



**హైదరాబాద్, జూన్ 29, (మనం బ్యూరో):** వరంగల్ కాంగ్రెస్ పార్టీ నేతల వ్యవహారంలో క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జీవితాంతం సెక్యులరిస్టుగా ఉన్న డీఎస్ విగ్రహాన్ని బీజేపీ నేతలు ఆవిష్కరించడం శోచనీయమని

...మిగతా 2లో

## తెలంగాణలో
# వర్షాలు

ఐఎండీ హెచ్చరిక



2



## తెలంగాణలో బీఆర్ఎస్ పోయింది కానీ,
# అవినీతి పోలేదు

### వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే

నిజామాబాద్ పసుపు రైతుల 40 ఏండ్ల కలను నిజం చేసినం

మోడీ హామీ ఇచ్చాడంటే.. నెరవేర్చడం ఖాయం

ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా చూపించినం

నక్సలైట్లు ఆయుధాలు వదిలేసి లొంగిపోతేనే చర్చలు

నిజామాబాద్ పసుపు బోర్డు కార్యాలయం

ప్రారంభోత్సవంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా





**హైదరాబాద్, జూన్ 29, (మనం బ్యూరో):** తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తప్పనిసరిగా అధికారంలోకి వస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్, కాళేశ్వరం ఇలా అనేక అంశాలలో అవినీతికి పాల్పడింది. రాష్ట్రంలో తెలంగాణలో బీఆర్ఎస్ పోయింది కానీ, అవినీతి పోలేదని పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అర్వింద్, లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో ఆయన

...మిగతా 2లో

## ట్రకోమా రహిత
# దేశంగా భారత్

మిల్లెట్ బిస్కట్లు తయారు చేస్తున్న భద్రాచలం మహిళలకు ప్రశంస ● 123వ మన్‌కీ బాత్‌లో మోడీ





**హైదరాబాద్, జూన్ 29:** ప్రపంచ ఆరోగ్య సంస్థ భారత్‌ను ట్రకోమా రహిత దేశంగా ప్రకటించిందని ప్రధాని మోడీ తెలిపారు. ప్రధాని 123వ మన్ కీ బాత్ ఎపిసోడ్ నేడు ప్రసారమైంది. మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న తెలంగాణలోని భద్రాచలం ప్రాంత మహిళలను అభినందించారు. జూన్ 21న జరిగిన యోగా డే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారన్నారు. దాదాపు 10 ఏండ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేటా మరింత విస్తరిస్తోందన్నారు. చాలా మంది ప్రజలు యోగాను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేయడంతోపాటు.. న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని మోడీ తెలిపారు. నాడు జార్జిఫెర్నాండెజ్ ను సంకెళ్లతో బంధించారన్నారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో ఎమర్జెన్సీ తొలగిపోయిందని చెప్పారు. దానిని విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మొరార్జీ దేశాయ్, వాజ్ పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను

...మిగతా 2లో



## త్రిభాషా విద్యావిధానం..
# వెనక్కి తగ్గిన 'మహా' సర్కారు

2



# విజయవాడలో
# తెలంగాణ బోనాలు

### దుర్గామాతకు మహాకాళి బోనం సమర్పణ

**విజయవాడ, జూన్ 29:** హైదరాబాద్ మహాకాళి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. తెలంగాణకు చెందిన 500 మంది కళాకారులు రకరకాల వేషధారణలతో మేళతాళాలు, కోలాటాలు, నృత్యాలు, భారీ ఊరేగింపుతో ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారికి బోనాలను సమర్పించారు.

# మెడికోల స్టైపెండ్ పెంపు

### వైద్యారోగ్యశాఖలో 16వేల మంది సిబ్బంది పదవీ కాలం పొడిగింపు



**హైదరాబాద్, జూన్ 29:** వైద్య విద్యార్థులకు 15 శాతం స్టైపెండ్ పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెడికల్, డెంటల్ విద్యార్థులకు ఈ పెంపు వర్తించనుంది. సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల గౌరవ వేతనం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజా పెంపుతో ఇంటర్న్ కు నెలకు రూ.29,792 స్టైపెండ్ లభించనుంది.

...మిగతా 2లో

## జూడాల సమ్మె వాయిదా

దీర్ఘకాలంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల అసోసియేషన్ జూలై 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, సమ్మె లేదని జూడాల సంఘం ఆదివారం సాయత్రం పొద్దుపోయాక ఒక ప్రకటన విడుదల చేసింది. తమ సమస్యలపై అటు ప్రభుత్వం, ఇటు వైద్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్టైపెండ్ పెంపుతో పాటు కొన్నింటికి సర్కార్ సానుకూలంగా స్పందించడంతో జూల్ 1న నిర్వహించ తలపెట్టిన తమ సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

## మరి కాసేపట్లో నిన్ను చంపేస్తం

రఘునందన్‌కు మరోసారి బెదిరింపు



**హైదరాబాద్, జూన్ 29, (మనం బ్యూరో):** బీజేపీ ఎంపీ రఘునందన్ రావుకు మరోసారి బెదిరింపు కాల్ వచ్చింది. మరికాసేపట్లో నిన్ను చంపేస్తామనీ, ఆపరేషన్ కగార్ ఆగంతకులు హెచ్చరించారు. తమ టీమ్‌లు హైదరాబాద్‌లో ఉన్నాయని దమ్ముంటే

...మిగతా 2లో

నాంపల్లి నుంచి కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లు

దక్షిణ మధ్య రైల్వే

2

# స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు ప్రమోషన్లు



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** రాష్ట్రంలో ఒకేసారి 33 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు తెలంగాణ ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. 33 మంది డిప్యూటీ కలెక్టర్లను అదనపు కలెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం ఈ పదోన్నతులు కల్పించినట్లు ఉత్తర్వులో రెవెన్యూ కార్యదర్శి పేర్కొన్నారు. వీరికి రూ.96,890ల నుంచి రూ.1,58,380ల వరకు వేతన స్కేలు ఉంటుందని తెలిపారు. పదోన్నతులు కల్పించినందుకు డిప్యూటీ కలెక్టర్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రభుత్వ పెద్దలకు డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి. లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

ఎన్నికకు షెడ్యూల్ విడుదల

నేడు నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కేంద్ర మంత్రి శోభా కరండ్లజే

2

జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి

# తొక్కిసలాటలో ముగ్గురి మృతి

50 మందికి పైగా గాయాలు

ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం



**పూరీ, జూన్ 29:** ఒడిశాలోని పూరీలో మూడో రోజు జగన్నాథ రథయాత్ర వైభవోపేతంగా కొనసాగుతుంది. అయితే, ఈ రథయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. గుండిచా ఆలయం వద్ద

...మిగతా 2లో

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం..
# కుట్రకోణంపైనా దర్యాప్తు



**ఢిల్లీ, జూన్ 29:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం ప్రమాదం వెనుక కుట్ర కోణంపై కూడా దృష్టిపెట్టినట్లు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ వెల్లడించారు. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఈ కేసు దర్యాప్తు చేస్తోందని చెప్పారు. పుణెలో జరుగుతున్న ఓ కాన్‌క్లేవ్ లో ఆయన మాట్లాడారు. ఏఏఐబీ ఆధీనంలో ఉన్న బ్లాక్ బాక్స్ ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపబోమన్నారు. 'అదో విషాద ఘటన. ఏఏఐబీ పూర్తి స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. కుట్ర ఏదైనా ఉందా? అనే అంశంపై కూడా దృష్టిపెట్టారు. సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. చాలా ఏజెన్సీలు దీనిలో పనిచేస్తున్నాయి. రెండు ఇంజిన్లు ఒకేసారి

...మిగతా 2లో

## 90 డిగ్రీల మలుపుతో
# రోడ్డు వంతెన నిర్మాణం

ఏడుగురు ఇంజనీర్ల సస్పెన్షన్

విచారణకు ఆదేశించిన మధ్యప్రదేశ్ సర్కారు



**భోపాల్, జూన్ 29:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఒక రోడ్డు వంతెనను 90 డిగ్రీల మలుపుతో నిర్మించారు. ఇలాంటి డిజైన్లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఏడుగురు ఇంజినీర్లను సస్పెండ్ చేసింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్ శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. అయితే, నిర్మాణ సంస్థ మాత్రం ఆ డిజైన్ను సమర్థించుకోవడం గమనార్హం. సమీపంలో మెట్రో రైల్ స్టేషన్, భూమి కొరత దృష్ట్యా ఇలా నిర్మించడం తప్పితే మరో మార్గం లేదని వివరణ ఇచ్చింది. కొంచెం అదనపు భూమి అందుబాటులో ఉంటే ఆ మార్గం సవ్యంగానే ఉండేదని చెప్పింది. అయినప్పటికీ తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# డ్రైవర్ లెస్ కారు

## తనకు తానే డ్రైవింగ్ చేసుకుంటూ గమ్యం చేరిన టెస్లా కారు

**న్యూయార్క్, జూన్ 29:** ఎంతో మంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న పూర్తిస్థాయి సెల్ఫ్ డ్రైవింగ్ (డ్రైవర్ లెస్) కారు వచ్చేసింది. టెస్లా మొట్టమొదటి సెల్ఫ్ డ్రైవింగ్ కారు జర్నీ వీడియోను ఆ కంపెనీ వాహన ప్రియులతో పంచుకుంది. అసలు మానవ నియంత్రణ లేకుండా ఫ్యాక్టరీ నుంచి నేరుగా యజమాని ఇంటికి కారు డెలివరీ అయింది. 'టెస్లా మోడల్ వై' పేరుతో తీసుకొచ్చిన ఈ కారు కేవలం 30 నిమిషాల్లోనే హైవేలు, ట్రాఫిక్ సిగ్నళ్లు దాటుకుంటూ ప్రయాణించింది. ఫ్యాక్టరీ నుంచి బయలుదేరిన కారు.. రహదారిపై ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వేగాన్ని నియంత్రించుకుంటూ దారిలో ఎదురయ్యే మలుపులు, ట్రాఫిక్ సిగ్నళ్లు, పక్క నుంచి వెళ్లే ఇతర వాహనాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లింది. యజమాని ఇంటికి చేరాక స్వయంగా పార్కింగ్ ప్రదేశానికి వెళ్లి నిలిచింది.ఈ మేరకు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీన్ని తయారు చేసిన టెస్లా టీమ్ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ కారు లోపల ఎవరూ లేరు. బయట నుంచి కూడా ఎవరు ఆపరేట్ చేయలేదు. ఇది పూర్తిగా ఆటోమేటిక్ ప్రయాణం. డ్రైవర్ లేకుండా, రిమోట్ తో ఆపరేట్ చేయకుండా రహదారులపై జరిగిన మొట్టమొదటి ప్రయాణం కూడా ఇదే కావొచ్చు' అని మస్క్ పేర్కొన్నారు. కారు దాదాపు గంటకు 115 కిలోమీటర్ల వేగాన్ని సైతం అందుకుందని టెస్లా ఏఐ సాఫ్ట్ వేర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ ఎల్లుస్వామి వెల్లడించారు. ఆస్టిన్లో జూన్ 22న టెస్లా తన రోబోట్యాక్సీ పరీక్షలను ప్రారంభించింది. ఆ సమయంలో కొందరు ఇన్ఫ్లుయెన్సర్లకు ఈ మోడల్ వై సెల్ఫ్ డ్రైవింగ్ కారులో ప్రయాణించే అవకాశం కల్పించింది.

# తెలంగాణలో బీఆర్ఎస్ పోయింది కానీ అవినీతి పోలేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిస్తూ ఇచ్చిన హామీ ప్రకారం ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌కు పసుపు బోర్డు సాధించారు. పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని సైతం నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నాం. మోడీ ఏదైనా చెప్పారంటే అది తప్పకుండా చేసి చూపిస్తారని అన్నారు. నిజామాబాద్ రైతులు పసుపు బోర్డు కోసం 40 ఏళ్ల పాటు పోరాటం చేశారు. నిజామాబాద్ రైతులు పండించిన పసుపు భవిష్యత్‌లో ప్రపంచమంతా ఎగుమతి అవుతుంది. పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటుతో స్థానిక రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగనున్నాయని స్పష్టం చేశారు. భారత్ ఆర్గానిక్ లిమిటెడ్, భారత్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటవుతున్నాయనీ, నిజామాబాద్ నుంచి పసుపు అమెరికా, యూరప్ వంటి దేశాలకు సైతం ఎగుమతి అవుతుందని వెల్లడించారు. నిజామాబాద్ ప్రజల



ఉత్సాహం చూస్తుంటే రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో బీజేపీ విజయం ఖాయమైందని తెలుస్తోందన్నారు. ఇటీవల పాకిస్థాన్‌పై నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ పహల్గాం ఘటనకు ప్రతీకారంగా పాకిస్థాన్ ఉగ్రమూకలకు దీటైన సమాధానం చెప్పామన్నారు. నక్సల్స్ సైతం ఆయుధాలు పక్కనబెట్టి లొంగిపోవడం మంచిదని సూచించారు. నక్సల్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆయుధాలు పట్టిన వారిని వదిలేదని లేదని హెచ్చరించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సల్స్‌కు మద్దతుగా మాట్లాడే వారు వారి బాధిత కుటుంబాల పరిస్థితి తెలుసుకోవాలన్నారు. 2026 మార్చి చివరి వరకు నక్సల్స్‌ను పూర్తిగా అంతమొందించి మావోయిస్టు ముక్త్ భారత్‌ను రూపొందిస్తామని ప్రకటించారు. స్పష్టం చేశారు. సరెండర్ అవండి లేదంటే అంతమేనని హెచ్చరించారు. ఆదివాసీల పేరుతో నక్సలైట్లు విధ్వంసం సృష్టిస్తున్నారనీ, నక్సలైట్లకు తెలంగాణ అడ్డా కాబోదన్నారు. గతంలో నక్సలైట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం చర్చలు జరిపింది. మేం కాంగ్రెస్ మాదిరి కాదు...ఆయుధాలు వదిలితేనే చర్చలు జరుపుతామన్నారు. ఆయుధాలు పట్టుకున్నోళ్లతో ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చలు ఉండవని విస్పష్టంగా ప్రకటించారు.

# కుట్రకోణంపైనా దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

విఫలం అవ్వడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదు. ఇది అరుదైన కేసు. దర్యాప్తు నివేదిక వస్తే గానీ రెండు ఇంజిన్లు విఫలం అయ్యాయా? లేక ఇంధన సరఫరాలో సమస్య ఉందా? అనేది తేలుతుంది. బ్లాక్ బాక్సుని కాక్పిట్ వాయిస్ రికార్డర్లో పైలట్ల సంభాషణ నిక్షిప్తమై ఉంది. నివేదిక మూడు నెలల్లో వస్తుంది. ఇప్పుడే దానిపై మాట్లాడటం తొందరపాటు అవుతుంది' అని మురళీధర్ చెప్పారు.

విశ్లేషణ కోసం బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపనున్నారనే ప్రచారాన్ని మురళీధర్ కొట్టిపారేశారు. అది ఎక్కడికీ పోదని.. దర్యాప్తు సంస్థల కస్టడీలో ఉందని చెప్పారు. దేశంలో వాడుతున్న 33 డ్రీమ్లైనర్ విమానాలను డీజీసీఏ ఆదేశాల మేరకు క్షుణ్ణంగా తనిఖీలు చేశారన్నారు. ప్రజలు ఇప్పుడు భయపడటం లేదని, వారు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారని చెప్పారు. డీజీసీఏ 419 సాంకేతిక సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడంపై పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు విమానయాన సంస్థలు సొంతగా ఎవర్నీ నియమించుకోకూడదని, డీజీసీఏ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆయా సంస్థలు సుదీర్ఘ సమయం పనిచేయాలని పైలట్లపై ఒత్తిడి చేసి వేధిస్తే డీజీసీఏను సంప్రదించాలని సూచించారు.

# తొక్కిసలాటలో ముగ్గురి మృతి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రథయాత్ర ముగిసిన తర్వాత శనివారం జగన్నాథ ఆలయం నుంచి రథాలు శారద బలి వద్దకు చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున 4.20 గంటల సమయంలో రథాలపై ఉన్న దేవతలను చూడటానికి భక్తులు గుండిచా ఆలయం వద్దకు భారీగా చేరుకున్నారు. దర్శనం కోసం అందరూ ఒక్కసారిగా ముందుకు రావడంతో తొక్కిసలాట నెలకొంది. వెంటనే స్పందించిన భద్రతా బలగాలు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాయి. ఈ ఘటనపై ఒడిశా మంత్రి పథ్వీరాజ్ హరిచందన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు.

పూరీ రథయాత్రకు శనివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక జనసమూహం, అలసట కారణంగా దాదాపు 750 మంది భక్తులు అస్వస్థతకు గురవ్వడంతో అధికారులు వారిని ఆస్పత్రికి తరలించారు. వారిలో చాలామందిని ప్రథమ చికిత్స తర్వాత డిశ్చార్జ్ చేశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన 12 మంది భక్తులు కటక్లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

### ఉన్నత స్థాయి దర్యాప్తు..

ఈ ఘటనపై ఒడిశా సీఎం మోహన్ చరణ్ స్పందించారు. ప్రభుత్వం తరఫున క్షమాపణలు కోరారు. భద్రతా వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట చోటుచేసుకుందని భక్తులు ఆరోపించారు.



# జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఆదివారం ఆయన గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. జూలై 4న గాంధీభవన్‌లో పీఏసీ సమావేశం ఉంటుందనీ, అనంతరం విస్తృత స్థాయి సమావేశం, అదే రోజు ఎల్బీ స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభకు 15000 మంది హాజరవుతారన్నారు. జై బాపు, జై సంవిధాన్ కమిటీ మీటింగ్‌లో భాగంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు బీజేపీ పాసిస్టు విధానాలకు అద్దం పడుతున్నాయనీ, తనకు దివంగత కాంగ్రెస్ నేత డీఎస్ రాజకీయ ఓనమాలు నేర్పినట్లు వెల్లడించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను డీఎస్ ఎప్పుడూ ఒప్పుకోలేదనీ, అలాంటిది ఆయన విగ్రహాన్ని బీజేపీ నేతలు ఆవిష్కరిస్తే ఆయన ఆత్మ క్షోభిస్తుందని పేర్కొన్నారు. డీఎస్ విగ్రహంకు ప్లేస్ ఇచ్చింది రాష్ట్ర ప్రభుత్వమనీ, కాంగ్రెస్ నాయకులకు ఎవరికీ ఆహ్వానం లేదన్నారు. డీఎస్ బీజేపీలో ఏనాడూ లేరనీ, కొన్ని కారణాల వల్ల బీఆర్ఎస్‌లో చేరారని పేర్కొన్నారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతీ ఒక్కరినీ గుర్తిస్తామనీ, ముఖేష్ గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# మహా న్యూస్‌పై దాడి కేసు..

- గెల్లు శ్రీనివాస్ అరెస్ట్
- మధుసూదనాచారి, బాల్క సుమన్‌పై కేసు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మహా న్యూస్‌పై జరిగిన దాడి ఘటనలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, గెల్లును అరెస్ట్ చేసేందుకు తెలంగాణ భవన్‌కు వెళ్లారు. ఈ సమయంలో అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ బంజారాహిల్స్ పీఎస్‌లో వారిపై మరో కేసు నమోదు చేశారు. ఈ దాడి ఘటనలో నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసులు బుక్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### దాడిని ఖండించిన కాంగ్రెస్..

ఈ దాడిని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం మహా న్యూస్ కార్యాలయాన్ని సందర్శించి, జర్నలిస్టులు, సిబ్బందికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ దాడి వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని, కేటీఆరే స్వయంగా గూండాలను రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

# తెలంగాణలో ఈదురుగాలులతో వర్షాలు

- హెచ్చరించిన ఐఎండీ

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** రాగల మూడురోజులు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర గుజరాత్ మీదుగానున్న ఉపరితల ఆవర్తనం నుంచి వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌ఘడ్, ఉత్తర ఒడిశా మీదుగా అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతూ.. సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణ దిశగా వంగి ఉందని తెలిపింది. తెలంగాణలో మూడురోజులు వానలు కొనసాగుతాయని చెప్పింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండలో బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# నాంపల్లి నుంచి కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లు

- దక్షిణ మధ్య రైల్వే

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నుంచి కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు వెల్లడించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. ఈ ప్రత్యేక రైళ్లు జులై 2 నుంచి 25 వరకు రాకపోకలు సాగిస్తాయని తెలిపింది. హైదరాబాద్-కన్యాకుమారి (07230) రైలు జులై 2 నుంచి 23 వరకు నాలుగు ట్రిప్పులు నడుస్తుందని.. ప్రతి బుధవారం సాయంత్రం 5.20 గంటలకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఈ రైలు నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి.. శుక్రవారం



వేకువ జామున 2.30 గంటలకు కన్యాకుమారి స్టేషన్కు చేరుకుంటుందని చెప్పింది. ఇక కన్యాకుమారి-హైదరాబాద్ (07229) రైలు జులై 4 నుంచి 25 వరకు రాకపోకలు సాగిస్తుందని పేర్కొంది.

ప్రతిరోజు శుక్రవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు సాయంత్రం 2.30 గంటలకు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పింది. ఈ రైలు రెండు మార్గాల్లో సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూర్, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాటపడి, తిరువణ్ణామలై, విల్లుపురం, చిదంబరం, మయిలదుతురై, కుంభకోణం, తంజావూర్, తిరుచిరాపల్లి, దిండిగుల్, కొడైకెనాల్, మధురై, విరుదునగర్, సాతూర్, కోవిల్‌పట్టి, తిరునల్‌వేలి, నాగర్ కోయిల్ స్టేషన్లలో రైలు ఆగుతుందని తెలిపింది. రైలులో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయని.. ప్రయాణికులు రైలును ఉపయోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే కోరింది.

# రేపు బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

**హైదరాబాద్, జూన్ 29, (మనం బ్యూరో):** సంఘటన పర్వ్ 2025లో భాగంగా బీజేపీ జాతీయ కౌన్సిల్, రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక కోసం షెడ్యూల్ విడుదలైంది. ఈమేరకు పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ఆదివారం వివరాలు ప్రకటించారు. ఇందులో భాగంగా సోమవారం మద్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఉపసంహరణ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ ఎన్నికల నిర్వహణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరుగుతుంది. ఈ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కేంద్ర మంత్రి శోభా కరండ్లజే వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల అనంతరం మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మంగళవారం అధికారికంగా ప్రకటించనున్నారు.

# ట్రకోమా రహిత దేశంగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

మోడీ వినిపించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలన్నారు.

ఫుట్బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని సూచించారు. మేఘాలయ ఎరీసిల్కుకు జీఐ ట్యాగ్ లభించిందని అభినందించారు. పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకతన్నారు. ఇక తెలంగాణ భద్రాచలంలోని ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట బిస్కెట్లు తయారు చేస్తున్నారని.. అవి హైదరాబాద్ నుంచి లండన్ కు కూడా ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. ఈ మహిళలే మూడు నెలల్లో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్రయించారన్నారు. ఆంధ్రప్రదేశ్లోని పల్నాడు జిల్లాలో బౌద్ధక్షేత్రాలకు విదేశాల్లో అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అందరూ తమ ప్రాంతాల్లోని బౌద్ధ క్షేత్రాలను ఒక్కసారైనా సందర్శించాలన్నారు.

# మరికాసేపట్లో నిన్ను చంపేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకోవాలని సవాల్ విసిరారు. రఘునందన్ రావు 2 రోజుల క్రితం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో కాలికి సర్జరీ చేయించుకున్నారు. అక్కడ చికిత్స పొందుతుండగానే ఆదివారం మరోసారి బెదిరింపు కాల్ వచ్చింది. ఇదిలా ఉండగా, ఎంపీ అనుచరులు ఫోన్ చేసిన వ్యక్తితో మాట్లాడారు. ఎక్కడి నుంచి కాల్ చేస్తున్నారని ప్రశ్నించగా, మావోయిస్టులు మధ్యప్రదేశ్ నుంచి బయలుదేరారు. రాత్రి 12 గంటల వరకు సార్ ఎక్కడ ఉంటే అక్కడికి చేరుకుంటారు. సార్‌ను జాగ్రత్తగా ఉండమని చెప్పండని పేర్కొన్నారు. ఆగంతకుడు 912143352974 అనే నంబరు నుంచి ఫోన్ చేసినట్లు డీజీపీ, సంగారెడ్డి ఎస్పీకి ఫోన్‌లో సమాచారం అందించారు. వారం రోజుల క్రితం రఘునందన్‌రావుకు బెదిరింపు కాల్ రాగా జూన్ 26న రాష్ట్ర ప్రభుత్వం భద్రతను పెంచింది. ఆయన పాల్గొనే టూర్లలో ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# మెడికోల స్టైపెండ్ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

పీజీ డాక్టర్లకు ఫస్ట్ ఇయర్లో రూ.67,032, సెకండ్ ఇయర్లో రూ.70,757, ఫైనల్ ఇయర్లో రూ.74,782 గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

### వైద్యారోగ్యశాఖలో 16వేల మంది సిబ్బంది పదవీ కాలం పొడిగింపు

వైద్యారోగ్యశాఖలోని డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, హానరోరియం, మల్టీటాస్కింగ్ విధానంలో పనిచేస్తోన్న 16వేల మంది పదవీ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంఈ పరిధిలో రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో 4,772 మంది, ఔట్ సోర్సింగ్ విధానంలో 8,615 మంది, హానరోరియమ్ పోస్టుల్లో 3,056 మంది, ఎంటీఎస్ విధానంలో ఐదుగురు పనిచేస్తున్నారు.మొత్తం 16,448 మంది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ ఆసుపత్రులు, నర్సింగ్, డెంటల్ కాలేజీల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో టీచింగ్ ఫ్యాకల్టీ సహా.. నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, డీఈఓలు, నాలుగో తరగతి ఉద్యోగులు ఉండటం గమనార్హం. డీఎంఈ విభాగంలో సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ ఆదేశాలు 2026 మార్చి 31వరకు కొనసాగనున్నాయి. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి థర్డ్ పార్టీ నుంచి, మిగతా విభాగాల వారికి ప్రభుత్వం నుంచి నేరుగా వేతనాలు అందించనున్నారు

# పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి..

- తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** వివాహ సంబంధాలపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి ఆ హామీని నెరవేర్చక పోవడం క్రిమినల్ చర్య కిందకు రాదని హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. పెళ్లి చేసుకుంటాను అని మాట ఇచ్చి.. తప్పడం మోసం కావచ్చేమో గానీ.. నేరంగా భావించే మోసం మాత్రం కాదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును వెల్లడించింది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి ఆ హామీని నెరవేర్చక పోవడం క్రిమినల్ చర్య కిందకు రాదని హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. వివాహ హామీని ఉల్లంఘించినందుకు నిందితుడిపై మోసం కేసును కొనసాగించలేమని స్పష్టం చేసింది. అయితే పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చేటప్పుడే.. మోసం చేయాలనే ఉద్దేశం ఉందని తేలితే.. అది నేరమే అవుతుంది. అది నిరూపించాల్సిన బాధ్యత బాధితులకు ఉంటుంది.

# పూర్వ విద్యార్థుల.. అపూర్వ భేటీ



- మన(ం) ఆలోచన నలుగురికి ఉపయోగపడాలే
- తెలుగు విశ్వవిద్యాలయంలో కలిసిన జర్నలిజం ఆలుమ్ని

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** వారంతా జీవితంలో స్థిరపడి, విభిన్న రంగాలలో పనిచేస్తున్నప్పటికి... అందరి ద్యాస, ఆలోచన ఒక్కటే.. ఓ నలుగురికి సాయపడాలా... మనం నేర్చుకున్న ఈ చదువుతో ఓ పది మందికి సహాయపడాలన్నదే వారి తాపత్రయం.. ఉన్నత చదువులలో బాగంగా... ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే చదివాం(కలిశాం) అన్నట్లుగా.. మాస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ జర్నలిజం (ఎంసీజే) కోర్సుతో.. వీరంతా ఆ చదువులమ్మ చెట్టు నీడలో సరస్వతి పుత్రులుగా ఇక్కడే కలిసిన వీడదీయ(లేని)రాని స్నేహ బంధం వారిది.. మనం చదువుకున్న ఈ చదువు.. సమాజానికి మేలు చేయాలా? మనం.. మన సేవలు కొందరికైనా ఉపయోగపడాలా అని పరితపించే వారి ఆలోచనకు (సురవరం ప్రతాపరెడ్డి హాల్)తెలుగు విశ్వవిద్యాలయం ఓ వేదికైంది. చాలం కాలం తర్వాత కలిసిన వీరంతా అనుకున్నదే తడవుగా, ఇటివల మనం త్వరలో కలుద్దాం అనుకున్నారు. ఇంకో ఆలోచనే లేకుండా.. అలస్యం చేయకుండా, ఆదివారంనాడు తెలుగు యూనివర్సిటీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలు వారి నడుమ చర్చకొచ్చాయి. జర్నలిజం పూర్వ విద్యార్థులుగా ఎ(దన్న)దైనా చేయాలి? చేద్దాం.. దానికి సంబందించిన ఓ కార్యచరణను రూపోందించేందుకు అందరి సూచనలు, అభిప్రాయాలు తీసుకొని, మరి కొద్ది రోజుల్లో భారీ వేధికకు శ్రీకారం చుట్టునున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా తెలిపారు.



# వెనక్కి తగ్గిన 'మహా' సర్కారు

**ముంబై, జూన్ 29:** ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికీ హిందీ భాషను విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ఇప్పుడు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకున్న రాష్ట్ర మంత్రివర్గం ఈ విధానంపై ముందుకు పోవడమెట్లా? ఎట్లా అమలు చేయాలనే దానిపై విద్యావేత్త నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు.

'ఒకటో తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి సంబంధించి ఏప్రిల్, జూన్ నెలల్లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానం అమలుపై సిఫార్సులు చేసేందుకు డా. నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం' అని ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని డా.రఘునాథ్ మషేల్కర్ కమిటీ చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్ధవ్ ఠాక్రే అంగీకరించారని, దాని అమలుపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే.. ఇంగ్లీష్, మరాఠీ మీడియం పాఠశాలల్లో చదువుతున్న 1-5 తరగతుల విద్యార్థులకు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 16న ఉత్తర్వులు జారీ చేసింది.

### ఆప్షనల్ గా కూడా హిందీకి తిరస్కరణ..

దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. హిందీని ఆప్షనల్ గా మారుస్తూ సవరణ ఉత్తర్వు జారీ చేసింది. అయినా.. ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు కొనసాగాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై పోరాడేందుకు శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. ఈ పరిణామాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతో వచ్చే నెల 5న శివసేన యూబీటీ, ఎంఎన్ఎస్ల ఆధ్వర్యంలో నిర్వహించాలనుకున్న నిరసనను రద్దు చేస్తున్నట్లు సంజయ్ రౌత్ తెలియజేశారు.

# బీజేపీ విధానాలతో సమాజంలో అసమానతలు

- జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



రంగారెడ్డి, జూన్ 29 (మనం న్యూస్): బిజెపి విధానాలతో సమాజంలో అసమానతలు పెరుగుతున్నాయి అని రంగారెడ్డి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. ఆదివారం రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హాజరు అయ్యారు . ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో బిజెపి హిందూ అనే పేరుతో మనువాద సిద్ధాంతాన్ని చూపించడానికి బిజెపి తప్పుడు విధానాలనే అనుసరిస్తుందన్నారు. పాఠ్యాంశాలని కాషాయీకరణ చేయడానికి పూనుకుందని దీనిని ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్యన విభజన రేఖను సృష్టిస్తుందని, దేశంలో ప్రభుత్వ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని యాదయ్య అన్నారు ఆపరేషన్ కగారు పేరుతో పేద ప్రజల కోసం పోరాడే వారిపై దాడి చేసి ఎన్కౌంటర్ చేసి ఫారెస్ట్ లో ఉన్న ఖనిజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని ఉన్నారు, ప్రభుత్వ సంపదని మొత్తము ప్రభుత్వ రంగ పరిశ్రమలను, బ్యాంకులను, రైల్వే, విమానాశ్రయాలను, స్టీల్ ఇండస్ట్రీని మొత్తము కార్పొరేట్ శర్తులకు కట్టబెడుతున్నారని దీన్ని ప్రతిఘటించి పోరాడే వారిని మీరు నక్సలైట్లని, అర్బన్ నక్సలైట్లని తప్పుడు ప్రకటనలు చేసి నిర్బంధిస్తున్నారని అన్నారు. దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్య , పేదరిక నిర్మూలన, కష్టజీవులకు మెరుగైన సౌకర్యాలు కల్పించకుండా ఉన్న హక్కులని అరించి వేస్తూ లేబర్ కోడులను రైతులకు కనీస మద్దతు ధర కల్పించకుండా రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి పాలకులు తప్పుడు విధానాలు అనుసరిస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రజాస్వాల్ని కదిలించి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బిజెపి అనుసరిస్తున్న విధానాలతో సమాజంలో అసమానతలు పెరిగి పేదలు మరింత పేదలు కార్పొరేట్ శక్తులకు కోట్లాది కోట్ల రూపాయల్ని బ్లాక్ మనీ వెనుకేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ , కీసరి నర్సిరెడ్డి , ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సరూర్నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, యాదయ్య, వీరయ్య కనకయ్య, మంతెన యాదయ్య, రామస్వామి, కట్ట శ్రీనివాస్, గణేష్ గౌడ్ ,గంధం మనోహర్, సిహెచ్ మల్లేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

## జులై 9 సమ్మెను విజయవంతం చేయాలి



- ఏఐటియూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామస్వామి

చేవెళ్ల, జూన్ 29(మనం న్యూస్ ): జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె .రామస్వామి పిలుపునిచ్చాయి. ఈ మేరకు చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా, వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన నూతన మార్కెట్ విధానానికి వ్యతిరేకంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నమన్నారు. సుప్రీం కోర్ట్ ఆదేశానుసారం అసంఘటితరంగ కార్మికుల కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విపక్షాలను కూడా కలుపుకోవాలని, సమ్మె విజయవంతం చేసేందుకు, అవసరమైతే బంధు రూపం తీసుకోవాలని నాయకులు నిర్ణయించారు. అన్ని రంగాల్లోని కార్మికుల యాజమాన్యాలకు సమ్మె నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు.కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు మక్బుల్, ఏఐటియూసీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహా న్యూస్ ఛానల్ పై దాడి చేయడం హేయమైన చర్య



చేవెళ్ల, జూన్ 29(మనం న్యూస్ ): అధికారం కోల్పోయినందుకే మీడియాపై దాడి చేయిస్తున్నారు అని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాన్ పాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. మహా టీవీ ఛానల్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. మహా న్యూస్ ప్రధాన కార్యాలయం పై జరిగిన దాడి సంఘటనలు సభ్య సమాజంలో తలదించుకునేలా ఉన్నాయన్నారు. పోలీసు యంత్రాంగం దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీరాంహిల్స్ కాలనీ కమ్యూనిటి హాల్ నందు భీమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి , కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- (రంగారెడ్డి మనం న్యూస్)



## ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం



కడ్తాల్, జూన్ 29 ( మనం, న్యూస్ ): ఆమనగల్లు మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో ఆదివారం కళ్ళు విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో నీలాద్రి హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 250 పైగా రోగులకు బీపీ,షుగర్, థైరాయిడ్, జనరల్ చెకప్, జనరల్ పీజిషియన్ మరియు గైనకాలజీ వంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు విక్రమ్ రెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రజలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, కళ్ళు రాంరెడ్డి, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డీ, మల్లికార్జున రెడ్డీ, నరేందర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, నారోజు భాస్కర్, రామలింగం, కొండల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, అల్వాల్ రెడ్డి, శంకరయ్య, తెల్గమల్ల రవి కుమార్, శ్రీధర్, విజేందర్, మహేశ్, మల్లేష్, కలకొండ నరేష్ అబ్బురాములు, రవీందర్, గండికోట నరేష్, శేఖర్ గౌడ్ డాక్టర్లు సిద్ధార్థ్, సైదులు, హిందూ సిస్టర్, సురేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని కౌకుంట్లలో కప్పతల్లి ఆటపాటలు



- గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసిన రైతులు

చేవెళ్ళ, జూన్ 29(మనం న్యూస్ ):వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకుంటూ చేవెళ్ల మండల పరిధి కౌకుంట్ల గ్రామంలో ఆదివారం గ్రామస్తులు, రైతులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. రోకలి బండకు కొత్త గుడ్డలో కప్పను కట్టి, దానిని రోకలిబండ మధ్యలో వేలాడదీసి, ఆ కప్పను పసుపు, కుంకుమలతో అలంకరించి ఊరేగించారు. గ్రామంలో ప్రతి ఇంటినుంచి బిందెలలో నీళ్లు తీసుకొచ్చి గ్రామ ఆలయాల్లో ప్రత్యేకంగా అభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. ఈ ఆచారం తరతరాలుగా వస్తున్నదన్నారు. పంట సాగులో నిమగ్నమై ఉండాల్సిన ఆరుద్ర కార్తె ప్రారంభమయ్యేనా ఈ ఏడాది ఇంకా వానజాడే లేకపోవడంతో నాటిన విత్తనాలు కాపాడుకోడానికి నానా ప్రయత్నాలు చేస్తూ.. అవస్థలు పడుతున్నామని రైతులు తెలిపారు. ఇలా కరువు సంభవించినప్పుడు గ్రామదేవతను పూజించి కప్పతల్లి పాటలు పాడుతూ ఆడితే సకాలంలో వర్షాలు కురుస్తాయని, ఇది తరతరాలుగా వస్తున్న సంప్రదాయమన్నారు. గతంలో కరువు వచ్చినప్పుడు కూడా కప్పతల్లి ఆట పాటల వల్ల వర్షాలు కురిసాయని రైతులు తెలిపారు.

## టాప్ 12 మంది బాక్సర్స్ పాల్గొనడం గర్వించదగ్గ విషయం



- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

రంగారెడ్డి, జూన్ 29 (మనం న్యూస్): ఎలైట్ ఉమేన్స్ నేషనల్ లేవేల్ బాక్సింగ్ టోర్నమెంట్ 2025 కార్యక్రమం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ టాప్ 12 మంది బాక్సర్స్ పాల్గొనడం గర్వించదగ్గ విషయం అని తెలిపారు. ఒలింపిక్స్ మెడలిస్టులు,వరల్ ఛాంపియన్స్ పాల్గొనడం చాలా ఆనందదాయకంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు స్టేట్ సెక్రటరీ రవీందర్,అధ్యక్షులు మన్మోహన్,సరూర్ నగర్ స్టేడియం కోచ్ కుమార్,నిజాం కాలేజ్ గ్రౌండ్ బాక్సింగ్ కోచ్ దుర్గ ప్రసాద్, రవిముదిరాజ్,సొంటి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై మహా టీవీ అసత్యపు ప్రచారాన్ని మానుకోవాలి

### చేవెళ్ల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్



చేవెళ్ల, జూన్ 29(మనం న్యూస్ ): జర్నలిజం ముసుగులో కేటీఆర్ పైన మహాటీవీ అసత్యపు ప్రచారాన్ని మానుకోవాలని టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫోన్ టాపింగ్ వివాహంలో టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై దురుద్దేశపూర్వకంగా అసత్య వార్తలు ప్రసారం చేసిన మహా టీవీ ఛానల్ పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ ఫోన్ టాపింగ్ ఆహారంలో కొన్ని రోజుల నుంచి తప్పుడు కథనాలు మహా టీవీ వార్తలు ప్రసారం చేస్తున్నదని ఆరోపించారు. కేటీఆర్ పై జర్నలిజ ముసుగులో మహా టీవీ యాజమాన్యం వ్యక్తిగతంగా విషం చిమ్ముతండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ గ్యారంటీల అమలు 4250 నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే రేవంత్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తుందన్నారు.

## డాక్టర్. బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### విగ్రహ ప్రతిష్టాపనకు రూ. 1లక్ష విరాళం

### బిజెపి యువ నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి



చేవెళ్ల, జూన్ 29(మనం న్యూస్ ): దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగాన్ని రచించిన డా.బీఆర్ అంబేద్కర్ను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని బిజెపి యువ నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కొరకు రూ.1లక్ష ను మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి కుమారుడు బిజెపి నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....అతిపెద్ద ప్రజా స్వామ్యమైన భారతదేశానికి రాజ్యాంగం రచించి, దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు అంబేద్కర్ కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు అనంతరెడ్డి , మున్సిపల్ మండల నాయకులు, కార్యకర్తలు, తంగడిపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



కడ్తాల్, జూన్ 29 ( మనం, న్యూస్): కడ్తాల్ మండల కేంద్రంలో నిరుపేద ప్రజలకు నూతన రేషన్ కార్డులను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోసు రవి ఆధ్వర్యంలో ఆదివారం లబ్ధిదారులకు పంపిణి చేశారు. గత 10 సంవత్సరలుగా పాలించిన బిఆర్ ఎస్ ప్రభుత్వం ఒక కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందకుండా చేయడం జరిగింది. ప్రస్తుతం ఉన్న తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ప్రభుత్వం వచ్చిన 18 నెలలలోనే లబ్ధిదారులు అయినా నిరుపేద కుటుంబాలకు ఈరోజు రేషన్ కార్డులను అందజేయడం జరిగింది. ప్రభుత్వం తరపున అందే ప్రతి పథకం రేషన్ కార్డు ద్వారా జతపర్చడం జరుగుతుంది. తెలంగాణ ప్రజలను ఆదుకునే ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం. కడ్తాల్ మండలంలోని 24 గ్రామపంచాయతీల నిరుపేద ప్రజలందరూ మీసేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోగలరని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోస్ రవి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో క్యామ రాజేష్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇమ్రాన్ బాబా నియోజవర్గ యూత్ వైస్ ప్రెసిడెంట్, ఆకాష్ గౌడ్ కార్యదర్శి, భాను కిరణ్ టౌన్ ప్రెసిడెంట్, కృష్ణ, శ్రీను, రామకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఐవిఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




రంగారెడ్డి, జూన్ 29 (మనం న్యూస్): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ 12 సంవత్సరాల వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఐవిఎఫ్ సికింద్రాబాద్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం అయ్యింది అని ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త,లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ లు అన్నారు. వారు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన బెలిదె రవికుమార్ సభ్యులందరినీ అభినందించడం జరిగింది. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్న ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ను అభినందించడం జరిగింది.మూడు వేల యూనిట్ల రక్తాన్ని తలసేమియా చిన్నారుల కోసం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు పబ్బ చంద్రశేఖర్,కటకం శ్రీనివాస్,డాక్టర్ నీల శ్రీధర్,ఐవిఎఫ్ సికింద్రాబాద్ జోన్ నాయకులు తిరువీధి ప్రభాకర్,నాగమల్ల సురేందర్ గుండా శ్రీనివాస్,కూనిశెట్టి వెంకటేశ్వరరావు,కొమ్మూరి భాస్కర్,బూశెట్టి శ్రీనివాస్,ఉప్పల వేణుగోపాల్,కోలా సురేష్,గంగాధర్ లు పాల్గొనడం జరిగింది.

## ప్రముఖ హ్యూమనిస్ట్ వంగూరి యాదవ రెడ్డికి గౌరవ డాక్టరేట్ అవార్డు

- ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డు అందజేత
- యాదవ రెడ్డిను సన్మానించిన దేప భాస్కర్ రెడ్డి



రంగారెడ్డి, జూన్ 29 (మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం గిరి కొత్తపెల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు వంగూరి యాదవ రెడ్డి కి గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ తరపున ఆయనకు ఈ గౌరవం కలిగింది. భాగ్యనగరంలోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలోనీ ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం నాడు నిర్వహించిన కార్యక్రమంలో ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ,స్ఫూర్తి అకాడమీ అధినేత చెన్నారెడ్డి చేతుల మీదుగా వంగూరి యాదవ రెడ్డి గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. నేషనల్ హ్యూమన్ రైట్స్, కన్స్యూమర్ ఫోరం ద్వారా సామాజిక సేవ, పార్కింగ్ నిబద్ధత, వాటర్ బాటిల్స్ మీద ఎమ్మార్పీ ఏర్పాటు వంటి సేవలు, అన్ని విభాగాల్లో వంగూరి యాదవ్ రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించామని నిర్వాహకులు తెలిపారు. కరోనా సంక్షోభ సమయంలోను పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న యాదవ రెడ్డి సేవలు ప్రశంసనీయం అని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి యాదవ రెడ్డి ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి గారు మాట్లాడుతూ వంగూరి యాదవ రెడ్డి సేవా దృక్పథం, ప్రజల పట్ల నిబద్ధత, విలువలతో కూడిన జీవనశైలి ఆయనను ఈ గౌరవానికి అర్హుడిగా చేశాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణాపురం డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్ నేత, వెంకటేష్ గుప్తా, సురేష్ తలాటి రమేష్ నేత, ,లింగస్వామి గౌడ్, శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలి




- డిసిసిబి చైర్మన్ కొత్త కురువ సత్తయ్య

చేవెళ్ల, జూన్ 29 ( మనం న్యూస్): చేవెళ్ల ప్రాథమిక సహకార సంఘాన్ని డిసిసిబి చైర్మన్ కొత్త కురువ సత్తయ్య ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల సొసైటీకి తమ వంతు సహకారాలు అందిస్తానని తెలిపారు. సకాలంలో రైతులందరికీ అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. అనంతరం పిఏసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి తన సొంత డబ్బులు వెచ్చించి భవనాన్ని నిర్మించినందుకు అభినందించారు. అనంతరం డిసిసిబి చైర్మన్ కొత్త కురువ సత్తయ్యను చేవెళ్ల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవి గౌడ్, డైరెక్టర్స్, సహకార సంఘం చైర్మన్లు, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, చేవెళ్ల పిఏసిఎస్ డైరెక్టర్స్ మధుసూదన్ రెడ్డి, నర్సింలు, ఎజిఎం ప్రభాకర్ రెడ్డి, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనం Manam
Editorial
సాహిత్యం

## రా... సీతా! కలిసి నడుద్దాం!

ఒక్కోసారి మనమే
ఇష్టంగా వేసుకున్న
సంకెళ్లను తెంచుకోలేము
ఆకురాలు కాలం ఆగమిస్తే
చెట్లు ఆకులు రాలుచుకున్నట్లే
దిగిపోయే కాలం ఆసన్నమైనప్పుడు
బంధనాలన్నీ అప్రయత్నంగా
విముక్తిని ప్రసాదిస్తాయి!
ఇష్టమో అవసరమో
ఎంచుకున్న రంగాన్ని
సస్యశ్యామలం చేశాక
పచ్చని చదువుల వనాన్ని
చూసినప్పుడల్లా
మనసు గాలిలో తేలిపోతుంది
నూట్లో ఎవరో ఒకరు
వెనక్కి మళ్లి చూసుకొని
ఇదిగో ఇందాక.. నేను నడిచొచ్చిన దారి
సన్నాఫ్ మాణిక్యం వేసిందే అంటే చాలు
మనసు కాస్త అవనత మెరుగని
జాతి పతాకమైయితది!

ఆఖరి రోజు
చెప్పాల్సిన పాఠం కొంచెం మిగిలిపోతే
గుండె బరువెక్కి పోతుంది
ఒంటి కాలు మీద నుంచొని
సాధించిన విద్యలన్నీ ధారబోసిన
మహా మునిలా నిష్కామంగా బయటకొస్తుంటే
ఇంతకాలం ఇష్టంగా మోసిన బరువు
తడియారని గుండెతో సెలవు చీటీ రాసిచ్చినట్లు
ఉంటది!
వేళ్ళ సందుల్లోంచి
జారిపోతున్న చాక్ పీస్ దృశ్యం
ఏ కవి వర్ణించే కవిత్వానికైనా
సీతారాంకున్నంత నిజాయితీ ఉండదు
సీతా! ఇకపై నీకు నాలాగా గదులుండవు!
విశాలమైన మైదానాలే మన వేదికలు

రా కలిసి నడుద్దాం!
మొహమాటలకు తల ఒగ్గని
విస్ఫోటనాలకు కేంద్రబిందువులవుదాం!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

# కవితా భిషక్కు 'సీతారాం'



బడిగంటకు పిల్లలు పరుగెత్తినట్లు కవిత్వ స్పర్శ తగిలితే చాలు ఉప్పొంగి పోతాడు సీతారాం. గుడిముందు ధ్వజస్తంభంలా ! నిలువెత్తు అక్షర శిఖరమై నిలబడుతాడు. పిల్లలతో మైమైక పోతాడు సంభాషిస్తాడు. ఆలోచనలకు అంటుగడ్తాడు. పిల్లలకు గులాబీ ఎంతిష్టమో సీతారాం కూడ అంతే యిష్టం.చందమామలా విద్యార్థులను ఆకర్శిస్తాడు క్షణాల్లో బాలకవులతో బాలోత్సవ ఊరేగింపులు. అతడెక్కడుంటే అక్కడ కొత్త కవిత్వానికి జీవం పోస్తాడు. కవితకు కాళ్ళొస్తాయి మానవతావాది. హస్యం వ్యంగ చతురత ఎక్కువ. కుదురుగా నిలువడు కూర్చోనివ్వడు. కవిత్వానికి అలంకార కలంకారై నడక నేస్తాడు. సీతారాం వున్నచోట కోలాహలం. నిరాడంబరత్వం మితభాషి. రావులపాటి సీతారాం విమర్శకుడిగా, సామాజిక ఉద్యమకారుడిగా, తెలుగు అధ్యాపకుడిగా పేరొందాడు.

కళాశాలలో ఒకవైపు విద్యార్థులకు బోధిస్తూనే తెలుగు కవిత్వాన్ని కూడా అదనంగా చొప్పించి బోధిస్తాడు. సీతారాం కవిత్వ పద్దతులను తరగతి గదిలో ఒకసారి వింటే కవులై కదిలిపోతాం. ఆయన గొప్ప భావుకుడే కాదు గొప్ప మానవతావాది తన విమర్శన వ్యాసాలు 'అదేపుట'రచనా పుస్తకాన్ని ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారికి, నివారణకై నిరంతరం పరితపిస్తున్న వారికి అంకితం ఇచ్చాడంటేనే మనం అర్థం చేసుకోవచ్చు అతని మానవతా హృదయాన్ని.

1985' రక్తస్పర్శ 'కవితాసంపుటితో సీతారాం సాహితీ లోకానికి పరిచయమయ్యారు. అఫ్సర్, ప్రసేన్‌లతో కలిపి సీతారాం ఈ కవితా సంపుటిని వెలువరించారు. ఈ కవితా ఒక సంచలనం సృష్టించింది 1990 'ఇదిగో ఇక్కడిదాకా' పేరుతో ఆయన వెలువరించిన కవితా సంపుటి సంచలనం సృష్టించింది. 1995లో సన్నాఫ్ మాణిక్యం కవితాసంకలనం ఆయనకు మంచి పేరుప్రతిష్టను తీసుకొచ్చింది.

సీతారాం కవిత్వం చదువుదామని ఎప్పటినుంచో వెతుకుతున్నాను. నా దగ్గర ఆయన పుస్తకాలు లేకపోవడం నా బాధ్యతా రాహిత్యం. ఆయన పుస్తకాలకై అన్వేషణ ప్రారంభించినా నా దగ్గర లేవంటున్నారు. ఎక్కడ దొరకడం లేదు. ఆ సందర్భంలోనే మా గురువుగారు నాగవరం బాల్ రాం ఒకరోజు హైదరాబాద్ ఆబిడ్స్ పుట్ ఫాత్ పై పాత పుస్తకాల షాపులో సన్నాఫ్ మాణిక్యం పుస్తకం కనబడితే అది తెచ్చి నాకిచ్చాడు. నేను పుస్తకం తెరిచి మొదలుగా చదివిన కవిత S/0మాణిక్యం. చదువుతుంటే నాకు కన్నీళ్లు ఆగలేదు. అమ్మ శ్రామిక పతాకం పేదరికాన్ని గుండెల్ని కోసేసే కవిత సీతారాం తప్ప మరెవరు రాయలేరేమో నన్న సందేహం నాకు కలిగింది.అదొక అద్భుతమైన కవిత.

అమ్మ ప్రేమ అమ్మ కాళ్ళకు చెప్పులు లేని బీదతనం రూపాయిని దొంగిలించినందుకు నేరం రూపాయదా తనదా అని ప్రశ్నిస్తాడు. రూపాయి తనను దొంగిలించిందంటాడు. చెప్పులు లేకుండా నడిచిన అమ్మ కోసం మా అమ్మ కోసం సరిపోయే చెప్పులు అమ్ముతారా? రూపాయకు చెప్పులు అమ్ముతారా అంటూ వీధులన్ని తిరుగుతూ మనుషుల కాళ్లకు చెప్పులులేని ఆర్థిక అభివృద్ధి తనాన్ని నిలదీస్తాడు. సామాజిక వాస్తవికతను నిరసిస్తాడు. అమ్మ కాళ్ళకు చెప్పులు కొనివ్వలేకపోయాడు కానీ అమ్మకు విలువైన బహుమతిని తల్లి పేరునా సాహిత్య చరిత్రలో సన్నాప్ మాణిక్యం ఒక ఎవరెస్టు.

'హరిత నవ్వు' అనే మొదటి కవితలో... గుండెల్లోకి కాళ్లు విసిరి/ చిన్న చేతులతో/ వెన్నెల మట్టి కుప్పల్ని/ ఎగజిమ్ముతుంది/ ఎప్పుడైనా ఎక్కడైనా/ ఈ బతుకు మీదకి ఎవరైనా ఇలాంటి నవ్వు విసిరారా/ దుమ్ముల్లో ఆడుకుంటున్నప్పుడు...చిట్టి చిట్టి చేతులతో మట్టికుప్పల్ని ఎగజిమ్మే బాల్య ప్రపంచాన్ని ఆవిష్కరించారు.

'యూసఫ్ ఇంకా ఇంటికిరాలేదు మరొక కవితలో...కర్ఫ్యూ మోకులు విప్పారు/ కొమరయ్య తుపాకికీ అంటిన శవాన్ని తుడిచాడు/ ఒక రెప్ప మూసి ఒక రెప్ప తెరిచి చూస్తూనే ఉన్నాయి/ యూసఫ్ మాత్రం ఇంట్లో లేడు.. వాళ్ళ ఇంటికి వచ్చే దారిలో కూడా...ఆనాటి ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్లతో తెల్లారుతున్న కాలం. కల్లోలిత ప్రాంతం గా ప్రకటించబడ్డది. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కళాశాలలోనే మాయం. ఎప్పుడు ఎవరు ఎక్కడ ఎన్ కౌంటర్ అవుతారో .. నిలదీస్తే నక్సలైట్ గా ముద్ర. స్వేచ్ఛకు దారిలేని పరిస్థితులు హక్కులను కాల్చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కొల్లగడుతున్న వైనాన్ని తన కవితలో ప్రతిబింబించాడు

'మానవుడు చనెను కవితలో.... మనిషిని నమ్మిన దార్శనికుడు/ చనిపోయెను/ఒక ఆధిమానవుడ్ని స్వప్నించి శాసించి/ దేవుడ్నిచంపేను/ అవును దేవుడు మరణించెను/ మానవుడు మరణించెను/కాలం వెనుదిరిగెను/ మున్నీరు కార్చెను/ కన్నీటిని ఏడ్చెను ఉక్కు పాదములు మొలిచెను.....మనిషి నమ్మిన దేవుడే మరణించాక మనిషి పరిస్థితి ఏమిటంటాడు..

సీతారాం ఎక్కడ పని చేస్తాడో అక్కడ ఆ అనుభవాల్ని ఒక పుస్తకంగా తెస్తారు. పలువ రించకుండా ప్రచురించలేకుండా ఉండలేకపోయిన పుస్తకమే కుప్పం కవితలు.

వంటిపై చొక్కాలు లేని జీవితాలు పక్కనే మదరాసు బెంగుళూరు వెలుగులీనుతున్న మహానగరాలు చీకటిలో కుప్పం ఎలా కుంటుపడిందొ కుప్పం ధైన్యాన్ని అక్షరీకరించిన వైనాన్ని మన కళ్లముందుంచాడు.

సీతారాం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని 14 గ్రామాలను దత్తత తీసుకుని హెచ్ఐవి నిర్మూలన కోసం విశేష కృషిచేశాడు. ఎయిడ్స్ వ్యాధినివారణకై సామాజిక ఆవగాహన చైతన్యం కోసం కాళ్ళకు బలపం కట్టుకొని ఊరూర తిరిగాడు. పిల్లల జీవితాలు, చదువులు,కవిత్వం వేరువేరుగా చూడలేదు. తెలుగు సాహిత్యంలో సీతారాంది ప్రత్యేకమైన స్థానం. తెలుగు సాహిత్యాన్ని వడబోతతోపాటు ప్రపంచ సాహిత్యాన్ని కూడ క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. సభలలో కలిసినప్పుడు ఆత్మీయంగా ఒక సన్నని జాజిమల్లెలా చిరునవ్వుతో పలకరిస్తాడు. సీతారాం కవితల్ని అర్థం చేసుకోవడం కష్టమైన పని కానీ, అత్యద్భుతమైన కవితల్ని పిల్లలు చేత సృష్టిస్తాడు. చిన్న చిన్న వాక్యాలను గులాబీ రెమ్మల్లా బంతిపూల వరస పేర్పులతో పరవశిస్తూ ప్రచారం చేస్తాడు.తెలంగాణ ఉద్యమ సమయం 2012 లో జులూస్ కవితాసంకలనం ఆవిష్కరణ కోసం సీతారాం గారిని నాగర్ కర్నూల్ కు ఆహ్వానించాం.ఆ కవితా సంపుటినే సమీక్షిస్తూ ఇలా మాట్లాడాడు.' కాకినాడ కాజాల్లా 'జులూస్'ని ఆంధ్ర ప్రాంతమంతా బండిమీద తిరిగి అమ్మాలన్న ప్రారంభోపన్యాస వాక్యాలకు, తాను మాట్లాడిన తీరుకు మేమంతా ఫిదా అయిపోయాం. 'మానుకోట ముచ్చట్లు'లో విద్యావ్యవస్థల లోపాల్ని, బాల్యవివాహాల్ని, అధ్యాపకుల బాధ్యతారాహిత్యాన్ని, విద్యార్థుల వికాసానికి తీసుకోవలసిన చర్యల్ని,వార్షిక పరీక్షల కష్టాల్ని, ఎదురీతల్ని పరీక్షల నిర్వహణ నేడు భారంగా మారిన సందర్భాల్ని, టీచింగ్ డైరీ, ప్రయివేట్ కళాశాలలో విద్యార్థుల సందడిని, నీరసించిపోతున్న ప్రభుత్వ కళాశాలల దుస్థుతుల్ని,మహిళా సాధికారతల్ని విపులంగా ముచ్చట్లలో వివరించారు. మానుకోట ముచ్చట్లు విద్యార్థుల్నే కాదు అధ్యాపకులను కూడ సంస్కరణలకు పునాదులు వేస్తుంది. సీతారాం తన మాట చివరలో మనం వ్యవస్థలకు బలహీనతగా మారకూడదు. మనకు ముందు నుంచీ వ్యవస్థ ఉంది. మన తర్వాత కూడా వ్యవస్థ ఉంటుంది. మనమున్న కాలంలో, స్థల, సందర్భాలలో ఇది పరిపూర్ణమైతే పరిపుష్టమైతే బోలెడంత సంతృప్తి. మనవల్ల వ్యవస్థలు బలోపేతం కావాలి. పదవి హోదా అంతస్తు హోదాలను బట్టి



పిల్లలను ఏరా అరేయ్ ఒరేయ్ అని పిలవకూడదు. అట్టడుగు వర్గం వారిని చులకనగా, తక్కువ పిలుపులతో ఆధిపత్యభాషతో కించపరచడాన్ని చూసి సీతారాం విలవిలలాడి పోయాడు. 'మానుకోట ముచ్చట్లు' విద్యార్థులు అధ్యాపకులు తమను తాము సంస్కరిం చుకునే కరదీపిక. ఈ పుస్తకానికి ప్రసిద్ధ రచయిత విమర్శకులు కవి ప్రసేన్ ముందుమాట మరొక సంచలనం. 'సీతారాంలు నశించాలి' మనం ఏ వ్యవస్థలో మనుగడ సాగిస్తు న్నామో ఆ వ్యవస్థను ధిక్కరించకపోతే ఆ వ్యవస్థ మనకు ఏమీ నేర్పలేదని అర్థం.

సీతారాంగారు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రముఖ ప్రజాకవి కాళోజీ నారాయణరావు-2017 పురస్కారం. తెలంగాణ సరస్వత పరిషత్ నుంచి దేవులపల్లి రామానుజారావు సాహితీ పురస్కారం 2024, ఇంకా ఎన్నో ఎన్నెన్నో పుష్కారాలను పొందారు.

సీతారాం!అతడు నిశ్శబ్దం. కదిలిస్తే సముద్రపు కల్లోలమే! సామాజిక అసమానతల్ని నిలదీసే అనేక ప్రశ్నల కొడవలి. ఆ అక్షరాల పదును మానవ విధ్వంసాలపై సంధించే ఫిరంగులు!అతడు విశ్వమానవుడు ఏ పక్షుల గింజలు ఆ నోటికే అందించే సరికొత్త చూపు!ఎదురెక్కే చాపలకు కొత్త నీరు నూతన కలాలకు సిరా..

పిల్లల్ని పరుగెత్తించే గిల్లి దండు...దారి తప్పిన పడవలకు చేయందించే దిక్సూచి.... సన్నాఫ్ మాణిక్యం. తెలంగాణ ఆకాశానికి పూసిన చెంద్రవంక !

పదవి విరమణ ఉద్యోగానికే గానీ, సాహిత్య వికాసానికి కాదంటూ కంచు కాగడై.. వెలుగులీనుతూనే ఉండాలని అశిస్తూ...

**- వనపట్ల సుబ్బయ్య**
9492765358

# డోగ్రీ సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి చంపా శర్మ



ప్రపంచంలోనే విభిన్న వినూత్న వైవిధ్యాల సం తులన సమీకృత సామాజిక జీవన సంగమ సంగీతం భారతదేశం. భిన్నత్వంలో ఏకత్వం సూత్రాన్ని నమ్మిన నేలలో శాంతి అహింసలతో పాటు అస్తిత్వ తత్వం, ధిక్కార స్వరం, పోరాట పాఠవం వేళ్ళూనుకున్నవి. కళలు, సాహిత్యం, సామాజిక వ్యవస్థలు, బంధాలు బలంగా అల్లుకున్న కేంద్రం. ఇది బహు భాషల భారతీయ అంతర్వాహిణి కూడా. ఈ భూమిలో భాషలన్నీ తొలినాళ్ళలో మౌఖిక మాలికలే. కొండలూ లోయలూ మైదానాలు నదీ పరీవాహక ప్రదేశాల ప్రజలు మాట్లాడాదే భాషా సౌందర్యం. అలాంటి భాషా సౌందర్యాలలో డోగ్రీ భాష ఒకటి. పహాడీ, దుగ్గర్ వంటి పేర్లతో పిలువబడ్డ భాష డోగ్రీ. పర్వత సానువుల్లో, కొండ ప్రదేశాల్లో నివసించే ప్రజల భాష డోగ్రీ. ఈ భాషను దాదాపు 50 లక్షల మంది భారత్ పాకిస్తాన్ దేశాల్లో మాట్లాడుతారు. మన దేశంలో డోగ్రాలు లేదా డోగ్రా ప్రజలు , ప్రధానంగా భారత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్లో నివసిస్తున్న ఇండో-ఆర్యన్ జాతి - భాషా సమూహానికి చెందినవారు. దాదాపు 30లక్షలకుపైనే భారతీయులు తమ స్థానిక డోగ్రి భాషను ప్రధానంగా జమ్మూ కాశ్మీర్లో గల జమ్మూ డివిజన్లోని దుగ్గర్ ప్రాంతంలో,పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల పరిసర ప్రాంతాలలో మాట్లాడతారు. ఇక స్వల్ప జనాభా ప్రజల భాషగా డోగ్రీని చూడవచ్చు. సాహిత్యం చదువడం రాయడం వంటి క్రియలు చాలా తక్కువ. డోగ్రీ ఇతర భాషల పోటీ సవాళ్ళనూ ఎదు ర్కొన్నది. దీని గుర్తింపు, మనుగడ, అభివృద్ధి పరిరక్షణ కోసం ఎందరో కవులు రచయితలు తమతమ కృషిని అందిస్తున్నారు. అలాంటి సాహిత్య, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలు అందిం చిన వారిలో పద్మ సచ్ దేవ్, వేద్‌రాహి వంటి ప్రముఖులు డోగ్రీ సాహిత్యాన్ని ప్రోత్సహించారు. జాతీయ స్థాయి గుర్తింపును పొందారు.

20వ శతాబ్దంలో డోగ్రీ భాష ఓరల్ నుండి లిఖిత రూపాలను అందుకోవడం ఓ గొప్ప భాషా సాహిత్య విప్లవంగా పేర్కొనవచ్చు. డోగ్రీ భాషా సాహిత్యాల వికాసంలో సంగీత స్వర ఝరి పండిట్ రవిశంకర్ పండిత్ శివకుమార్ శర్మ మున్నగు కళాకారులు డోగ్రీ జానపద గేయాలను స్వరపరిచి సితార్ సంతూర్‌లతో ఆలపించారు. చంపా శర్మ, కరణ్ సింగ్, రామ్‌నాథ్ శాస్త్రి, దీనూ భాయ్ పంత్, బి.పి.సదాయ్, ప్రొ.మదన్‌మోహన్ శర్మ లాంటి వారు ప్రముఖ మైన పాత్రను పోషించారు. డోగ్రీ భాషా సాహిత్యాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మహిళా రచయితలలో పద్మ సచ్ దేవ్, చంపాశర్మ, వీణాశర్మ వంటి వారున్నారు.

చంపాశర్మ పేరెన్నికగన్న డోగ్రీ రచయిత్రి, కవయిత్రి, డోగ్రీ భాషా సాహిత్యాల వికాసం, పరిరక్షణ చోదకశక్తిగా ఉన్న చంపాశర్మ డోగ్రీ సంస్కృత్ భాషాసాహిత్యాల బోధనలో సేవలం దిస్తున్న అకడమిక్ ప్రొఫెసర్ కూడా. జమ్మూ కాశ్మీర్ లోని సాంబా జిల్లాలోని డాగోర్‌లో చంపా శర్మ జూన్ 9,1941న జన్మించారు. ప్రైమరీ హైస్కూల్ విద్యను సొంత గ్రామంలో చదివారు.1964లో ఎం.ఏ సంస్కృతం చేశారు. ఆమె 1975లో జమ్మూ విశ్వవిద్యాలయం నుండి సంస్కృతంలో పి.హెచ్.డి. పట్టా పొందింది.1977లో డోగ్రీ భాషలో (శిరోమణి)ఎం.ఏ పట్టభద్రురాలు. కొంతకాలం రిపబ్లిక్ అకాడమీ కళాశాలలో బోధన వృత్తిని చేపట్టారు. తర్వాత 1969లో గాంధీనగర్ లోని ప్రభుత్వ మహిళా కళాశాలలో సంస్కృతం లెక్చరర్‌గా పనిచేశారు. 1975లో జమ్మూ యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ బోధించారు. డోగ్రీ పరిశోధనా కేంద్రంతో ఆమెకున్న సంబంధంతో జమ్మూ యూనివర్సిటీలో డోగ్రీ భాషలో పూర్తి స్థాయి పిజి విభాగం సాధనలో కీలకపాత్ర పోషించారు. తర్వాత ఆమె డోగ్రీ రిసెర్చ్ సెంటర్ లో సీనియర్ ఫెలోగా డైరెక్టర్ గా పనిచేశారు.1983లో అదే విభాగానికి తొలి అధిపతిగా పనిచేశారు. ఇక్కడ గమనించాల్సిన సంగతి నేటి కలుషిత ఆధిపత్య రాజకీయ పంకిలంలో కొట్టుమిట్టాడుతున్న కాలంలో విద్య గత కాలం దీపకాంతుల వెలుగులు విరజిమ్మడంలో చంపా శర్మ వంటి నాటి విద్యావేత్తల సేవలు దాగి ఉన్నవి.ఇది చారిత్రక సత్యం. నాడు గురువు బడికి ఇంటికి పరిమితమై ప్రశాంత జీవనంలో అత్యున్నత అత్యుత్తమ బోధనలు సేవలు సలహాలతో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంచే ఓ గొప్ప టీచర్‌గా ప్రొఫసర్ గా పేరు గడించారు.

సాహిత్య రచనా జీవితం ఆలోచనాత్మకంగా సామాజిక సమస్యలపై పూర్తి అవగాహనతో తన రచనలు సామాజిక సమస్యలకు ఓ పరిష్కారం చూపుతాయి.

ప్రొఫెసర్ చంపా శర్మ 18 అసలు రచనలతో పాటు సంస్కృతం నుండి ఆంగ్లం వరకు మరియు హిందీ నుండి డోగ్రి వరకు అనేక అనువాద రచనలను రచించారు. ఆమె రచనలు చాలా వరకు ఇంగ్లీష్, హిందీ, పంజాబీ, సంతాలి, మణిపురి, కాశ్మీరీ థాయ్ వంటి ఇతర భాషలలోకి అనువదించబడ్డాయి.

ఆమె స్వీయ రచనలుగా 1969లో డోగ్రి కావ్య చర్చ, 1976లోఇక్ జాంక్ జానపద సాహిత్య



వ్యాసాలు, 1979లో దుగ్గర్ ధరి కవిత్వం,1985లో దుగ్గర్ దా లోక్-జీవన్ జానపద కథలు, అనువాద్ విజ్ఞాన్ తో కలిసి రచించారు.

1988లో గుర్తే ధుండ్లే చెహరే గద్యంలో సాహిత్య స్కెచ్‌లు, 1988లో కావ్య శాస్త్రతే డోగ్రీ కావ్య సమీక్ష సాహిత్య విమర్శ, రఘునాథ్ సింగ్ సామ్యాల్ (హిందీలో) మోనోగ్రాఫ్ రాశారు.

అలాగే 1991లో జే జిందే జీ సురగ్ దిఖానా డోగ్రీ పాటలు, జమ్మూ కే ప్రముఖ్ పర్వ్- తియోహర్ ఔర్ మేలే, 1996లో సాక్ సున్న ప్రీత్ పిట్టల్ చిన్న కథలు, 2002లో శోధ ప్రబంధ్ నిహాలప్ డోగ్రీ గజల్స్,2004లో చేతన్ డి రోల్ దీర్ఘ డోగ్రీ పద్యాలు, 2007లో గదీర్న డోగ్రీ కవిత్వం, 2011లో ప్రొ. వేద్ కుమారి ఘాయ్ డోగ్రీలో మోనోగ్రాఫ్,సాంజ్ భ్యాల్ డోగ్రీ కవిత్వం,సోచ్ సాధన సాహిత్యంపై గద్య విశ్లేషణాత్మక వ్యాసాలు ప్రచురించారు.

సంస్కృతం నుండి డోగ్రీలోకి తెచ్చినవ గ్రంథాలలో జమ్మూ కాశ్మీర్ అకాడమీ ఆఫ్ ఆర్ట్, కల్చర్ అండ్ లాంగ్వేజెస్ ప్రచురించిన 'కథా సరిత్సాగర్', కాశ్మీర్ సోమదత్ రాసిన భాగం-3 కలవు. అలాగే ఇంగ్లీషు నుండి డోగ్రీలోకి 'దువారీ కబూటరేన్ డి', రస్కిన్ బాండ్ రాసిన 'ది ఫ్లైట్ ఆఫ్ ది పిజియన్స్' అనే నవల, న్యూఢిల్లీ సాహిత్య అకాడమీ ప్రచురించిన గ్రంథం ఇంకా హిందీ నుండి డోగ్రీలోకిలోకి రామ్ కృష్ణ వచనామృత్సార్, ఇంగ్లీషు నుండి డోగ్రీలోకి 'స్వామి వివేకానంద హుండీ సరళ జీవన్ యాత్ర తే ఉండే ఉపదేశ్', వాస్తవానికి ' స్వామి వివేకానంద యొక్క సాధారణ జీవితం మరియు అతని బోధనలు'గా తెచ్చారు.

సంస్కృతం నుండి డోగ్రీలోకి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ కింద ఆచార్య ముమ్మత్ రాసిన 'కావ్యప్రకాష్' వ్యాఖ్యానం ఉన్నవి. ఇంగ్లీషు నుండి డోగ్రీలోకి: రాబిన్ శర్మ రాసిన ' ది మాంక్ హూ సోల్ హిస్ ఫెరారీ' , జమ్మూ కాశ్మీర్ అకాడమీ ఆఫ్ ఆర్ట్, కల్చర్ అండ్ లాంగ్వేజెస్ ద్వారా డోగ్రీలో 'సన్యాసి జిన్ అప్ని ఫెరారీ బెచి దిట్టి' అనే శీర్షికతో ప్రచురించబడింది.

సంకలనం చేయబడిన గ్రంథాలలో అజ్కానీ డోగ్రీ కవిత పార్ట్ 2 సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ ప్రచురించింది.

జమ్మూ కాశ్మీర్ అకాడమీ ఆఫ్ ఆర్ట్, కల్చర్ అండ్ లాంగ్వేజెస్ ప్రచురించిన క్రిషన్ స్మాయిల్పురి జీవితం రచనలు డోగ్రీ సంస్థ, జమ్మూ ప్రచురించిన హిర్కి తండాన్ భాషా విజ్ఞాన్ తే డోగ్రి మైసూర్లోని CIIL సహకారంతో జమ్మూ కాశ్మీర్ అకాడమీ ఆఫ్ ఆర్ట్, కల్చర్ అండ్ లాంగ్వే జెస్ ప్రచురించిన డోగ్రీ బాల్ గీత్, డోగ్రి శోధ్ 5 వాల్యూమ్స్, హిందీ - డోగ్రీ మరియు డోగ్రీ - పర్యాయపదాల హిందీ నిఘంటువు కలవు. ఇలా కవిత్వంలోని అన్ని పార్శ్వాలు ప్రక్రియలలో ఆమె సృజన గావించారు.

2008లో ప్రొ. చంపా శర్మ తన స్వీయ కవితా రచన 'చేటెన్ డి రోల్' కు న్యూఢిల్లీలోని సాహిత్య అకాడమీ నుండి సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. అలాగే మరెన్నో ఇతర గౌరవ అవార్డులు, గుర్తింపులు కూడా పొందారు. అందులో ముఖ్యమైనవి దివానీ 1992లో విద్యావతి డోగ్రా అవార్డు, 1996లో బక్షి గులాం మొహమ్మద్ మెమోరియల్ అవార్డు, 1995లో డోగ్రీ సంస్థ గోల్డెన్ జూబ్లీ సమ్మాన్, 1997లో జమ్మూ కాశ్మీర్ విలీన స్వర్ణోత్సవ అవార్డు, 2000లో డోగ్రీ సాహిత్య రత్తన్ అవార్డు, 2006లో డోగ్రా రట్టన్ అవార్డు, 2012లో జీవిత సాఫల్య పురస్కారం, డోగ్రి సంస్థ,జీవిత సాఫల్య పురస్కారం, ఎన్ఎస్ఎస్ వంటి సేవా సంస్థల లోనూ సేవలం దించారు. ఆమె విశేష కృషికి ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు చంపాశర్మను గౌరవించాయి. లేటెస్టుగా, ఆమె రాబిన్ శర్మ రాసిన 'ది మాంక్ హూ సోల్ హిస్ట ఫెరారీ' అనే బెస్ట్ సెల్లింగ్ ఇంగ్లీష్ పుస్తకాన్ని డోగ్రీ భాషలోకి అనువదించారు. ఆమె డోగ్రీ అనువాద రచనపై పుస్తక సమీక్ష ది డైలీ ఎక్సెల్సియర్ అనే ఆంగ్ల దినపత్రికలో 21 ఆగస్టు 2016న ఓపీ శర్మ రాశారు.

2017లో ప్రొఫెసర్ చంపా శర్మ ఆగస్టు జమ్మూ కాశ్మీర్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, కల్చర్ అండ్ లాంగ్వేజెస్ కేంద్ర కమిటీలో డోగ్రీ ప్రతినిధిగా నామినేట్ అయ్యారు .

బహుముఖీన ప్రతిభతో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఆమె సొంతం.

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# వారాల ఆనంద్ యాదోంకీ బారాత్




వారాల ఆనంద్ గారి 'యాదోంకీ బారాత్' పుస్తకాన్ని ఒక రోజు రాత్రి పదిన్నర గంటలకి చదు వుదామని ఉపక్ర మించా వారు తన పాత జ్ఞాపకాలని ఎంతో పొందికగా అమర్చిన విధానాన్ని చూసి చదువుతూ పుస్తకాన్ని వదిలేయ లేకపోయాను. ముఖ్యంగా తిలక్ రోడ్డు గంజ్‌హై స్కూల్ ప్రయాణం నాతో బాగా కనెక్ట్ అయి అవును నేను గంజ్ హైస్కూల్, విద్యార్థిని యాదోంకి బారాత్‌లో పేర్కొన్న జగన్నాథం టీచర్ గారు మాకు బోధించారు. నాకు ఇప్పటికీ జ్ఞాపకం బారాత్‌లో ఆనంద్ చెప్పిన మటన్ మార్కెట్ పక్కన కొన్ని గుడిసెలలో గాజుల దుకాణాల వాళ్లు ఉండేవారు ఒక రోజు అవి తగలబడి పోయాయి. అవి చూసి ఒక అర గంట గంజ్ స్కూల్‌కి ఆలస్యంగా వచ్చినందుకు నన్ను చెంప దెబ్బ వేసి మందలించారు ఉపాధ్యాయులు.

ఆ కాలంలో అంటే 1965 అప్పుడు మా నాన్న గారు డాక్టర్ దారం నాగభూషణం బహుశా కరీంనగర్‌కే మొట్టమొదటి ఎంబీబీఎస్ డాక్టర్‌గా అయినా ఆ రోజుల్లో ఉపాధ్యాయు లకు విద్యార్థులకు క్రమశిక్షణలో ఏ లోపం కనబడేది కాదు. మీరు చెప్పినట్టు నాది హెచ్ ఎస్‌సి పియుసి లాస్ట్ బ్యాచ్. అవును అది జై తెలంగాణ బ్యాచ్ మేము నకల్ కొట్టి పాస్ అయ్యాం. తర్వాత 71 లో మళ్లీ ఎంట్రన్స్ రాసి కాకతీయ మెడికల్ కాలేజీలో చేరడం జరిగింది. ఇటీవలి కరోనా పీరియడ్ నుంచి కొన్ని ఇంగ్లీష్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్న చాలావరకు పార్టిషన్ లేక ప్రసిద్ధి చెందిన వైద్యుల జీవిత చరిత్రలు చాలా చదివా. మే 13 నాడు ఓట్ల పండుగ సందర్భంగా నా ప్రియమిత్రుడు సాహితీ ప్రియుడు డాక్టర్ విజయ మోహన్ రెడ్డి గారు నాకు బ్రహ్మానందం గారు రాసిన నేను అనే పుస్తకాన్ని ప్రజెంట్ చేశారు. అది చదివినప్పటి నుంచి తెలుగు పుస్త కాల్లో కూడా ఆసక్తి పెరిగింది. దానికి తోడు కరీంనగర్ లో ఉన్న ప్రముఖ తెలుగు కవులు సాహితీ ప్రియుల పుస్తకాలు చదవడం ప్రారంభించాను. ఇప్పుడు తెలుగులో ఆసక్తి పెరిగింది. యాదొంకీ బారాత్ పుస్తకం రాత్రి చదువుతూ వుంటే అసలు సమయం తెలియ లేదు. రాత్రి దాదాపు ఒంటిగంట వరకు పుస్తకం చదువుతూనే ఉన్నా అలనాటి పాత రోజులు కరీంనగర్ చరిత్ర ఆనంద్ దాన్ని వివరించిన తీరు అత్యంత ప్రశంసనీయం. మీరు చెప్పినట్టు తనకు బాల్యం నుంచి ఇప్పటి వరకు ఎన్నో ఉడుదుడుకులు ఎదురైనా వాటిని అధిగమించి ఇప్పుడు ఆయన చేస్తున్న తన కిష్టమయిన రచనా వ్యాసంగం చాలా అభినందనీయం.

ఆయన ఇలాగే మరిన్ని రచనలు చేయాలని వారి ఆసక్తి ఇలాగే కొనసాగాలని ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని కోరుకుందాం.

**- డాక్టర్ దారం రఘురామన్**

## డప్పు కథకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి సాహితీ సంస్థ రచనల పోటీ - 2025లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మొత్తం 25 కథలను సంకలనం కోసం ఎంపిక చేయడం జరిగింది.

1. డప్పు (ప్రథమ బహుమతి) రూ. 10,000 - శింగరాజు శ్రీనివాసరావు
2. రాకాసి గీతలు (ద్వితీయ బహుమతి) రూ. 5000 - హరివెంకటరమణ
3. శుభ పరిణామం (తృతీయ బహుమతి) రూ. 3000 - బి.ఎల్. గాయత్రి

బహుమతి పొందిన పాటలు

1. మేడే గీతం (ప్రథమ బహుమతి) రూ. 5000 - కె. ఆనందాచారి
2. ఆరని పోరాట జ్వాల (ద్వితీయ బహుమతి) రూ. 3000 - టి. పావెల్
3. అక్షరానికి విజ్ఞాపన (తృతీయ బహుమతి) రూ. 2000 - ఇమంది అశోక్ కుమార్

జూలై నెల చివరి వారంలో బహుమతుల ప్రదానం ఆవిష్కరణ సభ విజయవాడలో ఉంటుంది.

**- వి.కృష్ణయ్య, చైర్మన్- ఎం.వి.యస్.శర్మ, ప్రధాన కార్యదర్శి**
94900 99059

## కట్టెల పొయ్యి..

ఎండిన పుల్లల్ని పోగేసుకుని
నాలుగు
ముద్దలు గిద్దెలోకేసేవాళ్ళం
అడవితో చెలిమి చేస్తూ
ఒట్టి కట్టెల్ని సంకన పెట్టుకుని
పొద్దు గుంకే యాళకు
ఇంటికి చేరుకునేటోళ్ళం

రకరకాల కట్టెలు
పొయ్యిలో వేసి కాల్చగానే
ఓషధ పరిమళం గుప్పున లేచేది
ఉడుకుతున్న బియ్యం
ఆ వాసనను శ్వాసగా చేసుకుని
మెతుకులై
చేతిలో ఒదిగిపోతుంటే
ముచ్చటగా భోంచేసేవాళ్ళం

మట్టి గడ్డలతో మూడు గుండ్లు
ముచ్చటగా అమరి వుంటే
మూడు పొద్దులా

ఆకలి తీర్చే నేస్తాల్లా కనిపించేవి
వేడికి నల్లబడుతూ
గిన్నెకు
చేదోడుగా నిలబడుతుంటే
మా కళ్ళు చెమ్మగిల్లేవి
పొయ్యి పొగలోనే వుంటూ
ఊదే గొట్టంలో మూతెట్టి
సత్తువ కొద్దీ గాలిని ఊదేటోళ్ళం
పొడి దగ్గుతోనే
పొయ్యి కాడ కూర్చుని
సంగటి కెలికేటోళ్ళం

కట్టెల పొయ్యి పైన
మట్టి కుండలో
బువ్వ తిని
నూరేళ్ళు
నిండుగా బ్రతికేటోళ్ళం

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu @ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**- ఎడిటర్**

## రాళ్లకు దండాలు పెట్టలేను

కదిలిపోవాలి
కదులుతూ కదులుతూ
నవ్వులను, నదులను కలుపుకుంటూ పోవాలి
దీపం ఊగినప్పుడు
అనివార్య మరణం
నీలోకి నేను
నాలోకి నువ్వు
మెల్లమెల్లగా జీర్ణించుకోవాలి.
ఆకులు కదిలినట్టుగానే కనురెప్పలు
కదులుతుంటాయి కదిలే రెప్పల్లో
నక్షత్రాలు మెరవాలి
మెరిసిన చోట ఒక నిగూఢమైన యాత్ర-
సజీవంగా తొణికిసలాడుతుంది.
యాత్రలో మహోగ్రమైన రూపాలు
దొర్లిపోవడం సహజం
నీచమైన, మసిమసిగా ఉండే
కీటకాలలాంటి ఆలోచనలు
ఆలోచనల కింద మగ్గిపోయిన
సమూహంగా మారిన అజీవమైన
మాంసపు ముద్దలు కనపడతాయి.
అంతమాత్రం చేత యాత్రను మోస్తూ
కదలలేనంటే ఎలా?
నీకు నవ్వు గుర్తుందా?
కనీసం స్వేచ్ఛాయుతమైన ఏడుపు
లేదా తడైనా గుర్తుపెట్టుకోలేదా?
అందుకే నువ్వు కదలలేకున్నావు.
కదలడం అంటే
అడుగు తీసి అడుగు వేయడం కాదు.
కదిలిపోయిన అడుగుల్లో-
మొక్కను నాటుకుంటూ పోవాలి
నడిచిన బాటల్లో-
తడి నీడలను పరచుకుంటూ పోవాలి.
కాసింత మట్టిని పిడికిళ్లలోకి తీసుకొని
చల్లుకుంటూ సాగాలి.
ఇది వ్యక్తిగత జీవిత యాత్ర కాదు,
జాతికి ఆదర్శంగా సాగాల్సిన యాత్ర,
రెక్కలు విరిగిన సీతాకోకచిలుకలను
మోసుకుంటూ కదలాల్సిన యాత్ర.
రాళ్లకు దండాలు పెట్టలేను.

**- జాని తక్కెడశిల**



# సల్లంగా చూడు తల్లీ..

- క్యాంప్ కార్యాలయంలో ఘనంగా మైసమ్మకు బోనాలు
- ఎమ్మెల్యే సతీమణి మనాలి రాజ్ ఠాకూర్



**రామగుండం, జూన్ 29(మనం న్యూస్):** రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆషాఢమాస మైసమ్మ బోనాలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయమానంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మనాలి రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, అమ్మవారి బోనాలు మన సంస్కృతిలో ఒక అద్భుతమైన భాగమని అన్నారు. ఈ తరహా సంప్రదాయ కార్యక్రమాలు నూతన తరానికి మానవీయ, భక్తిశ్రద్ధల విలువను తెలియజేస్తాయని, స్థానిక కళాకారులు పోచమ్మ అమ్మవారి పాటలతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయని, రామగుండం నియోజకవర్గ ప్రజలను సల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు ఎమ్మెల్యే కుటుంబం తరపున ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మహిళా సభ్యులు, కార్యకర్తలకు రాజ్ ఠాకూర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి

- విద్యా శాఖ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి
- తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్




పెద్దపల్లి, జూన్ 29(మనం ప్రతినిధి): ఉపాధ్యాయులతో పాఠశాల తనిఖీలకు సంబంధించిన ఉత్తర్వులు విద్యాశాఖ వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. తపస్ పెద్దపల్లి జిల్లాశాఖ కార్యనిర్వాహకవర్గ సమావేశం ఆదివారం సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో జరిగింది. రాష్ట్ర అధనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ పాల్గొని మాట్లాడుతూ, విద్యాశాఖ రూపిందించిన కొత్త నిర్ణయం నిబంధనలకు విరుద్ధంగా ఉందని, టీచర్లను తీవ్రమైన ఒత్తిడికి, మానసిక సంఘర్షణకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపించారు. అదేవిధంగా ఉపాధ్యాయ, పాఠశాల, విద్యారంగానికి సంబంధించిన అనేక సమస్యలను చర్చించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి ఉపాధ్యాయుల నిష్పత్తికి సంబంధించి 1 నుండి 30మంది వరకు ఇద్దరు ఉపాధ్యాయులను, 1 నుండి 60మంది విద్యార్థుల వరకు కనీసం ముగ్గురు ఉపాధ్యాయులను, 60మందికి పైన విద్యార్థులు ఉంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురిని, వంద మంది విద్యార్థులు ఉంటే ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులకు సంబంధించిన విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని తగ్గించాలని సమావేశంలో తీర్మాణం చేశారు. పాఠశాలల్లో ఉన్న వివిధ ఖాళీలను భర్తీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందేలా చూడాలన్నారు. ఉపాధ్యాయుల తల్లిదండ్రులు మరణించిన సందర్భంలో ప్రత్యేకంగా కర్మకాండల సెలవులు మంజూరు చేయాలని, పెండింగులో ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగ, పెన్షనర్ల బిల్లులను విడుదల చేయాలని, డిఏ మంజూరు చేస్తూ, నూతన పిఆర్సి అమలు చేయాలని సమావేశం కోరింది. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్జిటి ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించాలని, నూతన విద్యావిధానం ఎన్ఈపి-2020 అమలు చేయాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దుకింద జీతాలు 1వ తేదీనాడు చెల్లించాలని, కేజీబీవీలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకి, సిబ్బందికి మినిమం టైమ్స్ స్కేల్ వేతనాలు అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులు వేసవి సెలవులలో పాఠశాలలకు వివిధ కార్యక్రమాల కోసం హాజరైన కారణంగా వారికి సంపాదిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్కుల సునీల్ రెడ్డి, దుగ్యాల శ్రీనివాసరావు, రాష్ట్ర బాధ్యుడు ఎలగం కనుకయ్య, జిల్లా మండల బాధ్యులు అంజయ్య, వీరస్వామి, భోజన్నపల్లి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్ రెడ్డి, అనిల్ ప్రసాద్, సురేందర్, రామేశ్వర్, కిరణ్, ఉమాశంకర్, రాజన్న, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు .

## దివ్యాంగుల ఉచిత ఉపకరణాల దరఖాస్తుకు జూలై 5 గడువు

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి డా. బోనగిరి నరేష్



**జగిత్యాల జూన్ 29(మనం ప్రతినిధి):** రాష్ట్రంలో దివ్యాంగులకు ఉచితంగా అందించే ఉపకరణాల కోసం దరఖాస్తు దాఖలు చేసుకునేందుకు గడువు జులై 5 వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి డా. బోనగిరి నరేష్ తెలిపారు. దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు, వ్యాపార వాహనాలు, వినికిడి పరికరాలు, వాకింగ్ స్టిక్స్, వీల్చైర్లు తదితర ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జూలై 5 వరకు దరఖాస్తు గడువు పెంచామని, అర్హులైనవారు టీజీఓబీఎంఎంఎస్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి



- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రాజన్న సిరిసిల్ల, జూన్ 29(మనం ప్రతినిధి):** కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన రైతులకు 137 జతల కోడెలను 274 జీవాలను అధికారులు రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ రాధాభాయి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కృష్ణ రెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



## మైసమ్మ బోనాలలో.. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**రామగుండం, జూన్ 29(మనం న్యూస్):** ఆదివారం రామగుండం శాసనసభ్యుడు రాజ్ ఠాకూర్ స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన మైసమ్మ బోనాల జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మైసమ్మ తల్లి గుడికి చేరుకున్న ఆయన ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ఈ బోనాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ సంప్రదాయాలకు ప్రతిరూపమైన బోనాల పండుగ మా ప్రజల అష్టైశ్వర్యాలకు సంకేతమని అన్నారు. మైసమ్మ తల్లిని పూజించడమూ, బోనాలను సమర్పించడమూ మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనం అన్నారు. మైసమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా, అభివృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా ఆలయ ప్రాంగణం సంప్రదాయ సంగీతం, డప్పులు, శివన్నల ఊరేగింపులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల క్షేమమే మా బాధ్యత: మంత్రి అడ్లూరి



**గొల్లపల్లి, జూన్ 29(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి -షాది ముబారక్ మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,వృద్ధుల మరియు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ రోజు గొల్లపెల్లి మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ 46 మంది లబ్ధిదారులకు రూ.46,05,336 మరియు సిఎంఆర్ఎఫ్ 117 మంది లబ్ధిదారులకు రూ.34,58,500 చెక్కులు, మంత్రిగా ఉండి పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ప్రభుత్వం ప్రవేశపట్టిన అన్ని సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు చేరే విధంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలి, అదేవిధంగా ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మండల అధికారులు, ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు చూసుకోవాలని అన్నారు కోరినారు ,అదేవిధంగా నూతనంగా తెలంగాణ రాష్ట్ర మంత్రిగా నాలుగు శాఖలకి బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉంది . కావున వాటికి సంబంధించిన సమస్యలు ఏమి ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురండి, నేను వారంలో రెండు రోజులు నియోజకవర్గంలోనే ఉండి ప్రజలకు అన్ని విధాల తోడ్పాటును అందిస్తానని చెప్పారు. చెక్కుల పంపిణీ చేయడం వలన ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేసినారు . ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ వరందన్, మండల అభివృద్ధి అధికారి రామ్ రెడ్డి , మండల ప్రత్యేక అధికారి కిషోర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి , గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్ , వైస్ చైర్మన్ పురాపాటి రాజిరెడ్డి, మాజీ సర్పంచులు చిర్ర గంగాధర్, రేవెళ్ళ సత్యనారాయణ గౌడ్, పురంశెట్టి వెంకటేశం, రేవెళ్ళ లింగయ్య గౌడ్ , ఈర్నాల రాజేశ్వర్ ,మాజీ ఎంపీటీసీ సభ్యులు దాసరి తిరుపతి గౌడ్, మదాసు రవి ,యూత్ అధ్యక్షులు పురంశెట్టి గౌతమ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , మండలంలోని వివిధ గ్రామాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# నగునూరి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏల్లమ్మ వారికి బోనాలు



**రామగుండం, జూన్ 29(మనం న్యూస్):** రామగుండం కార్పోరేషన్ పరిధిలోని మారుతి నగర్ నుండి శివాజీ నగర్ లోని చికెన్ మార్కెట్ లో గల ఏల్పమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం నగునూరి షానీ-రవి, శ్రీలత-దేవేందర్ దంపతుల ఆధ్వర్యంలో ఆషాఢమాసన ఏల్పమ్మ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమ్మవారి బోనాలు సమర్పించడం మన సంస్కృతిలో ఒక అద్భుతమైన భాగమని అన్నారు. ఈ తరహా సంప్రదాయ కార్యక్రమాలు నూతన తరానికి మానవీయ, భక్తిశ్రద్ధల విలువను తెలియజేస్తాయని అన్నారు. స్థానిక కళాకారులు ఏల్పమ్మ అమ్మవారి ఆటపాటలతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించారు. ముందుగా ఏల్పమ్మ అమ్మవారికి, ధూప దీప నైవేద్యాలు పెట్టి, నడుమ కల్లు సాకలు పోసి, కుడుకలు బెల్లం, నైవేద్యాలతో ఏల్పమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించామని అన్నారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో ఏల్పమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి సల్లగా చూడమని మొక్కులు చెల్లించుకుంటామని అన్నారు.

## అధికార పార్టీ ఇష్టానుసారంగా డివిజన్ల పునర్విభజన

- అవగాహన అధికారులు
- మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత-రాజు ఆరోపణ

**రామగుండం, జూన్ 29(మనం న్యూస్):** 50 డివిజన్లుగా ఉన్న రామగుండం కార్పొరేషన్లో మరో 10 డివిజన్లు ఏర్పాటు చేసి అధికార పార్టీ నాయకులకు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఒక్క డివిజన్ ను మూడు ముక్కలుగా చేశారని, డివిజన్లలో ఐక్యతతో ఉన్న కాలనీ వాసులను అధికార పార్టీకి ఓటు వేయని వాళ్లను కక్ష పూరితంగా విడదీశారని, ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు తమ చేతగాని తనంతో డివిజన్ లో తమ అభ్యర్థులను గెలిపించుకోలేని స్థితి ఏర్పడిందని, అయినప్పటికీ అధికార పార్టీ నాయకులు మళ్ళీ ప్రజల వద్దకు అబద్ధపు మాటలు, హామీలు చేస్తూ డివిజన్ ను ముక్కలుగా చేసి తమ అభ్యర్థులకు అనుకూలంగా చేసి ప్రజల ఐక్యతను విడదీసి డివిజన్లను పునర్విభజన చేయడం సరికాదని అన్నారు. అదేవిధంగా మరొకసారి డివిజన్లను పునర్విభజన



చేయాలని లేని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, తాజా మాజీ 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత-రాజు అన్నారు. భవిష్యత్తులో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఉండేందుకు ఇలాంటి పునర్విభజన చేస్తూ జనాలను ప్రజలను సందిగ్ధంలో పడేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్ లో పదవులు దక్కించుకునేందుకే పునర్విభజన పేరుతో డివిజన్లు మార్పులు చేశారని పేర్కొన్నారు.

# స్థానిక పోరులో అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తా

- అభివృద్ధి సంక్షేమ పథకాలపై గ్రామాలలో విస్తృత ప్రచారం కల్పించాలి
- నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**పెద్దపల్లి, జూన్ 29(మనం ప్రతినిధి):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ కే గార్డెన్స్ లో సంస్థాగత ఎన్నికల సందర్బంగా ఆదివారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ.చింతకుంట విజయ రమణారావు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్ గారు, సంగీతం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు లాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, రైతు భరోసా ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేసిన గొప్ప ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వడ్ల కట్టింగ్ లేకుండా తడిచిన, రంగు మారిన వడ్లను కొనుగోలు చేపించడం జరిగిందిని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ సంక్షేమ పథకాలను అమలు చేస్తలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారనీ మండిపడ్డారు. గ్రామాలలో ఉండే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి, గడపకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని, కొన్ని గ్రామాలలో ఇప్పటికి కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఉన్నాడులే మన కోసం తిరుగుతాడు అనుకుంటారనీ అన్నారు. అలాంటి ఆలోచన మంచిది కాదన్నారు. గ్రామాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పథకాలపై నోరు విప్పకుంటే మీకే నష్టం జరుగుతుందన్నారు. ఎన్ని కల ఎప్పుడూ వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలతో ధైర్యంగా వెళ్ళి ఓటు అడగాలిని అప్పుడే గెలుస్తారన్నారు. ఎమ్మెల్యేగా తాను గెలవడానికి ఎంత కష్టపడ్డారో మీరు గెలిస్తే ఎక్కువ సంతోషం తనకే ఉంటుందని తెలిపారు. మీ గెలుపు కోసం తను శాయశక్తుల కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మెజారిటీ స్థానాలను గెలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మార్కెట్ చైర్మన్లు మినిపల ప్రకాష్ రావు, ఈర్ల స్వరూప, తిరుపతి రెడ్డి, గండు సంజీవ్ మరియు సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు మరియు మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్,సయ్యద్ మస్త్రత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దానాయక్ దామోదర్ రావు, అరె సంతోష్ మరియు మండలాల అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి,మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, గజానావేనా సదయ్య,చిలుక సతీష్, బొజ్జ శ్రీనివాస్, కడారి శ్రీనివాస్ మరియు టౌన్ అధ్యక్షులు అబ్బాయి గౌడ్, భూషణవేణి సురేష్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూలై 1 నుంచి గ్రామ్ ఉత్కర్ష అభియాన్‌పై అవగాహన

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల, జూన్ 29(మనం ప్రతినిధి):** జూలై 1 నుంచి 5 వరకు పీ.ఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనుల వికాసానికి సామాజిక ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పీ.ఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకం క్రింద సిరిసిల్ల జిల్లాలో వీర్నపల్లి మండలములో మద్దిమళ్ళ గర్జనపల్లి గ్రామాలు, రుద్రంగి మండలములో మానాల గ్రామాన్ని ఎంపిక చేశామని అన్నారు. గిరిజన మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ద్వారా ప్రకటించబడిన పీ.ఎం ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకంపై అవగాహన కల్పించుటకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక క్యాంపులలో ఆధార్ కార్డు ఆహార భద్రత కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కిసాన్ క్రెడిట్ కార్డ్, పి.యం. కిసాన్, జన ధన అకౌంట్, జాబ్ కార్డ్, కులము సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ కవరేజ్ మొదలగు అర్హులకు అందించడం జరుగుతుందని అన్నారు. జూలై 1 నుంచి 5 వరకు గిరిజన ఆవాసాలలో జరిగే పీ.ఎం ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ అవగాహన సదస్సులను గిరిజన గ్రామాలైన వీర్నపల్లి మండలంలోని మద్దిమళ్ళ తండా, సీతారామ నాయక్ తండ, జవహర్ లాల్ నాయక్ తండ, మరియు రుద్రంగి మండలములోని వీరుని తండ, అడ్డబోర్ తండా, దేగావాత్ తండా, గాయిడిగుట్ట తండ, రూప్లా నాయక్ తండా, సర్పంచ్ తండా, మానాల, బడి తండా, చింతామణి తండాలోని గిరిజన ప్రజలందరూ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# ప్రజలు మెచ్చే విధంగా కాలనీల అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటేల్ గూడ బిహెచ్ఈఎల్ మెట్రో ఎన్‌క్లేవ్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం
- అతి త్వరలో కోటి రూపాయల సొంత నిధులతో గుడి, మసీదు, చర్చి నిర్మాణాల పూర్తి





**రామచంద్రపురం, జూన్ 29(మనం న్యూస్):** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలను ప్రజలు మెచ్చే విధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ బీహెచ్ఈఎల్ మెట్రో ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల క్రితం ఏర్పడిన బిహెచ్ఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీతో పాటు సమీప కాలనీల ప్రజల కోసం ఏడు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. కాలనీలో గుడి, మసీదు, చర్చి నిర్మాణల కోసం 30 లక్షల రూపాయల సొంత నిధులు అందించడం జరిగిందని గుర్తు చేశారు. అతి త్వరలో మరో 70 లక్షల రూపాయలు కేటాయించి నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 20 కాలనీలో ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందిస్తున్నామని, మిగిలిన కాలనీల ప్రజల కోసం త్వరలోనే పైపులైె నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

నూతన కమ్యూనిటీ హాల్లో ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు సొంత నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన అందిస్తూ.. ప్రతి ఒక్కరి ఆర్థిక అభ్యున్నతి లక్షంగా పనిచేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు చేసే సమయంలో ఆటంకాలు ఎదురు కావడం అత్యంత సహజమని, వాటిని ఎదుర్కొంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ కాలనీల అభివృద్ధికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, జ్ఞానేశ్వర్, రాజు, కృష్ణ, శ్రీకాంత్, మల్లేష్, బీహెచ్ఈఎల్ యూనియన్ ప్రతినిధులు రెహమాన్, దామోదర రెడ్డి, మల్లేష్, మల్లికార్జున గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్స్ షురూ

- 240 సీట్లు భర్తీ అవ్వనున్నాయి
- అన్ని సౌకర్యాలు కల్పించాం
- హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాల కోడ్ ఎస్.యూ.సి.ఈ.
- రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్,జూన్ 29,(మనం న్యూస్):** హుస్నాబాద్ శాతావాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యిందని...కౌన్సిలింగ్ కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యిందని రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ 21 ఇంజనీరింగ్ కళాశాలలో ఈ సంవత్సరం తొలిసారి శాతావాహన యూనివర్సిటీకి సంబంధించి హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల తరగతులు ప్రారంభమవుతున్నాయి అన్నారు. హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్, (ఈసిఈ, సిఎస్ఈ, ఐ.టీ., ఏ.ఐ.) కోర్సులు ప్రతి విభాగంలో 60 సీట్లకు మొత్తం 240 సీట్లు ప్రభుత్వం మంజూరీ చేసిందన్నారు. ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకున బట్టి మనకు సీటు కేటాయింపు ఉంటుందన్నారు. హుస్నాబాద్ ప్రాంత విద్యార్థులు, సమీప జిల్లాల విద్యార్థులు మీకు వచ్చిన ర్యాంకును బట్టి హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్ తీసుకోగలరు అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసామన్నారు. విద్యార్థులు ప్రథమ ప్రాధాన్యతగా హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలకు ఆప్షన్ ఇవ్వగలరని కోరారు.

# సదానందాశ్రమంలో ప్రత్యేక పూజలు




**మిరుదొడ్డి, జూన్ 29, మనం న్యూస్:** ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలని పురోహితులు విఠల రాజపున్నయ్య శర్మ అన్నారు. ఆదివారం మిరుదొడ్డి గ్రామ శివారులో గల శ్రీ సదానంద ఆశ్రమంలో పురోహితులు రాజపున్నయ్య శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నేతృత్వంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పుష్పార్చన, బిల్వార్చన మహా ఆశీర్వాదం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు రాజపున్నయ్య శర్మ మాట్లాడుతూ శివలింగానికి పూజా కార్యక్రమాలు చేపట్టడం వల్ల పుణ్యాలు కలుగుతాయని అన్నారు. ప్రతి నెల ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు చంద్రశేఖర శర్మ, రమేష్ శర్మ, ఆశ్రమ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘునందన్ రావుకు నేతల పరామర్శ



**మిరుదొడ్డి, జూన్ 29, మనం న్యూస్:** హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావును సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ తోపాటు మిరుదొడ్డి మండల పార్టీ అధ్యక్షులు జిగిరి అమర్ ఆదివారం పరామర్శించారు. ఎంపీ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎల్లప్పుడూ ప్రజా సేవలో ఉండే నాయకుడు ఆసుపత్రిలో ఉండడం చాలా బాధాకరమన్నారు. వారి వెంట బీజేపీ సీనియర్ నాయకులు తుంగ కనకయ్య తదితరులు ఉన్నారు.

# శాలివాహనుల ఆధ్వర్యంలో ఆషాఢ మాసం బోనాలు

- శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టీపీసీసీ మెంబెర్ దరిపల్లి చంద్రం

సిద్దిపేట అర్బన్, జూన్ 29, మనం న్యూస్: ఆషాఢ మాసం పురస్కరించుకొని సిద్దిపేట శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కట్ట మైసమ్మకు బోనాలు సమర్పించారు. ఆదివారం నాడు సిద్దిపేట పట్టణంలో శాలివాహన (కుమ్మర్ల)సంఘం ఆధ్వర్యంలో కోమటి చెరువు కట్ట మైసమ్మకు శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం కుటుంబ సమేతంగా బోనాలు సమర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరి పై ఉండాలని, వర్షాలు పడి పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా ఆషాఢమాసం తొలి ఆదివారం రోజున తల్లికి పెద్దఎత్తున బోనాలు చేసి పూజలు చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం సభ్యులు, కులసంఘ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# జాగృతి అధ్యక్షుడిగా బొజ్జ మహదేవ్ నియామకం



**కొండపాక, జూన్ 29, మనం న్యూస్:** దుద్దెడ జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన పాలక మండలిని ఆదివారం రోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు నారోజు రవీంద్రా చారి సభాధ్యక్షతన జరిగిన ఎన్నిక ప్రక్రియలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పాలకమండలి సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. అధ్యక్షుడిగా బొజ్జ మహదేవ్, ఉపాధ్యక్షుడిగా పబ్బోజు బ్రహ్మచారి, ప్రధాన కార్యదర్శిగా బూరుగుల వెంకట రమణ, కోశాధికారిగా బుస్స శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా పబ్బోజు రాజయ్య, డైరెక్టర్లుగా మల్లేష్ బాబు, తిరుపతి మల్లేశం , సలహాదారులుగా పెద్ది శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కంఠ మహేశ్వర స్వామి స్థలం కబ్జాకు యత్నం

- బీర్ల అయిలయ్యకి వినతి పత్రం అందజేసిన నాంచారి పేట గౌడస్తులు



**మోటకొండూర్, జూన్ 29(మనం న్యూస్):** నాంచారిపేట గ్రామ పరిధిలో నిర్మితమైన గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న భూ పట్టాదారు పైళ్ల దయాకర్ రెడ్డి 2005 లో 8 గుంటల స్థలాన్ని ఆలయ నిర్మాణం కొరకు అమ్మి తిరిగి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న పట్టాదారుడు పైళ్ల దయాకర్ రెడ్డి. 2005 లో కొనడం జరిగింది 2008- 2009 లో ఆలయ నిర్మాణం చేయడం జరిగింది, 2018 లో గ్రామకంఠం లో నమోదు కావటం జరిగింది. ఇప్పటివరకు పట్టాదారుని పాస్ పుస్తకంలో నుండి ఈ 8 గుంటల స్థలం తొలగించక పోవడంతో ఇదే అవకాశంగా తీసుకొని ఆలయ భూమిని కబ్జా చేసేందుకు చూస్తున్న పైళ్ల దయాకర్ రెడ్డి. పట్టాదారుని పాస్ పుస్తకం నుండి ఆలయానికి అమ్మిన సదరు భూ వివరాలను తొలగించాలని, ఆలయాన్ని ఆలయ భూమిని కబ్జాదారుల కొరలనుండి కాపాడాలని ఆలేరు నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యని కలసి వినతి పత్రాన్ని అందచేసిన నాంచారిపేట గౌడ కుల సంఘం సభ్యులు. దీనికి ఎమ్మెల్యే ఐలయ్య సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని న్యాయం చేస్తానని మాట ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్లూరి సత్యనారాయణ గౌడ్, పోతగాని సత్యనారాయణ గౌడ్, పోతగాని గోపాల్ గౌడ్, శిగ అంజయ్య గౌడ్, పోతగాని వెంకటేష్ గౌడ్, పోతగాని భాస్కర్ గౌడ్, పోతగాని సాయిలు గౌడ్, పోతగాని బాలయ్య గౌడ్, గణగాని నాగరాజు గౌడ్, పోతగాని శ్రీనివాస్ గౌడ్, పోతగాని అమరేందర్ గౌడ్, పోతగాని వెంకటేష్ గౌడ్, ముద్దం నాగరాజుగౌడ్, కల్లూరి అంజయ్య గౌడ్, పోతగాని శంకరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



**ములుగు, జూన్ 29, మనం ప్రతినిధి:** అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని కన్నాయిగూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండీ. ఆఫ్సర్ పాషా అన్నారు. జిల్లాలోని కన్నాయిగూడెం మండలంలోని చింతగూడెం గ్రామంలో ఇందిరమ్మ గృహాలను ఆదివారం ఆయన ముగ్గు పోసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ దుర్గం ప్రభాకర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు సునార్కని రాంబాబు, సాంబశివ, జంగ కృష్ణ, వంగల సుమన్ గ్రామ పార్టీ అధ్యక్షులు నవీన్ నాయకులు ముడిగ రమేష్, సదన్ రావు, దుర్గం రామ్మూర్తి, కావేరి లక్ష్మి, ముడిగ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు జిల్లా క్రీడాకారుల ఎంపిక



**సిద్దిపేట అర్బన్, జూన్ 29, మనం న్యూస్:** హైదరాబాదులోని హకీంపేటలో జూలై 1, 2 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి ప్రాంతీయ క్రీడా పాఠశాలల (స్పోర్ట్ స్కూల్స్)ఎంపిక పోటీలకు సిద్దిపేట జిల్లా క్రీడాకారులు (18)ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గ్రీన్ ఫీల్ స్టేడియంలో 24వ తేదీన జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారిలో బాలుర విభాగం నుండి ఎం. ఆత్రేయ కృష్ణ, ఏ. రేవంత్ నాయక్, జి. విశ్వాన్ సత్యర్థ్, సి .హెచ్.శ్రేయన్, బండారి అక్షిత్, కడవెరుగు అభినవ్, మాలోతు చరణ్, సుంచు సుస్వాంత్, పిల్లి రక్షిత్ కుమార్, పాక మనిత్ లు ఎంపిక అవ్వగా, బాలికల విభాగం నుండి చింతల ప్రనిషి, మామిడాల వేద సహిత, పోతుల దేవాన్షి, మాటూరి హర్షిత, సందుల గాయత్రి, చిట్టి రశ్మిత, జాజుల చరిష్మా, తుంగతుర్తి కృతికలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జులై ఒకటో తారీఖున ఉదయం 10 గంటలకు స్టేడియం ప్రాంగణంలో సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ హైమావతి, క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు అభినందించారు.

# మహా న్యూస్‌పై దాడిలో గెల్లు శ్రీనివాస్ అరెస్ట్

- మధుసూదనాచారి, బాల్క సుమన్‌పై కేసు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మహా న్యూస్‌పై జరిగిన దాడి ఘటనలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, గెల్లును అరెస్ట్ చేసేందుకు తెలంగాణ భవన్‌కు వెళ్లారు. ఈ సమయంలో అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ బంజారాహిల్స్ పీఎస్‌లో వారిపై మరో కేసు నమోదు చేశారు. దాడిలో నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసులు బుక్ చేసినట్లు తెలిపారు.

## దాడిని ఖండించిన కాంగ్రెస్..

ఈ దాడిని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం మహా న్యూస్ కార్యాలయాన్ని సందర్శించి, జర్నలిస్టులు, సిబ్బందికి సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ, ఈ దాడి వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని, కేటీఆరే స్వయంగా గూండాలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు.

# అధికారం కోల్పోవడంతో 'వొడితల' గాయి గత్తరయితండు

- మంత్రి పొన్నం పై విమర్శలు మానుకోవాలి
- హుస్నాబాద్‌లో తిరగనివ్వం
- క్యాంపు కార్యాలయంను పంచాయతీ భవనం చేసిర్రు
- మీ ఓటు హక్కు సింగాపురంలోనే
- ప్రభుత్వ కార్యాలయ ముద్రలు మీ నాయకుల వద్దనే
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

**హుస్నాబాద్, జూన్ 29(మనం న్యూస్):** పదేండ్లు అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అధికారం కోల్పోవడంతో గాయి గత్తరా అవుతుండు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి విమర్శించారు. పట్టణ కేంద్రంలోని

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లు అధికారంలో ఉన్న తన ఓటు హక్కును మార్చుకోలేదని ఆరోపించారు. ఏ ఒక్క పార్టీ నాయకుడిని మంత్రులు విమర్శించలేదని తెలిపారు. కేసీఆర్‌కు హుస్నాబాద్ సెంటిమెంట్ అంటడు, సంగారెడ్డి, సూర్యపేట ఎన్ని సెంటిమెంట్లు ఉంటాయని ప్రశ్నించారు. మంత్రి పొన్నం గౌరవెల్లి ప్రాజెక్టులో తట్టెడు మట్టిని తీసాడా అని ప్రశ్నిస్తున్నావు అన్నారు. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందే మా ప్రభుత్వం అని అప్పుడే 12.50 కి.మీ.టన్నెల్ నిర్మించినమంటూ తెలిపారు. మేము నిర్మించిన కట్ట పైకి వచ్చిన కేసీఆర్ కుర్చీ వేసుకుని కూర్చుంటా ఏవడు అడ్డు వస్తాడో ప్రాజెక్టుకు అన్నాడు. పదేండ్లు అధికారంలో ఉండి ప్రాజెక్టును పూర్తి చేయకపోవడం మీ అసమర్థత కాదా అంటూ ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టు తర్వాత జిల్లాలో మూడు ప్రాజెక్టులను కట్టి పూర్తి చేసిన గౌరవెల్లిని పూర్తి చేయకపోవడం ఈ ప్రాంత ప్రజల పై మీకు ప్రేమ లేదన్నారు. ఈ ప్రాంతాన్ని విధ్వంసం చేసిర్రు అంటూ మండిపడ్డారు. ఈ ప్రాంత రూపురేఖలు, అందహీనంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వ కార్యాలయాల మున్సిపల్, సబ్‌రిజిస్టార్ ముద్రలు మీ నాయకులే కొడితిరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉద్యోగం పెట్టిస్తానంటూ ఎం.ఈ.వో.అర్జున్ రూ.10 లక్షలు లంచం తీసుకుంటే క్యాంపు కార్యాలయంలో పంచాయతీలు చేసి పంచాయతీ భవనంగా మార్చారు అన్నారు. ఇంజనీరింగ్ కళాశాల తీసుకువస్తే మాజీ ఎమ్మెల్యేకు కండ్లు మండుతున్నాయి అన్నారు. మా నాయకుడు అక్కు శ్రీనివాస్ అంబులెన్స్ కోసం భిక్షాటన చేస్తే లెక్కలు అడగటం విడ్డూరంగా ఉందన్నారు. మీరు ఒక్క అంబులెన్స్ అయిన తెచ్చిర్రా అంటున్నరు కదా అక్కన్నపేట మండలంకి ఇటీవల అంబులెన్స్ ఇచ్చామని తెలిపారు. ప్రజలకు అవసరమైన చోట ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించకుండా మీ నాయకుల భూములు ఉన్న దగ్గర రియల్ భూములకు ధరలు రావాలని ఊరి బయట కార్యాలయాలు నిర్మించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. భూనిర్వాసితులకు మేము ఏనాడు కూడా రూ.30 లక్షల పరిహారమిస్తా అనలేదు అన్నారు. మంత్రి పొన్నం తొలి బడ్జెట్‌లోనే రూ.437 కోట్లు తీసుకువచ్చి 178 ఎకరాల భూసేకరణ పూర్తి అయ్యిందన్నారు. ఆనంతరం డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్ మాట్లాడుతూ పొన్నంను విమర్శిస్తే తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. గౌరవెల్లిని పూర్తి చేయకుండా మోటర్ల వారంటీ ఐపోతుందని ట్రయల్ రన్ చేసి ప్రాజెక్టును పూర్తి చేసామంటూ ప్రచారం చేసుకున్నారని మండిపడ్డారు. గ్రీన్ ట్రిబ్యునల్ కేసులు మేము వేసామా..మీరే మాపై కేసులు పెట్టించిర్రు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. పదేండ్లలో అభివృద్ధి చేసే అవకాశం ఉన్న మీరు చేయలేదని ఆరోపించారు. పదేండ్లలో మీరు పట్టణంలో 200 డబుల్ బెడ్‌రూమ్‌లు ఇస్తే ఏడాదిలోనే 144 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినం అన్నారు. మీరు ఉండేది.. హన్మకొండ.. హుజురాబాద్, హుస్నాబాద్ గురించి మీకు ఏమైనా అవగాహన ఉందా అంటూ ప్రశ్నించారు. నాడు సి.పి.ఐ., కాంగ్రెస్ పొత్తులో భాగంగా పోటీ చేస్తే మీ పలుకుబడి ఉపయోగించుకుని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి టిక్కెట్ రాకుండా చేసింది మీరే కదా అంటూ ప్రశ్నించారు. ఈ ప్రాంతాన్ని సిద్దిపేటలో కలిపి సురభి మెడికల్ కళాశాలకు ప్రోత్సాహం ఇచ్చింది మీరే కదా అన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు కోమటి సత్యనారాయణ, చిత్తారి పద్మ, డా.అక్కు శ్రీనివాస్, వల్లపు రాజు, శ్రీనివాస్, బూరుగు కిష్టస్వామి, తదితరులున్నారు.



# ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్స శిబిరం

- ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



భద్రాచలం, జూన్ 29( మనం న్యూస్): ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్స ,ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం, లయన క్లబ్ జటావు, వికాస తరంగిణి వార్ల అధ్వర్యంలో యంఎన్ జె కేన్సర్ ఆసుపత్రి హైదరాబాద్ వారి బృందము 'పుష్పగిరి కంటి ఆసుపత్రి' సికింద్రాబాద్ బృందం వార్ల సహకారంతో శనివారం భద్రాచలంలోని కూనవరం రోడ్ నందు గల మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్స, నేత్ర శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ముందుగా ఎమ్మెల్యే డా:తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం గిరిజన ప్రాంతంలో కంటి చూపు తక్కువతో చాలా మంది బాధపడుతున్నారని, అదే విధంగా గర్భకోశ వ్యాధులు, రొమ్ముల్లో గడ్డలతో మహిళలు బాధపడుతున్నారని ఇటువంటి పేద ప్రజల, ఆదివాసీ గిరిజనుల ఆరోగ్యం సంరక్షించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ల బ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరములు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. స్వచ్ఛంద సంస్థల సేవలను అభినందించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించుటకు యంయన్ క్యాన్సర్ ఆసుపత్రి వారు, పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ వారు ఏజన్సీ ప్రాంతమైన భద్రాచలం మారుమూల ప్రాంతాలకు వారి బృందాలను పంపించడం అభినందనీయమని కొనియాడారు. భద్రాచలం డివిజన్లో పుట్టుకతో వచ్చు రక్తహీనత, సికిల్సెల్ ఎనిమియా. తలసేమియా వ్యాధిని పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి, రక్తదాన శిబిరములను నిర్వహించి, ఈ వ్యాధులను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రణాళిక చేపడతామని తెలిపినారు. అదే విధంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం, లయన్స్ క్లబ్ జటావు, వికాస తరంగిణి స్వచ్ఛంద సంస్థల సేవలను కొనియాడారు.ఈ శిబిరంలో డా.ఎస్.ఎల్.కాంతారావు డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ డా: యం. శ్రీనివాసులు- డైరెక్టర్ యంఎన్ క్యాన్సర్ ఆసుపత్రి, డా:. జి, కృష్ణారెడ్డి- ఆంధ్ర మహిళా సభ ఆసుపత్రి సూపరింటెండెంట్ వార్ల సహకారంతో ఈ శిబిరం నిర్వహించగలిగామని, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, మారుతి సర్సింగ్ కాలేజి విద్యార్థినులు, సిబ్బంది 210 గ్రామాలలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి సర్వే జరిపినారని తెలిపినారు. ఈ శిబిరములో నేడు 650 మందిని కంటి చూపు తక్కువగా ఉన్న వారిని పరీక్షించి, 326 మందిని కేటరాక్ట్ కంటి ఆపరేషన్ల కొరకు ఎంపిక చేసినట్లు తెలిపినారు. అదే విధంగా 17 మంది పురుషులలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కొరకు పరీక్షించారని, 92 మంది మహిళలో గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కొరకు పరీక్షలు నిర్వహించినారని, 16 మందికి మోమోగ్రఫీ పరీక్షలు నిర్వహించి బ్రెస్టు క్యాన్సర్ నిర్ధారరణ కొరకు పరీక్షలు నిర్వహించినారని తెలిపినారు.ఈ కార్యక్రమంలో కె.దామోదర్రావు, ఆర్డీవో భద్రాచలం ,డా:యస్. వెంకటపుల్లయ్య, యంవిఐ భద్రాచలం,డా: బిఆర్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్, ఎ.జగదీష్, డా: బి. సుబ్బరాజు, డా: వి. జయభారతి, చారుగుళ్ళ శ్రీనివాస్, యస్.ఎన్.వి. రామారావు, డా: యం. మధు మోహన్ రెడ్డి, క్యాన్సర్ నిపుణులు, డా:పి, ప్రజ్ఞా, క్యాన్సర్ నిపుణులు, కమలా రాజశేఖర్, నక్కా వెంకన్న యాదవ్, టి.సిద్ధులు, జిఎస్ శంకర్రావు, కె.అబ్రహం, వి. కామేశ్వరరావు, బోగాల శ్రీనివాసరెడ్డి, బి.వెంకటరెడ్డి, ఆది, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల దీక్షలను విజయవంతం చేయండి



- కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం, జూన్ 29(మనం న్యూస్)ః జూలై 3, 4, 5 తేదీలలో తెలంగాణ అమరవీరుల ప్రాంగణం ఉస్మానియా క్యాంపస్ హైదరాబాద్ లో జరిగే ఉద్యమకారుల దీక్షను విజయవంతం చెయ్యాలని పిలుపునిస్తూ మయూరి సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను సీనియర్ ఉద్యమకారుడు పాలకుర్తి కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామ అంజిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆరు దశాబ్దాల పాటు పోరాటం సాగిందని, ఇందులో తొలిదశ పోరాటం 1969 నాటిదైతే , మలిదశ ఉద్యమ పోరాటం 2000 సంవత్సరంలో జరిగిందని , ఈ రెండు దశల్లోనూ బలిదానాలు జరిగాయన్నారు. త్యాగాలు వీరబూసాయి, కొందరు ఆత్మార్పణ చేసి మరి కొందరు సర్వం కోల్పోయి జైలు పాలై , కేసులపాలై నానా యాతనలు పడ్డారు. అలాంటి త్యాగధనల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో తమకు ఆదరణ,గౌరవం లభిస్తుందని ఉద్యమకారులు భావించారని, గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉద్యమకారులకు శూన్యహస్తమే మిగిలింది. ఇది గమనించిన ఇప్పటి ప్రభుత్వం (కాంగ్రెస్) నాయకులు ఉద్యమకారులకు ఏవేవో చేస్తామని హామీలు ఇచ్చారని 18 నెలలు గడిచిన పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు జూలై 3, 4, 5 తేదీలలో హైదరాబాదులోని ఉస్మానియా క్యాంపస్లో తెలంగాణ అమరవీరుల ప్రాంగణంలో దీక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరక పల్లి ఎల్లయ్య , జిల్లా ఆర్గనైజర్ ఎం రాతి కొండల్ రావు, రాష్ట్ర కోశాధికారి కుదురు పాక ఉదయ్, మలిదశ ఉద్యమకారుల, రాష్ట్ర నాయకులు బట్టు రాజేందర్, లింగంపల్లి సతీష్, ఎల్ హెచ్ పి ఎస్ చౌహన్, రాష్ట్ర నాయకులు మురళి, మొగిలి నాగేశ్వరరావు, తుమ్మరబత్తిని కోమరుబత్తిని రాజేష్, ఒట్టే నాగరాజు , పగడాల శీను, అంచ యాకయ్య, రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 1 నుంచి ఎప్ సెట్ కౌన్సిలింగ్ ప్రారంభం

ఖమ్మం, జూన్ 29(మనం న్యూస్)ః తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ , ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎప్ సెట్ 2025) లో అర్హత సాధించిన అభ్యర్థులకు జూలై 1 నుంచి 8వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆన్ లైన్ ద్వారా స్లాట్స్ బుక్ చేసుకున్న అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీ, సమయానుసారంగా, సకాలంలో తమ కళాశాల ఆడిటోరియంలో జరిగే కౌన్సిలింగ్ కు హాజరు కావాలని సూచించారు. ఈ ప్రక్రియ తో పాటు 6వతేదీ నుంచి 10వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు .కౌన్సిలింగ్ కు 6వ తరగతి నుండి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, పదవతరగతి, ఇంటర్ మార్కుల జాబితా ఇంటర్ టీ.సి, ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, ఇన్ కం సర్టిఫికెట్. 1-1-2025 నుండి తీసుకున్నది, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ 2025 (ఎకనమికల్లీ వీకర్ సెక్షన్స్ కుమాత్రమే)స్లాట్ బుకింగ్ ఫాంఎప్ సెట్ ర్యాంకు కార్డు ఎప్ సెట్ హాల్ టికెట్ రెండు జిరాక్స్ సెట్లు సర్టిఫికెట్స్ వెంట తీసుకు రావాలని వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఏఈ అందించిన లేఖ ప్రకారం తహశీల్దార్ ద్వారా ఇసుక కూపన్ జారీ
- స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇసుక రీచ్ ల నిర్వహణ



ఖమ్మం, జూన్ 29(మనం న్యూస్)ః ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఇసుక సరఫరాకు పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. బోనకల్ మండలంలోని కలకోట, బ్రాహ్మణ పల్లి, రాయన్న పేట, ముదిగొండ మండలంలో గంధసిరి, గంగాపురం, పెద్ద మండవ, చింతకాని మండలంలో చిన్న మండవ, మధిర మండలంలో కమ్మంపాడు, చిలుకూరు, నక్కల గరుబు, ఎర్రుపాలెం మండలంలో తక్కెల పాడు, ఇంగాలి, చొప్పకట్లపాలెం, తిరుమలాయపాలెం మండలంలో ముజిడు పురం, హైదర్ సాయి పేట, కూసుమంచి మండలంలో జక్కేపల్లి, తల్లాడ మండలంలో గొల్లగూడెం, వైరా మండలంలో ఖానాపురం, వెప్పలమడక వద్ద ఇసుక రీచ్ లను గుర్తించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుందని, ఎటువంటి సీనరేజి చార్జిలు ఉండవని అన్నారు. మండల హౌసింగ్ శాఖ ఏ.ఇ. ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలు, ఇంటి నిర్మాణ స్థలం, అవసరమైన ఇసుక వివరాలతో సంబంధిత తహసిల్దార్ కు నిర్ణీత నమూనాలో ప్రతిపాదనలు అందిస్తారని కలెక్టర్ తెలిపారు. ఏఇ అందించిన ప్రతిపాదనలు ఆధారంగా తహసిల్దార్ లబ్దిదారులకు కూపన్ జారీ చేస్తారని, ఆ కూపన్ 3 రోజుల వరకు చెల్లుబాటు అవుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు జిల్లాలో ఏ ఇసుక రీచ్ నుంచైనా తమకు కేటాయించిన ఇసుక తీసుకుని వెళ్ళవచ్చని అన్నారు. ఇసుక రీచ్లను స్వశక్తి మహిళా సంఘాలు పర్యవేక్షిస్తారని, లబ్ధిదారులు వారికి కేటాయించిన మేర మాత్రమే ఇసుక లోడు తీసుకుని వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఇసుకను కేవలం మనుషులు మాత్రమే లోడ్ చేయాల్సి ఉంటుందని ఎటువంటి మేషినరీ వాడకం అనుమతి లేదని అన్నారు.ఎడ్ల బండ్లు లేదా ట్రాక్టర్ల ద్వారా మాత్రమే ఇసుక తరలించాల్సి ఉంటుందని, ఉదయం 6.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు మాత్రమే ఇసుక తరలింపు చేయాలని, రాత్రి వేళలో ఇసుక తరలింపుకు అనుమతి లేదని కలెక్టర్ తెలిపారు. ఇట్టి సదుపాయాన్ని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# 11 12 తేదీల్లో ఖమ్మంలో కెవిపిఎస్ జిల్లాస్థాయి సామాజిక శిక్షణా తరగతులు



- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

ఖమ్మం, జూన్ 29(మనం న్యూస్)ః కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సామాజిక శిక్షణా తరగతులు జూలై 11, 12 తేదీలలో ఖమ్మం జిల్లా కేంద్రంలోనీ మంచికంటి ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్నెస్పీ క్యాంప్ లోని మంచికంటి ఫంక్షన్ హాల్ లో సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం ముత్తమాల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్బంగా మనోహర్ మాట్లాడుతూ ఈ క్లాసుల జయప్రదానికి విరివిగా హార్దిక, ఆర్థిక సహకారాన్ని అందించి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఎన్నికలలో ఇచ్చిన అంబేద్కర్ అభయహస్తం పథకం ఉన్నట్టు లేనట్టా అని ప్రశ్నించారు. రాజీవ్ యువ వికాసం వలన దళితులకు ఒనగూరేదేమి లేదని అన్నారు. సంక్షేమ పథకాల జాడే లేదన్నారు. ఎన్నో ఆశలతో ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం దళిత యువకులు ఎదురు చూస్తున్నారని, ఏ ఒక్క స్కీమ్ అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో ప్రస్తుతం ఉన్న గురుకులాలను ఎత్తివేయడం మానుకోవాలని అన్నారు. నాణ్యమైన విద్యా, వైద్యం అందరికి ఉచితంగా అందించాలని కోరారు. జూలై 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే క్లాసులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు, క్లాసులకు ముఖ్య అతిథిగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబుతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై క్లాసులు బోధించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల భారతి, బండి రమేష్, జిల్లా ఆఫీసు బేరర్స్ పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, నకరికంటి చిరంజీవి, మాగి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# 11 కేజీల గంజాయి స్వాధీనం : ముగ్గురు అరెస్ట్

పరారీలో ముగ్గురు : కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం

నిందితులను రిమాండ్ కు తరలింపు : సీఐ



పాల్వంచ, జూన్ 29(మనం న్యూస్): మున్సిపల్ పరిధి రెజీనా స్కూల్ సమీపంలో పట్టణ పోలీసులు శనివారం సాయంత్రం ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా.. మరో ముగ్గురు పరారయ్యారు. వివరాలను సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఏపీ 28 సి ఎల్ 3399 నెంబర్ (రెనాల్ట్ డస్టర్ ) కారులో గంజాయి తరలిస్తూ ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా.. మరో ముగ్గురు పారిపోయారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురు వ్యక్తుల వద్ద 11 కేజీల 100 గ్రాముల గంజాయి తోపాటు కార్ (ఏపీ 28 సి ఎల్ 3399), రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వెల్లడించారు.

**పట్టుబడ్డ నిందితుల వివరాలు :**

చింతకాని మండలం, నాగులవంచకు చెందిన కందిమల్ల శ్రీహరి ( విద్యార్థి ), ఇదే గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రాకేష్ రెడ్డి ( వార్డు బాయ్, శ్రీ సాయి మల్టీస్పెషల్టి హాస్పిటల్ ఖమ్మం ), బోనకల్లు మండలం, ముష్టి కుంట్లకు చెందిన షేక్ జావిద్( ఎలక్ట్రీషియన్ )లు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు సీఐ వివరించారు.



# డ్రైనేజీ నిర్మాణంపై అవగాహన సదస్సు

- పాల్గొన్న అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని

మధిర టౌన్, జూన్ 29(మనం న్యూస్): మధిర పట్టణంలో చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుపై మధిర క్యాంపు కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో మల్లు నందిని విక్రమార్క ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ'అభివృద్ధి చెందిన పట్టణాలకు శుభ్రత, పారిశుధ్యం, సమగ్ర మౌలిక సదుపాయాలు కీలకం. మధిర పట్టణాన్ని ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుంది' అని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఉద్దేశమని పేర్కొన్నారు. సదస్సులో మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం నిపుణులు పాల్గొని డ్రైనేజీ ప్రాజెక్టు రూపకల్పన, అమలు విధానాలు, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై వివరంగా వివరించారు. అవసరమైన సమయంలో ప్రజలు సహకరించి, ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళా సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డైనింగ్ హాల్స్ సదుపాయం ఏర్పాటు చేయాలి

- ఏఐఎస్ఎఫ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మగాని హరీష్

ఇల్లందు, జూన్ 29 (మనం న్యూస్) : సంక్షేమ హాస్టల్స్ లో డైనింగ్ హాల్స్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మగాని హరీష్ డిమాండ్ చేశారు. ఇల్లందు పట్టణ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ హాస్టల్స్ ను సందర్శించి వారితో పాటు కలిసి భోజనం చేసి భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఏళ్ళ తరబడి విద్యార్థులు వర్షానికి తడుస్తూ చలికి వణుకుతూ వరండాల్లో చెట్ల కింద భోజనాలు చేసే పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నో ఏళ్లుగా సంక్షేమ హాస్టల్లో డైనింగ్ హాల్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘంగా పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రతి ప్రభుత్వం విద్యారంగంపై చిన్న చూపు చూస్తూ ఉందే గాని ఇంతవరకు ఈ సమస్యను పరిష్కరించలేదని అన్నారు. నేడు తెలంగాణలో పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఇల్లందు పట్టణంలో ఉన్న సంక్షేమ హాస్టల్స్ లో డైనింగ్ హాల్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి ఎన్ సాయి, సత్యాన్వేష్, రాజేష్ కుమార్,రుషికేశ్, పాల్గొన్నారు.

# బీసీ రాజ్యాధికార సాధనే ధ్యేయం

- బీసీలు రాజకీయ శక్తిగా ఎదగాలి
- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్



ఖమ్మం, జూన్ 29(మనం న్యూస్)ః ఎస్సీ , ఎస్టీ , మైనారిటీలను కలుపుకొని గ్రామమే రాజకీయ యూనిట్ గా చేసి బీసీ రాజ్యాధికార సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో మీడియా మిత్రులతో మాట్లాడుతూ గత 78 సంవత్సరాలుగా బీసీలకు అనేక రకాలుగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్ను 18 శాతానికి కుదించి బీసీలకు వ్యతిరేకంగా పయనించడం వల్లనే గద్దెదించడం జరిగిందన్నారు. బీసీలు కాంగ్రెస్తో ప్రయాణించడం వల్లనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరుగుతున్నా.. ఆ సామాజిక న్యాయం తెలంగాణలో లేకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీలో తీర్మానంచేసి నామినేటెడ్ పదవుల్లో మాత్రం సీఎం సామాజిక వర్గానికి వర్తింపజేయటం అన్యాయమన్నారు. స్థానిక సంస్థల లో రిజర్వేషన్లు వస్తాయనుకుంటే దానిని తాత్సారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బీసీ స్థానిక సంస్థల రిజర్వేషన్ల మీద స్పష్టత ఇవ్వలేక పోయిందన్నారు. అసెంబ్లీలో పాసైన అయిన 42 శాతం బిసి రిజర్వేషన్ ఆమోద బిల్లును గవర్నర్ కు పంపారు కానీ రాష్ట్రపతి ఎప్పుడు ఆమోదించాలని ప్రశ్నించారు. 1992లో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత అప్పటి ప్రధాని పీవీ నరసింహారావుతో సంప్రదించి 92వ రాజ్యాంగ సవరణ చేసి 69 శాతం రిజర్వేషన్లను పెంచి అమలు చేయించుకున్నారని గుర్తుచేశారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు మాని బీసీ రేజర్వేషన్ల పెంపుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా వికారాబాద్ నందు 4 నియోజకవర్గాలకు గాను కనీసం ఒక స్థానం కూడా బీసీలకు దక్కకపోవడం, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను కనీసం ఒక్క స్థానము కూడా బీసీలకు దక్కక పోవడం బీసీలపై కొనసాగుతున్న తీవ్ర వివక్షకు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. గ్రామస్థాయిలో బీసీలు ఐక్యమైతే రాజ్యాధికారం నల్లేరుపై నడకేనని సురేష్ తెలిపారు. జిల్లా బీసీ ముఖ్య నాయకుల సమక్షంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని తద్వారా ప్రతి గ్రామాన్ని ఒక రాజకీయ యూనిట్ గా ఏర్పాటు చేసుకొని పూర్తిస్థాయి కమిటీలను మండల , నియోజకవర్గ , జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసి రాజ్యాధికారమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పెళ్లూరి విజయ్ కుమార్, ఉరుకొండ సైదులు, పీట్ల స్వర్ణ కుమార్, నక్క అజయ్, అయితగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రమణ మూర్తికి ఘన సన్మానం



ఖమ్మం, జూన్ 29(మనం న్యూస్)ః పెవిలియన్ గ్రౌండ్ లో నిత్య నడక సీనియర్ సాధకులైన పెరుమాళ్ళ వెంకట రమణ మూర్తి కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల నందు పనిచేసి జూన్ 30వ తేదీన పదవీ విరమణ చెందుతున్న సందర్భంగా ఆదివారం స్థానిక ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో పి.వి. రమణ మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రామనాథం, రాకమ్ శ్యాం బాబు మాట్లాడారు. పి.వి. రమణ మూర్తి భాగ్య లక్ష్మిలను శాలువాలతో, బొకే, జ్ఞాపిక పూవులతో ఘనంగా దంపతులను సత్కరించి వారి గణ గుణాలను, సేవానిరతిని కొనియాడారు. అనంతరం పి.వి. రమణ మూర్తి పంపిణీ గావించిన మిఠాయిలు, పండ్లు,రాగిజావను అందరూ ఆస్వాదించారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, వెంకట్, వెంకటేశ్వర్లు,రమా శేఖరం,దామోదర్ రెడ్డి, భీమి రెడ్డి, నల్లమోతు వెంకటేశ్వర్లు,కోటయ్య, సుదర్శన్, శ్రీరాములు, మల్లిఖార్జున్, మందా వెంకటేశ్వర్లు, కిరణ్మయి,రమా,సబితా,మాధవి,ఉమా, తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పోరాటాలతోనే పార్టీ విస్తరణ

- పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకం కావాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు




కొత్తగూడెం, జూన్ 29(మనం న్యూస్) ః మతోన్మాద కార్పొరేట్ రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక మంచి కంటి భవన్లో కొత్తగూడెం పట్టణ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు పార్టీ నిర్మాణం పని పద్ధతులు అంశంపై క్లాసు బోధిస్తు ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా పార్టీ విస్తరణ పెరుగుదల ఉంటుందని అన్నారు.ప్రజా సమస్యలపై ప్రజలను ఐక్యం చేయాలని మతం పేరుతో జరిగే విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాల్లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బిజెపి మతం పేరుతో ప్రజలను విభజించు పాలించు అనే బ్రిటిష్ విధానాన్ని అమలు చేస్తుందని విమర్శించారు. ప్రతి అంశాన్ని మత రంగు పులిమి తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకుంటు ప్రజల మధ్య చీలికలు తెస్తున్నారని దుయ్యబట్టారు.దేశ సంపదను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతూ పేద మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ప్రస్తుత రాజకీయాలు వ్యాపారం అయిపోయిన సందర్భంలో కుల మత రాజకీయాలు ముందుకు వస్తున్న నేపథ్యంలో స్వచ్ఛమైన రాజకీయాలు పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని రాజకీయాలలో విలువలు బతికే ఉన్నాయని నమ్మకం ప్రజలకు కల్పించాలని రాజకీయాలలో విలువలకు నిలువటద్దంగా కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి అనే విశ్వాసానికి రేకెత్తించాలని తెలియజేశారు. వర్గ పోరాటాలకు ఆటంకంగా ఉన్న మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గాన్ని ఐక్యం చేయాల్సిన బాధ్యత వారిలో మతోన్మాదానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక అవగాహనను పెంపొందించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని గుర్తు చేశారు. మత రాజకీయాలపై ప్రజలను విభజించాలని చూస్తున్న వారికి ప్రజా సమస్యలను తీసుకొని పోరాటాల ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలపై పోరాటాల చేస్తూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.ఇందిరమ్మ ఇళ్ల ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణ కనపడట్లేదు ఆరోపించారు. కొత్తగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి నందిపాటి రమేష్ నాయకులు ఆలేటి శ్రీను అన్నవరపు ఇందిరా పప్పుల ప్రమోద్ యన్ ఎస్ రాజు వాణి గడల నరసింహారావు పద్మ రజిత మహేశ్వరి బాలకృష్ణ రాములు రఘు నాగదుర్గ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అనిరుధ్ అసత్య ఆరోపణలు మానుకోవాలి

- బాధ్యత గల వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేయొద్దు
- కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం సరికాదు
- గతంలో జడ్చర్లలో ఎప్పుడు ఇలాంటి సంస్కృతి లేదు
- 100 పడకల హాస్పిటల్‌కు రెండెకరాలు ఇచ్చాను
- చేతనైతే ఎమ్మెల్యేగా పక్కనున్న మరో రెండెకరాలు ఇప్పించు
- ప్రభుత్వం మీది బీఆర్ఎస్ నేతల అవినీతి, కబ్జాలు నిరూపించాలి
- బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు
- నా రాజకీయ జీవితంలో అవినీతి చేయలేదు
- మాజీ మంత్రి డా. సి.లక్ష్మా రెడ్డి

**జడ్చర్ల, జూన్ 29(మనం న్యూస్):** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు మా మీద బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని బాధ్యత గల వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేయొద్దని మాజీ మంత్రి డాక్టర్ చర్ల కోల లక్ష్మారెడ్డి సూచించారు. ఆదివారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రేమ్ రంగా గార్డెన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పాత బజారుకు వెళ్లే రోడ్డు విషయంలో పాత బజారు కి భారీ వాహనాలు వెళ్లడానికి ఎటువంటి ఇబ్బంది లేదని అంబేద్కర్ చౌరస్తా వద్ద డివైడర్ ఓపెన్ ఉంటుందని తెలిపారు. నిదానంగా రైట్ తీసుకొని వెళ్లొచ్చని సూచించారు ఐలాండ్ రోడ్డు మాదిరిగా డిజైన్ ఏర్పాటు చేశామని తెలిపారు పాత బజారు ప్రజలను గందరగోళంలో వడ వేయవద్దని మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి సూచించారు నేషనల్ హైవేకు ఇరుపక్కల 50 ఫీట్ల రోడ్డు ఉండేలా చూసామన్నారు

## డబుల్ బెడ్ రూమ్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎర్రగుట్ట వద్ద 560 ఇండ్లు కట్టించామని అర్హులైన బీద వారికి అధికారులు ఎంక్వయిరీ చేసి ఇవ్వాలని తెలిపారు ఎర్రగుట్ట లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్దిదారులకు దక్కాలన్నారు.అర్హులైన వారికి కేటాయించి మిగతా వారిని ఖాళీ చేయిస్తే మాకేం అభ్యంతరం లేదన్నారు. ఎన్నికల తరువాత ఇండ్లను కొంతమంది ఆక్రమించు కుంటే మాకేం సంబంధం అన్నారు. అయినా అధికారులు విచారణ చేపట్టి నిజమైన లబ్దిదా రులకు ఇండ్లు కేటాయించాలన్నారు బీఆర్ఎస్ నాయకుల పై బురద జల్లడం మానుకోవాలని సూచించారు అవినీతి ఆరోపణలు ఉంటే నిరూపించాలని హితవు పలికారు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిక్షణం పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పని చేసిందని తెలిపా రు. జడ్చర్ల ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది మాకు చేతనైన అభివృద్ధి చేశామన్నారు. తరువాత వచ్చిన వాళ్ళు ఏదైనా తప్పులు ఉంటే సరి దిద్దుకొని ముందుకు వెళ్లాలని సూచించారు



రంగారెడ్డిగూడలో సొంతంగా భూమిని కొనుగోలు చేసి డబల్ బెడ్ రూములు కట్టించి ఇచ్చామని తెలిపారు

## వంద పడకల ఆసుపత్రి

వంద పడకల హాస్పిటల్ నిర్మాణం కోసం రెండు ఎకరాలు కొని నిర్మాణం చేస్తే మా మీద ఆరోపణలు చేయడమేంటన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పక్కనే ఉన్న మరో రెండు ఎకరాలు కూడా హాస్పిటల్‌కి ఇప్పించాలని సూచించారు. జడ్చర్ల నియోజకవర్గం లో చాలా చోట్ల అసైన్మెంట్ ల్యాండ్ తీసుకొని వారికి డబ్బులు ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలో కూడా ఇదే విధంగా చేశామని తెలిపారు. హాస్పిటల్ రోడ్డు నిర్మాణం కోసం అయ్యే ఖర్చు భరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 18 నెలలకు పైగా గడుస్తున్న ఇప్పటివరకు వంద పడకల ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లను ఎందుకు నియమించలేకపోయారని ఆయన సూటిగా ప్రశ్నించారు ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరు అయిందని ఇప్పటి వరకు ఈ యూనిట్‌ను ఎందుకు కట్టించ లేకపోయారని ప్రశ్నించారు మార్చురీ వద్ద ఈ యూనిట్ ను నిర్మించకుండా పక్కనే ఉన్న రెండు ఎకరాలు తీసుకొని అందులో నిర్మించాలని సూచించారు జడ్చర్ల రాజకీయాల్లో కుటుంబ సభ్యులను లాగడం ఎప్పుడు లేదన్నారు మా అక్క మీద రెండు ఎకరాల భూమి ఎక్కడుందో నిరూపిస్తే ఇచ్చేస్తామన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఉదండాపూర్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని మాజీ మంత్రి సూచించారు. ఆర్ అండ్ ఆర్ కు ఇచ్చిన లిస్టులో 300 పేర్లు అదనంగా ఉండటంతో ఐడెంటిఫై చేసి పక్కకు పెట్టినట్లు తెలిపారు గతంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ 11 లక్షలు ఉండగా అప్పటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తో మాట్లాడి 16 లక్షలకు పెంచామని తెలిపారు ఎలక్షన్ సందర్భంగా రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి 25 లక్షలు ఇప్పిస్తామని ఎందుకు ఇప్పించలేకపో యారని ప్రశ్నించారు. ఇరిగేషన్ మినిస్టర్‌తో మాట్లాడి స్పెషల్ ప్యాకేజీ కింద 25 లక్షల వరకు ఇప్పించవచ్చని ఆయన సూచించారు ఉద్దండపూర్ పరిహారం విషయం లో ఎలాంటి అవకతవకలు జరగలేదని అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ ను ఒప్పించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ముప్పై శాతం పెంచామని గుర్తు చేశారు. మీరు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల పరిహారం ఇప్పించాలని కోరారు.

## ప్రజాస్వామ్యమా? రాచరికమా?

జడ్చర్ల నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం నడుస్తుందా రాచరికం నడుస్తుందా అని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు ఎమ్మెల్యే మాతృమూర్తి ఎమ్మార్వో ఆఫీసులో చెక్కులు పంపిణీ చేయడం ఎమ్మెల్యే సహోదరుడు దుష్యంత్ రెడ్డి నవాబుపేటలో పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసం అని సూటిగా ప్రశ్నించారు ఊరుకొండ పేటలో పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ నాయకులు దాదాపు 3 ఎకరాల భూమి కబ్జాకు గురైందని చెప్పడం సమంజసం కాదన్నారు ఎమ్మెల్యే సొంత ఊరిలో ఉన్న టెంపుల్ పేరిట ఎంత భూమి ఉంది ఎవరి పేరిట ఉంది ఆదాయం ఎంత వస్తుంది శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఇకనైనా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదని తెలిపారు ఎమ్మెల్యేగా ప్రజలు అవకాశం ఇచ్చినందుకు జడ్చర్లకు మంచి చేయాలని ప్రజల ఆదరాభిమానాలను చూరగొనేలా ప్రవర్తించాలని జడ్చర్ల నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన హితవు పలికారు ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, మాజీ సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణయ్ చందర్, పిఏసిఎస్ చైర్మన్ సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్లు కాటేమోని శంకర్, కోట్ల ప్రశాంత్ రెడ్డి, ఉమా శంకర్ గౌడ్, సతీష్, జ్యోతి బీఆర్ఎస్ నాయకులు పిట్టల మురళి, రామ్మోహన్, శ్రీశైలం, పరమటయ్య, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## డీ శ్రీనివాస్ కాంస్య విగ్రహావిష్కరణ

- 'ధర్మపురి' కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

**నిజామాబాద్, జూన్ 29(మనం బ్యూరో):** నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని కంఠేశ్వర్ బైపాస్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి, సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. మాజీ మంత్రి డీఎస్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని బైపాస్ రోడ్డులో ఆయన తనయుడు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ రూ.44 లక్షల వ్యయంతో 14 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయగా నిజామాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఇంచార్జీ మంత్రి సీతక్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లే గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని హంగులతో బాలుర కళాశాల భవన నిర్మాణం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్, జూన్ 29(మనం బ్యూరో): అన్ని హంగులతో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవన నిర్మాణం చేస్తున్నట్లు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణం లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను నిర్మించేందుకు కళాశాల ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆయన స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నిర్మాణానికి 3.60 కోట్ల రూపాయల నిధులను తీసుకురావడంతో పాటు, నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నిర్మాణానికి 2 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించి తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. రెండు అంతస్తులలో బాలుర జూనియర్ కళాశాల 9000 ఎస్ఎఫ్టీ లతో, ఒకేషనల్ జూనియర్ కళాశాల 18000 ఎస్ఎఫ్టీ లతో అన్ని హంగులతో అధునాతన భవనాన్ని నిర్మించుకోవడం జరుగుతుందని ఆయన



చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నిర్మాణాన్ని అసంపూర్తిగా నిర్మించి మధ్యలోనే వదిలిపోయారని ఆయన మండిపడ్డారు. సుమారు ఎనిమిది నెలలు కష్టపడి టేబుల్ టు టేబుల్ వరకు ఫైల్స్ పట్టుకుని తిరిగి చివరికి ఈ రెండు కళాశాలల భవనాల నిర్మాణాలకు సంబంధించి అనుమతులు సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ విద్యాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవాని నర్సింహులు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర హోం మంత్రిచే పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం

**నిజామాబాద్, జూన్ 29(మనం బ్యూరో):** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం లాంచనంగా ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న ఆయన అక్కడ నుంచి హెలికాప్టర్ లో నిజామాబాద్ కి చేరుకున్నారు. అనంతరం పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. పసుపు బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పసుపు ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగే రైతు సభలో అమిత్ షా పాల్గొన్నారు. కంఠేశ్వర్ కూడలిలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆయన అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పసుపు బోర్డు కార్యదర్శి భవానీ శ్రీ,ఎంపీ ధర్మపురి అర్వింద్, లక్ష్మణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్, కేటీఆర్‌లపై కుట్రలు చేస్తున్నరు

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్ నగర్, జూన్ 29(మనం బ్యూరో):** గతంలో పత్రిక కార్యాలయాలు..టీవీ ఛానళ్ల కార్యాలయాల మీద దాడులు చేసారు..వాటి గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం లేదని వాపోయారు.ఫోన్ ట్యాపింగ్ పేరు మీద కేటీఆర్, హరీష్ రావు ల మీద కుట్రలు చేస్తున్నారు. విల్లే జడ్జిల లెక్కన కొందరు చాన్నాళ్ల వాళ్ళు వ్యవహరిస్తున్నారు. ఛానళ్ల వాళ్ళ కుటుంబ సభ్యుల మీద అట్లనే ప్రచారం చేస్తే ఊరికే ఉంటారా.. ఆడవాళ్ళ జోలికి పోకుండా ప్రసారం చేయండి అని తెలిపారు. సీట్ కాకుంటే కేంద్ర సంస్థలతో విచారణ చేసుకోండి.. ఎవరు తప్పు చేయలేదు.. విచారణకు సిద్ధమే నని అన్నారు.నాయకుల మీద అభిమానంతో నిరసన తెలిపారు.. దానిని తప్పుగా చూపిస్తున్నారు.. వ్యక్తుల మీద ఎవరు దాడులు



చేయలేదు.ఆడవాళ్లను కించ పరుస్తూ.. కుటుంబ వ్యవహారాలను ప్రసారం చేయడం సరి కాదు. ఇదే విధమైన ప్రసారాలు చేస్తే పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం లో అధికారులందరిని విచారణ చేయాలి. చట్ట పరంగా చర్యలు తీసుకోవాలె తప్ప ఇలాంటి ప్రసారాలు చేయవద్దుని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ శాసన సభ్యులు జైపాల్ యాదవ్, ఆలా వెంకటేశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి,ఏమ్మెల్సీ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్

మహబూబ్ నగర్,జూన్ 29(మనం బ్యూరో): మహబూబ్ నగర్‌లో జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల బృందం ఇక్కడి జర్నలిస్టుల దీక్షా శిబిరాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జిల్లాలో గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్ళను లబ్ధిదారులకు స్వాధీనపర్చక పోవడం సరైందికాదని అన్నారు.




పట్టాలిచ్చిన ఇండ్లను జర్నలిస్టులకు స్వాధీనపర్చకుండా ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం, స్థానిక జిల్లా అధికార యంత్రాంగం వివక్ష చూపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించి జర్నలిస్టుల దీక్షలను విరమింప జేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడితాడు బాపురావు, జిల్లా అధ్యక్షకార్యదర్శులు వాకిటి అశోక్ కుమార్, మొలకల పల్లి గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, ఐఫ్ డబ్ల్యు జె ఎఫ్ జాతీయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర రావు,ఎక్ట్రానిక్ బాధ్యులు పసుపుల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం డి రఫీ,అనిల్, రవి కుమార్ లు తదితరులున్నారు.

# జూలై 1 నుంచి ఎప్ సెట్ కౌన్సెలింగ్

- పాలెం డిగ్రీ కళాశాలలో ఇంజినీరింగ్ ధ్రువ పత్రాల పరిశీలన
- కౌన్సెలింగ్ చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.రాములు



**నాగర్ కర్నూల్, జూన్ 29(మనం ప్రతినిధి):** బిజినేపల్లి మండలం పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జూలై 1వ తేదీ నుంచి ఎప్ సెట్-2025 ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం కౌన్సెలింగ్, ధృవపత్రాల పరిశీలన ప్రారంభమవుతుందని ఆ కళాశాల ప్రిన్సిపల్, కౌన్సిలింగ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.రాములు తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, ఎప్ సెట్-2025 ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించిన విద్యార్థులు ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకుని ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలన్నారు. ధృపత్రాల పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు ఎప్ సెట్ 2025 ర్యాంక్ కార్డు, ఆధార్ కార్డు, ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హతగల సర్టిఫికెట్, ఎస్ఎస్సి మార్కుల మెమో, 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, స్థానిక ధ్రువీకరణ పత్రం రెండు జతల జిరాక్స్ పత్రాలతో పాటు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తమ వెంట తీసుకురావాలన్నారు. ఈ దృవపత్రాల పరిశీలన జూలై 4 వరకు కొనసాగుతుందని తెలిపారు.

# కళాకారుల ఆట, పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిరి

- కళాకారులకు సంపూర్ణ మద్దతు
- ఉద్యమకారులను ఏకం చేయుటకు పార్టీలకు అతీతంగా హైదరాబాద్‌లో ధూం ధాం నిర్వహించాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, జూన్ 29(మనం బ్యూరో):** కళాకారులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణం లోని అంబేద్కర్ కళాభవన్ లో తెలంగాణ కళాకారులు ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాటల పల్లకిలో 12 గంటలు పాలమూరులో ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో ఆశలు ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కొందరి చేతిలోనే బంధీ అయిందని ఆయన అన్నారు. బతుకమ్మ అంటే ఆ ఇంటి ఆడపడుచు అయిందని, ఉద్యమకారులు అంటే కొడుకు, అల్లుడు అయ్యారని ఆయన ఆరోపించారు. మీ



పాట లేనిదే తెలంగాణ ఉద్యమం లేదన్నారు. కవులు , కళాకారులు, గాయకులు, వారి పాట, ఆటల తోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది అని తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర విలువ కట్టలేనిదని ఆయన చెప్పారు. గూడ అంజన్న, జయరాజ్, గోరేటి వెంకన్న, అందెశ్రీ లు కలం కు మీ గళం తోడై తెలంగాణ ఉద్యమాన్ని ప్రతి పల్లెకు, ప్రతి గూడెంకు , ప్రతి వాడకు ప్రతి ఊరికి తీసుకువెళ్ళారని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరిని ఉద్యమ ఆవశ్యకతను గురించి ఆలోచించే విధంగా మీ ఆట , పాట చేశాయని అనుటలో అతిశయోక్తి లేదు అని ఆయన చెప్పారు.

ఊరు వాడా అనే తేడా లేకుండా తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళడం లో కళాకారులు అందరూ సఫలీకృతం అయ్యారని ఆయన చెప్పారు. కానీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గత పది సంవత్సరాలుగా పాట మీద, కళల మీద గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధం విధించిందని ఆయన ఆరోపించారు. మీ ఆట, పాట, తెలంగాణ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం అని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం కళాకారుల పైన సానుకూల దృక్పథం తో ఉందని ఆయన అన్నారు. కేసిఆర్ ను అధికారంలో నుండి దించడంలో , ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో కళాకారుల కృషి అభినందనీయం అని ఆయన అన్నారు. నిజాయితికి నిలువెత్తు నిదర్శనం కళాకారులని ఆయన చెప్పారు. మళ్ళీ ఒక్కసారి కేసిఆర్ అధికారంలోకి వస్తే నరమాంసం రుచి తెలిసిన రాబందుల్లా మీద పడేందుకు సిద్దంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారిని ఏకం చేసి హైదరాబాద్ లో ధూం ధాం నిర్వహించాలని, మీ సమస్యలు పరిష్కారించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అంజయ్య గౌడ్, ఉద్యమ కవి గాయకులు నేర్నాల కిషోర్ , టిపిసిసి సాంస్కృతిక సేన అధ్యక్షులు చక్రాల రఘు , జిల్లా కళాకారులు టంకర శ్రీనివాస్, ఎదిర నరసింహులు, ఎదిర బాలస్వామి, రాష్ట్ర మహిళా కళాకారులు అంతడుపుల రమాదేవి, డప్పు స్వామి, మురళి, జక్కగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంగ్లాండ్‌తో తొలి టీ20.. స్మృతి మంధాన సెంచరీ హైలైట్స్

ఇంగ్లాండ్ మహిళల జట్టుతో జరిగిన తొలి టీ20లో భారత్ 97 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. స్మృతి మంధాన (112బీ 62 బంతుల్లో 15ఐ4, 3ఐ6) విధ్వంసక శతకం బాదడంతో మొదట భారత్ 5 వికెట్లకు 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. మహిళల టీ20ల్లో భారత్ తరపున ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. మంధానకు టీ20ల్లో స్మృతి ఇదే తొలి సెంచరీ. మూడు ఫార్మాట్లలోనూ శతకాలు సాధించిన భారత తొలి మహిళా బ్యాటర్‌గానూ ఆమె రికార్డులకెక్కింది. మంధాన సెంచరీ హైలైట్స్ చూసేయండి.

# హైబ్రిడ్ మోడల్‌లో ఆసియాకప్.. జూలైలో షెడ్యూల్..!

ఈ ఏడాది జరగాల్సిన పురుషుల ఆసియా కప్ నిర్వహణపై అనిశ్చితి కొనసాగుతోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో టోర్నీ సాధ్యాసాధ్యాలపై ఆసియా క్రికెట్ మండలి మల్లగుల్లాలు పడుతోంది. అయితే.. ఇరుదేశాలు తటస్థ వేదికపై ఆడేందుకు అంగీకరిస్తా యనే ఉద్దేశంతో ఏసీసీ షెడ్యూల్ విడుదలకు సిద్ధమవుతోంది. జూలై రెండో వారంలో పూర్తి షెడ్యూల్ ప్రకటించేందుకు సన్నాహకాలు చేస్తోంది.దాయాది దేశాల బోర్డులు తమ పట్టుసడలిస్తే సెప్టెంబర్‌లో ఆసియా కప్‌ను ప్రారంభించాలని మొహ్సిన్ నఖ్వీ నేతత్వంలోని ఏసీఏ భావిస్తోంది. షెడ్యూల్ ప్రకారం భారత్ వేదికగా సెప్టెంబర్ రెండో వారం అంటే.. 10 వ తేదీన ఆసియా కప్ జరగాల్సి ఉంది. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్న ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్‌లతో పాటు అఫ్ఘనిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏయూలు ట్రోఫీ కోసం పోటీ పడనున్నాయి.దాయాది దేశాల బోర్డులు తమ పట్టుసడలిస్తే సెప్టెంబర్‌లో ఆసియా కప్‌ను ప్రారంభించాలని మొహ్సిన్ నఖ్వీ నేతత్వంలోని ఏసీఏ భావిస్తోంది. షెడ్యూల్ ప్రకారం భారత్ వేదికగా సెప్టెంబర్ రెండో వారం అంటే.. 10 వ తేదీన ఆసియా కప్ జరగాల్సి ఉంది. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్న ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్‌లతో పాటు అఫ్ఘనిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏయూలు ట్రోఫీ కోసం పోటీ పడనున్నాయి.





# బుమ్రాపైనే ఎక్కువగా ఆధారపడొద్దు.. కుల్దీప్‌ను ఆడించాలి

ఇంగ్లండ్ పర్యటనను ఓటమితో ఆరంభించిన భారత జట్టు సిరీస్ సమం చేయాలనే పట్టుదలతో ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే రెండో టెస్టులో విజయమే లక్ష్యంగా నెట్స్‌లో గంటలకొద్దీ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు టీమిండియా క్రికెటర్లు. అయితే.. సిరీస్‌లో కీలకమైన ఈ మ్యాచ్‌కు వర్క్‌లోడ్ కారణంగా పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉండడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ జట్టు కూర్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత జట్టు ఎక్కువగా బుమ్రాపై ఆధారపడుతోందని.. అలాకాకుండా బౌలర్లు సమిష్టిగా రాణించాలని అజారుద్దీన్ అభిప్రాయపడ్డాడు. 'భారత జట్టు బౌలింగ్ యూనిట్‌లో బుమ్రాపై అతిగా ఆధారపడుతోంది. ప్రతిసారి అతడు మెరుగైన ప్రదర్శన చేయలేడు కదా. పైగా ఇంగ్లండ్ పిచ్‌ల మీద అనుభవజ్ఞులైన బౌలర్లు ఉంటేనే వికెట్లు తీయగలం. అందుకే.. రెండో టెస్టులో కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలి. చైనామన్ బౌలర్ అయిన కుల్దీప్ వైవిధ్యమైన బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించగలడు. ఈమధ్య అతడు గొప్పగా రాణిస్తున్నాడు' అని అజారుద్దీన్ తెలిపాడు. లీడ్స్ టెస్టులో అనూహ్య ఓటమిపై కూడా ఈ దిగ్గజ క్రికెటర్ స్పందించాడు.

# గిల్‌ను కెప్టెన్‌గా కొనసాగించండి: రవిశాస్త్రి

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భారత ఓడిపోయినా.. శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా కొనసాగించాలని టీమ్‌ఇండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి జట్టు యాజమాన్యాన్ని కోరారు. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత గిల్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించిన సంగతి తెలిసిందే. గిల్ తొలి మ్యాచ్‌లో బ్యాటర్‌గా అదరగొట్టినా భారత్‌కు ఓటమి తప్పలేదు.'శుభ్‌మన్ గిల్‌లో చాలా మార్పు కనిపిస్తోంది. ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో మీడియాతో మాట్లాడుతున్నప్పుడు.. టాస్ వేసే సందర్భంలో ఎంతో పరిణతి ప్రదర్శిస్తున్నాడు. అతడిని మూడేళ్లపాటు కెప్టెన్‌గా కొనసాగించాలి. ఇంగ్లాండ్ సిరీస్‌లో ఫలితం ఎలా వచ్చినా.. ఎలాంటి మార్పులు చేయొద్దు. కచ్చితంగా టీమ్ ఇండియాను విజయపథంలో నడిపిస్తాడని భావిస్తున్నా. గొప్ప క్రికెటర్‌గా మారడానికి అవసరమైన అన్ని లక్షణాలు గిల్‌కు ఉన్నాయి. అతను పరిస్థితులకు అనుగుణంగా తన ఆటను మార్చుకుంటే గొప్ప బ్యాటర్‌గా నిలుస్తాడు' అని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. జులై 2 నుంచి ఇంగ్లాండ్, భారత్ మధ్య రెండో టెస్టు ప్రారంభం కానుంది. మ్యాచ్ వేదిక బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్.







# వీరమల్లు ట్రైలర్ ఆరోజే

'హరి హర వీరమల్లు'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రం జులై 24న థియేటర్లలోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా జులై 3న ట్రైలర్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం శనివారం ప్రకటించింది. 17వ శతాబ్దం నాటి మొఘలుల సామ్రాజ్యంలో జరిగే ఆసక్తికర కథతో రూపొందిన చిత్రమిది. పవన్ ఇందులో ధర్మం కోసం పోరాడే యోధుడిగా అలరించనున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటించింది. ఈ సినిమాకి క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులుగా వ్యవహరించగా.. ఎం.ఎం.కీరవాణి సంగీతమందించారు. ఏ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించారు.

# 'తమ్ముడు' రిలీజ్ ట్రైలర్‌కి డేట్, టైం ఫిక్స్!

మన టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ హీరోయిన్స్ గా దర్శకుడు వేణు శ్రీరామ్ తెరకెక్కించిన అవైటెడ్ చిత్రమే "తమ్ముడు". అయితే ఈ చిత్రం ట్రైలర్ సహా పాటలు మంచి ఆదరణ అందుకోగా ఈ జూలై మొదటి వారంలో రిలీజ్ కి రాబోతుంది. అయితే ఈ చిత్రం నుంచి మరో ట్రైలర్ ట్రీట్ ఇచ్చేందుకు సిద్ధం అయ్యింది. మరి రేపు జూన్ 30 న సాయంత్రం రిలీజ్ ట్రైలర్ ని రిలీజ్ చేస్తున్నట్టుగా ఇప్పుడు కన్ఫర్మ్ చేసారు. వైబ్ ఆఫ్ తమ్ముడు అంటూ ఈ ట్రైలర్ ని రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మరి ఈ ట్రైలర్ తర్వాత ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా దిల్ రాజును- శిరీష్ లు నిర్మాణం వహించారు. అలాగే ఈ జూలై 4న గ్రాండ్ గా రిలీజ్ కి తీసుకొస్తున్నారు.



'తమ్ముడు'

# 'తలైవాన్.. తలైవీ' సినిమా బిగ్ అప్డేట్ ఇచ్చిన నిత్యామీనన్

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి ఆడియన్స్‌ను ఆకట్టుకున్నారు. అంతేకాకుండా తన నటనతో స్పెషల్ ఫ్యాన్స్‌ను క్రియేట్ చేసుకున్నాడు. ప్రస్తుతం విజయ్ సేతుపతి తెలుగులో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నారు. దీంతోపాటు విజయ్ సేతుపతి, పాండిరాజ్ కాంబోలో 'తలైవాన్.. తలైవీ' మూవీ రాబోతుంది. అయితే ఇందులో నిత్యామీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే మొదటి సారి విజయ్, నిత్యా కాంబోలో రాబోతుండడంతో వీరి కెమిస్ట్రీ చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రగ్గడ్ లవ్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి, త్యాగరాజన్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా, చిత్రబృందం ఈ మూవీకి సంబంధించిన టీజర్ విడుదల చేస్తూ రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. మీ కాలెండర్‌లో మార్క్ చేసుకోండి.. తలైవాన్.. తలైవీ జూలై 25న థియేటర్స్‌లో విడుదల కాబోతున్నట్లు నిత్యామీనన్ ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. ఇక టీజర్‌లో వెల్‌కమ్ టూ రాఘవర్తిని అని విజయ్ సేతుపతి వంటలు చేస్తూ కనిపిస్తాడు. దానిని నిత్యామీనన్ టేస్ట్ చేసి రుచి గురించి భర్తకు చెబుతుంది. ఇక ఈ జంట ఎంతోమంది కస్టమర్స్ వచ్చి లొట్టలేసుకుంటూ ఆహారాన్ని తింటుంటారు. విజయ్ సేతుపతి, నిత్యామీనన్ పెళ్లి లాభాల బాట పట్టినట్లు చూపించారు. ప్రస్తుతం ఈ టీజర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.



# వెకేషన్‌లో సూర్య-జ్యోతిక..



సినిమాల నుంచి ఏమాత్రం విరామం దొరికినా ఫ్యామిలీతో సమయం గడపటానికి ఇష్టపడుతుంటారు నటుడు సూర్య. తాజాగా ఆయన తన సతీమణి, నటి జ్యోతికతో కలిసి వెకేషన్‌కు వెళ్లారు. తుర్కు ఆఫ్రికాలోని సీషెల్స్‌కు ఈ జంట విహార యాత్రకు వెళ్లింది. సముద్రం, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ వీరిద్దరూ సేదతీరారు. దీనికి సంబంధించిన ఒక స్పెషల్ వీడియోను జ్యోతిక ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. 'స్వర్గంలో మరో రోజు మనిద్దరం' అని ఆమె క్యాప్షన్ జత చేశారు. ఈ వీడియో వైరల్‌గా మారింది. కెరీర్ పరంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్నారు నటుడు సూర్య. 'కంగువా', 'రెట్రో' మిశ్రమ స్పందనలకే పరిమితం కావడంతో.. ప్రస్తుతం ఆయన దృష్టి కొత్త ప్రాజెక్టుల పైనే ఉంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్య దేవర నాగవంశీ దీనిని నిర్మిస్తున్నారు. మమితా బైజు కథానాయిక. ఇది పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రం అని.. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయని దర్శకుడు అన్నారు. 'గజిని'లో సంజయ్ రామస్వామి పాత్రకు సంబంధించిన షేడ్స్ ఈసినిమాలో హీరో పాత్రకు ఉంటాయని తెలిపారు. దీనితోపాటు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో 'కరుప్పు'లో సూర్య నటిస్తున్నారు.

# 28 రోజుల్లోనే 'ఉప్పు కప్పురంబు' షూటింగ్ పూర్తయింది: కీర్తిసురేష్, సుహాస్

కీర్తిసురేశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. నటుడు సుహాస్ కీలక పాత్ర పోషించారు. సెటైరికల్ కామెడీ డ్రామాగా ఐవీ శశి రూపొందిస్తున్నారు. రాధికా లాల్ నిర్మిస్తున్నారు. వసంత్ మురళీకృష్ణ మరింగంటి కథని అందించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదిక జులై 4 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా యాంకర్ సుమ చాట్ షోలో కీర్తిసురేశ్, సుహాస్ పాల్గొని ముచ్చటించారు. కేవలం 28 రోజుల్లోనే షూటింగ్ పూర్తయినట్లు చెప్పారు. ఆ ఆసక్తికర విషయాలు మీకోసం..

# ఇల్లిల్లు తిరుగుతూ ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్న రాజగోపాల్ రెడ్డి
అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో రాజకీయాలు లేవు
కాయ కష్టం చేసుకుంటూ గుడిసెలో జీవిస్తున్న నిరుపేద రాములుకు అభయం
గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



మర్రిగూడ, జూన్ 29(మనం న్యూస్): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకోవడానికి ఉదయాన్నే మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గ్రామాలలో పర్యటిస్తున్నారు.మునుగోడు నియోజకవర్గం లోని నూతనంగా ఏర్పడ్డ గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో అన్ని వీధులు కలియతిరిగారు.ఇప్పటికే మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.మొదటి జాబితాలో ఇందిరమ్మ ఇల్లులు రాని అర్హులైన నిరుపేదలకు రెండవ జాబితాలో ఇల్లు ఇప్పించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు.కాయ కష్టం చేసుకుంటూ గుడిసెలో జీవిస్తున్న రాములు ఇంటికి వెళ్లి పరిశీలించారు. రాములు కు ఇల్లు కట్టిస్తానని మాటిచ్చారు.ప్రభుత్వం తరపున ఇచ్చే ఐదు లక్షలతో పాటు ఇల్లు పూర్తి అవ్వడానికి మిగిలిన ఆర్థిక సాయం చేసి ఇంటిని నిలబెడతానని అన్నారు. వీధుల గుండా తిరుగుతున్న సందర్భంలో కరెంటు లూజు లైన్స్, గృహాల మీదుగా వెళ్తున్న 11 కేవి కరెంటు లైన్ లను వెంటనే తొలగించాలని విద్యుత్ ఏఈ ని ఆదేశించారు. అంతంపేట నుండి దేవు లతండా, రాజ్యతండా కు కొత్తగా నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించారు. అంతంపేట నుండి నామాపురం గ్రామానికి వెళ్లే రోడ్డును పరిశీలించారు.అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో రాజకీయాలకు పార్టీలకు తావు లేదన్నారు. జనంలో ఏ సమస్య ఉన్న పరిష్కరించే బాధ్యత ప్రజాప్రతినిధులకు ఉంటుందని, నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేసే వాళ్లే సర్పంచులుగా ఎంపీటీసీలుగా పోటీ చేయాలని, ప్రజలు కూడా అటువంటి వాళ్ళని గెలిపించుకోవాలని సూచించారు. కొడుకుల బాగు కోసం తనకున్న ఎకరం పొలాన్ని అమ్మి ఇచ్చి ఏమీ లేకుండా ఉన్న స్థితిలో తన కొడుకులు చూసుకుంటలేరన్న సోమలింగమ్మ ఆవేదన ను గడపలో కూర్చుని సావధానంగా విన్నారు. రాజ్ గోపాల్ రెడ్డి వెంటనే కొడుకుకు ఫోన్ చేసి మీ అమ్మని బాగా చూసుకోవాలన్నారు.కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డితో పాటు గట్టుపల్ మండల అధికారులు, గట్టుప్పల్ మండలం ముఖ్య నాయకులు, అంతంపేట గ్రామ ముఖ్య నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



# రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిమీద ఉంది

- పర్యావరణ పరిరక్షణ సేవా సమితి పాశం నరేష్ రెడ్డి

నల్గొండ, జూన్ 29( మనం న్యూస్): ప్రపంచ రాజ్యాంగాల కెల్లా అత్యంత గొప్ప రాజ్యాంగం భారత రాజ్యాంగా మనీ , అది నేడు ప్రమాదంలో పడిందని అట్టి రాజ్యాంగాన్ని కాపాడు కోకపోతే భవిష్యత్తు తరాలు బానిసలుగా బతకాల్సిన రోజు దాపురించిందని న్యాయవాది, ప్రజాస్వామ్య పరిరక్షణ సేవా సమితి కన్వీనర్ పాశం నరేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రజాస్వామ్య పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో నల్లగొండలోని అంబేద్కర్ ఆడిటోరియం లో నిర్వహించిన రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనే రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడారు. తిప్పర్తి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గాదె లింగస్వామి మాట్లాడుతూ మత ప్రమేయం లేని, కుల, మత, ప్రాంత లకతీతంగా ప్రాణం ఉన్న ప్రతి ఒక్క జీవి స్వేచ్ఛగా జీవించే హక్కు లు రాజ్యాంగంలో కల్పించబడ్డాయని అవి రోజు రోజుకు హరించబడుతున్నాయని ఆయన అన్నారు. వంటే పాక యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రాజ్యాంగం రద్దుచేసి దాని స్థానంలో సనాతన ధర్మం అంటూ మనిషిని మనిషిగా చూడని మనుధర్మాన్ని అమల్లోకి తెచ్చే కుట్ర జరుగుతుందని ఆయన అన్నారు. అన్ని మత గ్రంధాల కెల్లా రాజ్యాంగమే గొప్పదని అది సంపూర్ణంగా అమలు కావడం లేదని మేధావులు ప్రజాస్వామ్యవాదులు రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ముందు వరుసలో నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్ జిల్లా అధ్యక్షులు కత్తుల జగన్ కుమార్, బహుజన కమ్యూనిస్టు రాష్ట్ర నాయకులు కే పర్వతాలు, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి కుదుబుద్దీన్, తెలంగాణ విద్యావంతుల వేదిక పందుల సైదులు, బీసీ మహిళా నాయకురాలు కొండ లలితక్క, సమాజ్వాది పార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి రఫీ, డిటిఎఫ్ నాయకులు పి పెంకులు, షరీఫుద్దీన్ ఎస్.కె చాంద్ పాషా పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయురాలు గవ్వల శైలజ పదవి విరమణ



నల్గొండ, జూన్ 29( మనం న్యూస్): నల్గొండ మండలం అప్పాజీపేట హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన గవ్వల శైలజ పదవి విరమణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘం నాయకులు వివిధ శాఖల ఉద్యోగులు స్నేహితులు బంధువులు రవీందర్ శైలజ దంపతులను పూలమాలలతో సాల్వలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయురారోగ్యాలతో ఉంటూ సామాజిక కార్యక్రమాలు చేపడుతూ కుటుంబ సభ్యులతో శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమేనని ఉద్యోగరీత్యా చేసిన సేవలు స్థిర కాలంగా నిలిచి ఉంటాయని ప్రతి ఉద్యోగి విధినిర్వహణలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గవ్వల లిఖిల్ తేజ, మౌనిక, బాల వీరాంజనేయులు,, నరేష్,గవ్వల శ్రీనివాస్, భాగ్యమ్మ,రేణుక, రామచంద్రమ్మ,డాక్టర్ ఇమ్మానియేల్,డాక్టర్ రోహిత్ నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డి తో పాటు టిఆర్ఎస్ నాయకులు రావుల శ్రీనివాస్ రెడ్డి,ఉద్యోగులు బంధువులు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి




నల్లగొండ, జూన్ 29 (మనం న్యూస్): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి అన్నారు. టీఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ అధ్యక్షులు బక్కా శ్రీనివాస చారి అధ్యక్షతన సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యం.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగం పటిష్ట పరచడంలో టియస్ యుటిఎఫ్ సంఘ సభ్యులు ముందు ఉండాలని, టీఎస్ యుటిఎఫ్ సంఘ ఉపాధ్యాయులు పనిచేసే ఆయా ప్రాంతాలలో పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలో స్టడీ అవర్ నిర్వహణకు అదనపు సమయం కేటాయించాలని కోరారు. ఈవిద్య సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు సకాలంలో అందించి నందుకు, ఈసారి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా నోటు పుస్తకాలు అందించినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థుల అవసరమేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని అలా కాకుండా జిల్లా కేంద్రానికి, హైవే లకు దగ్గర్లో గల ప్రాంతాలకు ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం డిప్యుటేషన్లు చేయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీరు మారకపోతే ప్రత్యక్ష చర్యలకు దిగుతామని హెచ్చరించారు. పిఆర్సి గడువు తీరినందున పిఆర్సి రిపోర్టు వెంటనే తెప్పించుకొని అమలు పరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరో రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి గారు మాట్లాడుతూ జూలై చివరి నాటికి సంఘ సభ్యత్వం పూర్తి చేయాలని జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం ఉపాధ్యక్షులు నర్రా శేఖర్ రెడ్డి, బి. అరుణ కోశాధికారి వడిత్య రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, గేర నరసింహ, యాట మధుసూదన్ రెడ్డి, రమాదేవి, నలపరాజు వెంకన్న, చిన వెంకన్న, పగిళ్ల సైదులు, కొమ్రరాజు సైదులు, ఆడిట్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, నర్సింహ్మా మూర్తి, భాను ప్రకాష్, గిరి యాదగిరి, యరనాగుల సైదులు, శ్రీలత మరియు వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



# మొహాల నోబిస్‌కు ఘన నివాళి

సూర్యాపేట జూన్ 29 (మనం ప్రతినిధి) పి. సి. మెహలోనోబిస్ 132వ జయంతి సందర్భంగా 19వ జాతీయ అర్థ గణాంక దినోత్సవ వేడుకలు ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్. కిషన్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నంద్ లాల్ పవార్, ఐ. ఏ.ఎస్., పాల్గొని మెహలోనిబిస్ చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ..... పి. సి. మెహలనోబిస్ గారు అనువర్తిత గణాంకశాస్త్రవేత్త అని, భారత ప్రణాళిక పథానికి నిర్దేశకుడిగా మరియు భారతదేశ మొదటి ప్లానింగ్ కమీషన్లో సభ్యుడగా పానిచేశారని ఆదేవిదంగా గణాంక అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్షేత్రస్తాయిలో ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని, ఎప్పటికపుడు నూతన సాంకేతిక పద్దతులను నేర్చుకుంటూ, వేగంగా సమాచారాన్ని ఉన్నత అధికారులకు అంధించాలని, మండల స్థాయిలో సామాజిక, ఆర్థిక అంశాలపై విశ్లేషణ చేయాలని, భవిష్యత్ ప్రణాళికలు తయారుచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి రామచంద్ర రావు, డివిజన్ పంచాయత్ అధికారి నారాయణ రెడ్డి గణాంక అధికారి పి. రమేష్, రిటైర్డ్ సి. పి.వో ఎస్.సి.ఎస్.రాజు, ఉపగణాంక అధికారులు రాజేష్, కోటేశ్వర రావు, రామారావు, లోక్య, విజయ కుమార్, టీఎన్. జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, రిటైర్డ్ ఎస్.వో సీతారాములు, మరియు మండల ప్రణాళిక గణాంక అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ కేటీఆర్ వ్యక్తిత్వాన్ని కించపరిస్తే ఊరుకోం

- మీడియా ముసుగులో కాంగ్రెస్ నాటకాలు
- మమ్మల్ని ఇబ్బంది పెడితే ఎవరిని వదలం
- మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి ధ్వజం




సూర్యాపేట, జూన్ 29 (మనం ప్రతినిధి): కేసీఆర్ , కేటీఆర్ ల పై మీడియా ముసుగులో ప్రభుత్వ అసత్య ప్రచారాలు చేస్తు వ్యక్తిత్వాలను కించపరిచేలా ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంట కండ్ల జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మీడియా ముసుగులో కొంతమంది స్లాటర్ హౌస్ లు నడుపుతున్నారని అవి మీడియా హౌస్ కాదు స్లాటర్ హౌస్ లుగా మారాయని విమర్శించారు.కేసీఆర్ , కేటీఆర్ వ్యక్తిత్వాలను హననం చేసే దాడులుజరుగుతున్నాయి.మీడియా ముసుగులో దాడి చేస్తే కేసీఆర్ అభిమానులు చూస్తూ ఉండరని దాడులకు మేము ప్రతి దాడులు చేస్తే తట్టుకోలేరని స్పష్టం చేశారు. సంవత్సరన్నరగా మీడియాని అడ్డం పెట్టి కెసిఆర్ పై కుట్రలు చేస్తూన్నరు..మమ్మల్ని ఇబ్బందిపెట్టే వారిని ఎవ్వరిని వదిలి పెట్టేది లేదని విమర్శన అస్త్రాలు గుప్పించారు.చంద్రబాబు , రేవంత్ లను చూసి మురుస్తున్న వారిని భవిష్యత్తులో ఎవ్వరూ కాపాడలేనని పథకం ప్రకారమే బీఆర్ఎస్ పై దుర్మార్గానికి తెర లేపుతూ ఇలాంటి సంఘటనకు ఆద్యం పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మీడియా కేంద్రాల ముసుగులో కబేళాలు (స్లాటర్ హౌస్‌లు) నడుస్తున్న పరిస్థితి దాపురించిందని తెలిపారు. తెలంగాణాను ఆంధ్ర నుండి విడదీశారనే అక్కసుతోనే కేసీఆర్ పై కుతంత్రాలు..మా పిటిషన్ల పై పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించి మాపైనే తప్పుడు కేసులు పెడుతున్నారు ఇక ప్రజా కోర్టులో శత్రువులకు శిక్షలు తప్పవు అని అన్నారు.రాజకీయ పార్టీలుగా మేము మేము తేల్చుకుంటాం.. మీడియా అసత్య ప్రచారాలెందుకు ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ పైనా మీ ప్రేలాపనలు పెడితే ఎలా ఉద్యమం నుంచి వచ్చినోళ్లం కేసులకు భయపడతామా మరో మారు హెచ్చరించారు.మహా న్యూస్ పై దాడి చేశారని ముసలి కన్నీరు కారుస్తున్నారు.. కేసీఆర్, కేటీఆర్ పై అక్కసుతో.. అదేపనిగా పెట్టుకొని దాడులు చేస్తున్నారు. నిజంగా మీ చేతులో ఆయుధాలతో దాడులు చేయాలనుకుంటే కేసీఆర్ అభిమానులు లక్షలాదిమంది చూస్తూ కూర్చోరు అని బదులు ఇచ్చారు.వాళ్ల చేతిలోని ఆయుధాలకు వాళ్లు కూడా పని చెప్తారు..నిన్న జరిగింది దాడి కాదు.. నిరసన మాత్రమే,..కానీ మేము మొదలు పెట్టమని అనుకోకండి.. మా సహనానికి పరీక్ష పెట్టవద్దు. మీడియా ముసుగులో మీ ఇష్టం వచ్చిన బూతులు మాట్లాడితే ఎవడు ఊరుకుంటారా. మీడియా ముసుగులో దాచుకోవాలని అనుకుంటున్నారేమో.. బిన్ లాడెన్ లాగా ఎక్కడ దాక్కొన్నా పట్టుకొని మీపని చెప్తామన్నారు.ంవత్సర కాలంగా మీ చెంచా గాళ్లు ప్రభుత్వాన్ని పాలిస్తున్నారు.. వాళ్ళను అడ్డం పెట్టుకుని నడుపుతున్న స్లాటర్ హౌసులను వదిలిపెట్టం మా దాడి వేరే విధంగా ఉంటుందని తెలియజేశారు. కెసిఆర్ ది మొదటినుంచి గొప్ప క్షమాగుణం ఆయన క్షమించినా.. మేము క్షమించం భేషరతుగా మహా న్యూస్ యాజమాన్యం కెసిఆర్, కేటీఆర్ లకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలన అన్ని రంగాల్లో విఫలమైంది. సాగునీళ్ల విషయంలో ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి అజ్ఞానులు మంత్రులకు పాలన చేతకాక ప్రతిరోజు కెసిఆర్ ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. సూర్యాపేట జిల్లాలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయి వేసిన విత్తనాలు ఎండిపోతున్నాయి రైతాంగం అప్పులపాలైతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తమ్ మాటలు చూస్తే నీళ్లు తెచ్చే పరిస్థితి లేదు. ఏ రాష్ట్రం కూడా ఎన్ డి ఎస్ ఏ అనుమతుల కోసం ఎదురు చూడదు. రాజకీయ డ్రామాలు ఆపి వెంటనే కన్నేపల్లి పంపులు ఆన్ చేసి రైతులకు నీళ్లు అందించాలని హితువు పలికారు. రైతులను గోస పెట్టి.. మేము మాత్రం సుఖపడుతామంటే ఊరుకోం..ఇకనైనా కెసిఆర్ పై ఏడుపు ఆపి అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎంపీ బడుగు లింగ యాదవ్. నాయకులు నిమ్మల శ్రీనివాస్ పుట్ట కిషోర్ కటికం శ్రీనివాస్ అనిల్ రెడ్డి బొడ్డు సోమరాజు. బత్తుల రమేష్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు



- విద్యార్థులకు ఆరోగ్య సూచనలు సలహాలు అందించిన డాక్టర్ స్రవంతి

పెన్ పహాడ్, జూన్ 29 (మనం న్యూస్): మండల పరిధిలోని దోసపహడ్ గ్రామానికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు మామిడి వెంకటయ్య ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ స్రవంతి వైద్యశాల మండల ప్రజలకు అందిస్తున్న సేవలు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు తెలియజేశారు అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు పిల్లలకు టీకాలు ఇవ్వడం వ్యాధిగ్రస్తులకు ఔషధాలు ఇవ్వడం వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించడం కాలానుగుణంగా అనారోగ్యపరంగా వచ్చు వ్యాధుల గురించి వాటి నుండి రక్షణ ఎలా తీసుకోవాలో విద్యార్థులకు సలహాలు సూచనలు అందించారు వర్షాకాలంలో కాచి వడగట్టిన నీటిని మాత్రమే సేవించాలని ఆరోగ్యపరంగా జాగ్రత్తలు వహించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది,ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షునిగా బి సంపత్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా చందోలు నాగబాబు
- కమిటీని అభినందించిన ఎస్ ఈ నాగేశ్వరరావు



నల్లగొండ, జూన్ 28 ( మనం న్యూస్ ): నల్లగొండ సర్కిల్ ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్, (టి ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఏ) నూతన కమిటీని పానగల్ ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బి సంపత్ కుమార్, ఉపాధ్యక్షులుగా బి సిద్ధార్థ, కె నగేష్, ప్రధాన కార్యదర్శిగా చందోలు నాగబాబు, జాయింట్ సెక్రటరీగా బి మణిదీప్,జాన్ ఫ్రైడ్,ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి నగేష్, నేటి మౌనిక,ట్రెజరర్ గా మహమ్మద్ షఫీ,టెక్నికల్ సెక్రటరీగా శ్రీ ప్రదీప్ రెడ్డి, సిహెచ్ చందనాలను ఎన్నుకున్నారు.నూతన కమిటీని ఎస్సీ నాగేశ్వరరావు అభినందించారు.ఈ సందర్భంగా ఎస్ ఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన కమిటీ ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్,ఈ ఈ లు వంశీకృష్ణ, యాదయ్య, అరుణారెడ్డి, శాంతకుమారి, శ్రీనివాస్, డిప్యూటీ ఇంజనీర్ ఎండి ముజుబుద్దీన్, ఏ నరసింహ, కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ కమిటీకి సహకరించిన సభ్యులకు ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# బునాదిగాని కాల్వను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలి

- ఈ ఖరీఫ్ పంటకు సాగునీరు అందించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్..



వలిగొండ, జూన్ 29 (మనం న్యూస్): బునాదిగాని కాల్వను యుద్ధ ప్రతిపాదికాన పూర్తి చేసి ఈ ఖరీఫ్ పంటకు సాగునీరు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజున భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వలిగొండ మండల 14వ మహాసభ నర్సాపురం గ్రామంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఎలగందుల అంజయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆవిష్కరించారు. ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు గీత పనివారాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ బొమ్మగాని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచి వేతలున్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ అరులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్ లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐకు ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన అన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, బండి జంగమ్మ, ఎండీ ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్క దయాకర్ రెడ్డి, మరుపాక వెంకటేష్, సలిగంజి వీరస్వామి, ఎల్లంకి మహేష్ నాయకులు బాలగోని సత్యనారాయణ, పులిపల్పుల మల్లేశం, సల్వాద్రి రవీందర్, బోడిగే సుదర్శన్, అంబటి అంజయ్య, మారోజు నరసింహ చారి, సుద్దాల సాయికుమార్, నార్కెట్పల్లి మచ్చగిరి, కట్ల యాదగిరి, మేడి దేవేందర్, పోశబోయిన బొందయ్య, చేగురి పాపయ్య, సాలిగంజి కృష్ణ కుమార్, బోడ సునీత, రేణుక, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభ చర్చించి ఈ కింది తీర్మారాలను ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. 1.వలిగొండ మండలంలో ఉన్నటువంటి సాగునీటి కాలువలు, భీమలింగం కాలువలను పూర్తి చేసి రైతులకు సాగనిరు అందించాలి 2. భీమలింగం కాల్వను వెల్వర్తి నుండి 5 మీటర్ల వెడల్పుతో చివరి ఆయకట్టు ఆయన దుపెల్లి ఎల్లమ్మ చెరువు వరకు పొడిగించి పూర్తి చేయాలి 3. వలిగొండ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి 4. విద్యుత్ ట్రాన్స్ ఫారా రిపేరు సెంటర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి. 5. మునినది ప్రక్షాళన చేసి వ్యవసాయా రంగానికి స్వచ్ఛమైన నీరు అందించాలి. 6. ఉపాధి హామీ కార్మికులకు పెండింగ్లో ఉన్న బాకాయిలను వెంటనే విడుదల చేసి పని దినాలను పెంచాలి 7. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలని అన్నారు.

## వరుణుడి కోసం రైతులు గ్రామ దేవతలకు పూజలు



**రఘునాథపల్లి,జూన్ 29 (మనం న్యూస్):** మండలంలోని పలు గ్రామాలలో వర్షాల కోసం మహిళలు, రైతులు అదివారం గ్రామ దేవతలకు నీళ్ళు పోసి వరుణుడు కరుణించాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసి, వర్షాలు కురవాలని దేవతలను మొక్కుకున్నారు. వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయని వరుణ దేవుడు కరుణించాలని వారు కోరారు.ఈ పూజల్లో ఆయా గ్రామాల రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు



**సుల్తానాబాద్ జూన్ 29 (మనం న్యూస్):** సుల్తానాబాద్ కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అదనపు జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ను ప్రభుత్వం మంజూరి చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య; 43, తేదీ: 27.06.2025 ద్వారా సుల్తానాబాద్ కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తూ ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తానాబాద్ కు అదనపు కోర్టు మంజూరీ చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు లకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, ఏజీపీ దూడం ఆంజనేయులు, న్యాయవాదులు గూడెపు దివాకర్ రావు, పబ్బతి లక్ష్మి కాంత రెడ్డి, ఆవుల లక్ష్మీరాజం, మాడూరి ఆంజనేయులు, ఆలూరి శ్రీనివాసరావు, భూసారపు బాల కిషన్ ప్రసాద్, ఆకారపు సరోత్తం రెడ్డి, పడాల శ్రీరాములు, వొడ్నాల రవీందర్ తో పాటు పలువురు సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మరణం

- డిక్కీ జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్
- అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు భవిష్యత్ తర తరాలు స్ఫూర్తి
- అదనపు కలెక్టర్ బి ఎస్ లత



**జగిత్యాల జూన్ 29 : ( మనం ప్రతినిధి):** ప్రతి ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మరణ అద్వితీయం అని డిక్కీ జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రతి ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మరణ కార్యక్రమా న్నీ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ డిక్కీ జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ సామాజిక సంస్కరణలో అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు భవిష్యత్ తర తరాలకు స్ఫూర్తి దాయకం అని అన్నారు. అంబేద్కర్ అంటే ప్రపంచ మేధావుల్లో మేటి, రాజ్యాంగ రూప శిల్పి, ప్రతినిత్యం అంబేద్కర్ ను స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు. దేశానికి డా. బాబా సాహెబ్ భీమ్ రావు అంబేద్కర్ అందించిన అమూల్యమైన సేవలు, సమానత్వం లాంటి ఎన్నో అంశాలు బావి తరాలకు యువతకు మార్గదర్శాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాకు అవకాశం రావడం అభినందనీయం అని అన్నారు. జీవితంలో చేసిన త్యాగాలు, రచనలపై సంక్షిప్త సందేశం ఇవ్వటం, వారి వారసత్వ గౌరవ వందనంగా ఒక్క నిమిషం మౌనం పాటించటం కార్యాచరణతో ముఖ్యమైనధీ అని అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో రాజకీయా ,కులమతాలకు ఆతీతంగా ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమం అభినందనీయమైనది అని కొనియాడారు. అనంతరం జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ డాక్టర్ భీమ్రావ్ రామ్జీ అంబేద్కర్, ప్రఖ్యాత భారతీయ న్యాయవేత్త, ఆర్థికవేత్త, సామాజిక సంస్కర్త , రాజకీయవేత్త. భారతదేశ రాజ్యాంగాన్ని రూపొందించిన కమిటీకి అధ్యక్షత వహించడం దేశానికి మొట్టమొదటి న్యాయ మరియు న్యాయ మంత్రిగా పనిచేసినందుకు ఆయన బాగా ప్రసిద్ధి చెందారని అని అన్నారు. అదేవిధంగా దళిత విద్యార్థులకు ఆర్థికంగా సహకరించాలని భవిష్యత్ తరాలకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చిన మేధావి అని కొనియాడారు . అనంతరం బి ఎస్ లత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పొందిన తరుణంలో పుష్పగుచ్ఛమ్ తో కార్యక్రమ నిర్వాహకులు నల్ల శ్యామ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమలో మద్దెల నారాయణ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు, నకుమాళ్ళ లక్ష్మీనారాయణ, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు చిత్తారి ప్రభాకర్ , మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు నక్క విజయ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి గిద్దే శంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాల మహానాడు ఆఫ్ ఇండియా తెలంగాణ శక్తి ఎడిటర్ అనంతుల కాంతారావు , మట్టి పూలు తక్కల్ల దేవయ్య,ఎడిటర్ దాసరి లచ్చయ్య, మాజీ సర్పంచ్ పల్లె రమేష్, ఉపాధ్యక్షులు తెలంగాణ మాల మహానాడు ఆఫ్ ఇండియా పల్లె రవి, దసండ్ల కమలాకర్ కండ్లే లక్ష్మణ్ బత్తుల ప్రదీప్ ముద్దామల్ల గంగాధర్ సుంకరిపెల్లి అశోక్ పోనగంటి రాజయ్య తూము వెంకటేష్ బొల్లం ప్రభాకర్ ఆకోజు శ్రీధర్ దాసరి ప్రదీప్ నల్ల సురేష్ డి జె లక్ష్మీ నారాయణ బొంకంటి రవి సమల్ల నరేష్ జవ్వాజి శంకరయ్య చెనల్ల సుమన తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో సింగరేణి బీసీ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడే విధంగా కమిటి సభ్యులు కృషి చేయాలి



- సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

**మంచిర్యాల,29,జూన్ , ( మనం న్యూస్):** భవిష్యత్తులో సింగరేణి బీసీ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడే విధంగా కమిటి సభ్యుల తో పాటు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు.శ్రీరాంపూర్ ఏరియా ఎస్ ఆర్ పి - 3 అండ్ 3ఏ గని వద్ద సింగరేణి కాలరీస్ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా డిపార్ట్మెంటల్ పూర్తిస్థాయి పిట్ కమిటీని ఏరియా బ్రాంచ్ సెక్రటరీలు బి.మారుతి, బద్రి బుచ్చయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు, వారికి అందరు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.కమిటీ లో బాధ్యుగా ఎన్నికైనా వారు క్రమశిక్షణతో ఉంటూ అందరిని కలుపుకుపోతూ , బీసీ ఉద్యోగుల హక్కులను కాపాడుతూ, ముందుకు వెళ్ళాలని అన్నారు . పిట్ కమిటీ ఎంపికైన సభ్యుల్లో చీఫ్ అడ్వైసర్ గా మధుసూదన్ (సీనియర్ అండర్ మేనేజర్), అడ్వైసర్లుగా రమేష్ (సీనియర్ అండర్ మేనేజర్), పిట్ సెక్రటరీ గా కారుకూరి మనోజ్ (జనరల్ అసిస్టెంట్), అసిస్టెంట్ పిట్ సెక్రటరీగా కడసు భీమన్న (ఎం వి డ్రైవర్), జాయింట్ సెక్రటరీలు గా డి.వీరమల్లు ( సపోర్ట్ మాన్), టి. మల్లేష్ ( సపోర్ట్ మాన్), ఎ. రవి ( కోల్ కట్టర్), ఆర్గనైజింగ్ సెక్రెటరీ లుగా అల్లం సతీష్ ( హాలర్ ఆపరేటర్), ఎం. అనిరుద్ (జనరల్ అసిస్టెంట్), ట్రెజరర్ గా సాయి ప్రకాష్ సంఘ (జనరల్ అసిస్టెంట్) లను ఎన్నుకున్నారు . రిలే ఇన్చార్జులుగజ్ ఏ- షిఫ్ట్ కు ప్రతాప్ గౌడ్ ( హాలర్ ఆపరేటర్), సంతోష్ కొట్టే (జనరల్ అసిస్టెంట్), బి- షిఫ్ట్ కు గొర్రె కార్తీక్ ( కోల్ కట్టర్), అడెపు సురేష్ ( లైన్మెన్ ), సి- షిఫ్ట్ కు శ్రీనివాస్ యాదవ్ (హాలర్ ఆపరేటర్), శ్రీనివాస్. యు (జనరల్ అసిస్టెంట్), డి- షిఫ్ట్ కు ఆకుల విలాస్ (సీనియర్ మైనింగ్ సర్దార్ ), శివ (జనరల్ అసిస్టెంట్), ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా స్రవంతి (బదిలీ వర్కర్), నరేష్ (కోల్ కట్టర్), సారయ్య (హాలర్ ఆపరేటర్), వేణు అప్పని (జనరల్ అసిస్టెంట్), సుక్కరాజు (హాలర్ ఆపరేటర్), సుభాష్ (జనరల్ అసిస్టెంట్), చిరంజీవి (సర్వే మజ్దూర్ ) అసిటెంట్ బ్రాంచ్ సెక్రటరీ గా రాచర్ల చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా గోళ్ల మహేందర్ లను ఎన్నుకున్నారు.

ఈ కమిటీ సింగరేణిలో బీసీ ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడేందుకు కట్టుబడి ఉందని, ముఖ్యంగా ప్రమోషన్ విధానం, రిజర్వేషన్ల అమలు, ఉద్యోగ సురక్షితత్వం తదితర అంశాలలో ఎటువంటి అనుమానాలు లేకుండా ఉండాలని అన్నారు .



## స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

- మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**రాయపర్తి, జూన్ 29(మనం న్యూస్):** అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించాలని మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజీడీ గజేందర్ రెడ్డి, యువజన నాయకులు ఐత ప్రవీణ్, పాడిచర్ల రాకేష్,మైలారం గ్రామానికి చెందిన మండల మాజీ ఎంపీపీ గుగులోత్ విజయ కాంగ్రెస్ పార్టీ నీ వీడి మాజీ మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర అసంతృప్తితో కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ లో చేరారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాల హామీలతో గద్దెనెక్కొదని అన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని ఓడించాలని అన్నారు.కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోసా పడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సింహా నాయక్,మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్,ఫౌండేషన్ ప్రతినిధి లేతకుల రంగా రెడ్డి,మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్,లేతకుల మధుకర్ రెడ్డి,కుక్కల భాస్కర్, బెల్లి పెద్దాపురం, చందు నాయక్, ఉళ్లేంగుల సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి



- పరుపాటి శ్రీనివాస్

**రాయపర్తి, జూన్ 29(మనం న్యూస్):** మండలంలోని జగన్నాథ పల్లి, ఊకల్ గ్రామాలలో పలు యూత్ సంఘ సభ్యులకు ఆదివారం క్రికెట్ కిట్లను ఎస్ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరిపాటి శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించి, కీర్తిని చాటాలని అన్నారు. అనంతరం సూర్య తండా, ఏకే తండా గ్రామాలలో తండా బాట కార్యక్రమాన్ని నిర్వహించి పలు బాది త కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మునవత్ నరసింహ, మాజీ ఎంపీపీ జి నుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతకుల రంగా రెడ్డి,మండల పార్టీ ముఖ్య నాయకులు బద్దం వేణుగోపాల్ రెడ్డి, లేతకుల మధుకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్,పార్టీ ముఖ్య నాయకులు భాషబోయిన సుధాకర్, కుందూరు యాదగిరి రెడ్డి, పెరటి యాదవ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్, గబ్బేట యాకయ్య, సంకినేని ఎల్లస్వామి, చందు రామ్, చందు సతీష్, చిలువేరు సాయి గౌడ్, ఉబ్బని సింహాద్రి, పెద్దగోని జీవన్, గు ఐత రవి, చందు లక్ష్మన్, ఉబ్బని మధు, ఐత జంపి, పిరని రాజు, గారే నరేష్,స్థానిక నాయకులు దికొండ సంతోష్, కందుకూరి సమ్మయ్య, అడ్లూరి కుమార్ ,పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలు చేయాలి

- మంచిర్యాల బీసీ చైతన్య సదస్సులో బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ చిరంజీవులు



**మంచిర్యాల,29,జూన్ , ( మనం న్యూస్):** బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లుని రాష్ట్ర ప్రభుత్వం సత్వరం అమలు చేయాలని తెలంగాణ బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ రిటైర్డు ఐఏఎస్ చిరంజీవులు కోరారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయబడిన బీసీ చైతన్య సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లడారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన 30 రోజుల వ్యవధిలో ఆ పని ముగించాలని ఆయన కోరారు. రాజ్యాంగపు 9వ షెడ్యూలు రక్షణ లేకపోతే బీసీ రిజర్వేషన్ బిల్లు నిలబడదని ఆయన తెలిపారు. అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ బిల్లుని రాజ్యాంగపు 9వ షెడ్యూల్లో చేర్చి రక్షణ కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని ఆయన తెలిపారు. అగ్రవర్ణాల కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చినప్పుడు ఆగమేఘాల మీద పనులన్నీ చక్కబెట్టిన కేంద్ర ప్రభుత్వం.. అదే రీతిలో బీసీ బిల్లుకి రక్షణ కల్పించాలని డిమాండు నెరవేర్చాలని కోరారు. జాతీయ స్థాయిలో కులగణనను కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా పూర్తి చేయాలని కోరారు. జాతీయస్థాయి కుల గణన ఫలితాల వెలుగులో 50 శాతం రిజర్వేషన్ సీలింగును రద్దు చేయించడానికి బీసీ బిడ్డలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో బీసీ బడి నిర్వాహకులు పిడికిలి రాజు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ వీరస్వామి, అవ్వారు వేణు కుమార్ ప్రసంగించి ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో బీసీ ఉద్యమాన్ని సమరశీలంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్, బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కార్యదర్శి వేముల అశోక్, రిటైర్డు ఎంఇవో శ్రీరామోజు కొండయ్య, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, తుల మధుసూదన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, సామాజిక ఉద్యమ నాయకులు కామిల్ల జయ రావు, సింగరేణి ఐక్యవేదిక నాయకులు పెద్దపల్లి కోటిలింగం, రాజేశం గౌడ్, జన్నారం మండలం బీసీ నాయకులకు కోడూరి చంద్రయ్య, వేముల మల్లేష్, గణేష్, మార్త మారుతి, షబ్బీర్ పాషా, నస్పూరి అఖిల్, మొగిలి తిరుపతి, సమ్ము రాజన్న, కొండపాక ప్రభాకర్, నీరటి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ చేసిన ఏ ఎస్సైకి ఘనంగా సన్మానం

- ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ గౌస్ బాబా

**జగిత్యాల జూన్ 29 ( మనం ప్రతినిధి):** పదవీ విరమణ వృత్తిలోని బాధ్యతల నుండి తప్పించి బందాలను బలపరుస్తుందని ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ గౌస్ బాబా అన్నారు.జగిత్యాల జోనల్ ఇంటలిజెన్సీ కార్యాలయంలో పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి ఇటీవల పదవీ విరమణ చేయగా ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ గౌస్ బాబా ముఖ్య అతిధిగా పాల్గొని ఘన సన్మానం చేశారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో మెజారిటీ కాలం బాధ్యతల నిర్వహణలో ఒత్తిడితో గడుస్తుందని సుదీర్ఘ కాలం నిబద్ధతతో పనిచేసి పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆయన సూచించారు.కరీంనగర్ రీజినల్ అధికారి, ఇంటెలిజెన్స్ జోనల్ ఇన్స్పెక్టర్ బాణాల రాజేందర్ మాట్లాడుతూ పదవి విరమణ కేవలం ఉద్యోగ జీవితానికేనని పదవి విరమణ అనంతరం కుటుంబాలతో సుఖంగా గడపాలని అన్నారు.అనంతరం పదవి విరమణ చేసిన ఏ ఎస్ఐ సుధాకర్ రెడ్డి దంపతులను ఇంటెలిజెన్స్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే ఇంటెలిజెన్స్ జగిత్యాల జోనల్ పరిధిలో పనిచేసి ఇటీవల బదిలీ పై వెళ్లిన హోంగార్డు పి. శ్రీనివాస్ ను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో జోనల్ సబ్ ఇన్స్పెక్టర్ ఏ.వెంకటయ్య, ఇంటెలిజెన్స్ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ వావిలాల గంగాధర్, కార్యాలయ సిబ్బంది బి. వెంకటేశ్వర్లు, మొహమ్మద్ రియాజ్, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జులు మరియు ఫీల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి



**హుజురాబాద్, జూన్ 29 (మనం న్యూస్):** హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి అహల్య నగర్ లో బిజెపి బూత్ అధ్యక్షులు నాంపల్లి సుమన్ ఇంట్లో ఆదివారం ప్రధాని మన్ కి బాత్ కార్యక్రమాన్ని స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి నెల నిర్వహించే మన్ కి బాత్ కార్యక్రమంలో ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తారని అన్నారు. భారతదేశాన్ని ట్రకోమా (కంటి వ్యాధి ) నుండి విముక్తి పొందిన దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించినదని, దేశంలో ఆరోగ్య కార్యకర్తలు సాధించిన విజయమని, దీనికి జల్ జీవన్ మిషన్ దోహద పడిందని ప్రధాని మోదీ వివరించారని తెలిపారు. దేశంలో 95 కోట్ల మంది సామాజిక భద్రత పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని, అంతర్జాతీయ కార్మిక సంస్థ ఈ మేరకు నివేదికను విడుదల చేసిందనే విషయాన్ని ప్రధాని మోదీ మన్ కి బాత్ లో ప్రస్తావించారని అన్నారు. ఇటీవల అంతర్జాతీయ యోగా డేను యావత్ ప్రపంచం ఘనంగా జరుపుకుందని, యోగ విశ్వవ్యాప్తం కావడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. ప్రధాని మోదీ నాటి అత్యవసర పరిస్థితి, ఎమర్జెన్సీ చీకటి రోజులను కూడా గుర్తు చేసుకున్నారని తెలిపారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారిని మనందరం గుర్తుంచుకొని స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోని భద్రాచలం మహిళలు మిల్లెట్ బిస్కెట్ లు, శానిటరీ ప్యాడ్స్ తయారీలో రాణిస్తున్నారని, విదేశాలకు మిల్లెట్ బిస్కెట్లను ఎగుమతి చేసే స్థితికి మహిళలు ఎదిగారని ప్రధాని మోదీ ప్రశంసించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, శక్తి కేంద్ర ఇన్చార్జ్ అంకటి వాసు, గంట సంపత్, బోరగాల సారయ్య, కొలిపాక వెంకటేష్, కొడిమ్యాల పవన్, రాజేష్ ఖన్నా, ముప్పు మహేష్, గుర్రం సంతోష్, కుర్ర సంపత్, కొండబత్తిని రాజు, పర్థం రాము, మనోజ్ పాల్గొన్నారు.

## జియో-హెరిటేజ్ ఇన్ఫర్మేషన్ ప్యానెల్ బోర్డును ప్రారంభించిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు



**రేగొండ,జూన్,29 (మనం న్యూస్ ):** పాండవుల గుట్ట రాళ్ల నిర్మాణాల భౌగోళిక ప్రాముఖ్యత, వయస్సు, మరియు పురాతన శిలా చిత్రాలు వంటి అంశాలను హైలైట్ చేస్తూ ఏర్పాటు చేసిన సమాచారం. ప్యానెల్ బోర్డును 2025 జూన్ 29న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఖిఐ), తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డా. మంజు ఎస్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ శాస్త్రవేత్తలు డా. రమేష్ సామల, రమేష్ గుండా, తుషార్ చంద్ర పటేల్, అశోక్ కుమార్ కలబతులా హాజరయ్యారు. ఈ ప్రదేశానికి భౌగోళిక ప్రాముఖ్యత ఉండటానికి కారణం అనన్యమైన రాళ్ల నిర్మాణాలు, గుహలు, శిలా తావులు ఉండటమే కాక, ఇవి భారతదేశ భౌగోళిక చరిత్రకు వెలుగులిచ్చే విశేషాలను అందించడమే. పాండవుల గుట్ట పాఖల్ సూపర్గ్రూప్లోని ములుగు గ్రూప్కు చెందిన జకారం ఫార్మేషన్ లోని మోటే ధాన్యాల శిలలు కలిగి ఉంది. దీనికి చరిత్రలో విశేష ప్రాధాన్యత ఉంది. పల్లెటూరి ప్రజల జీవన శైలిని ప్రతిబింబించే ప్యాలియోలిథిక్ శిలాచిత్రాలు మరియు మేసోలిథిక్ నుంచి మధ్యయుగాల వరకు నివాస స్థానాల ఆధారాలు కూడా ఇక్కడ కనిపిస్తాయి. ఈ శిలా చిత్రాల్లో ప్రధానంగా బైసన్, కృష్ణజింక, పులులు, చిరుతపులులు వంటి పెద్ద జంతువుల బొమ్మలు కనిపిస్తాయి. ఈ శిలా చిత్రాలకూ తోడు, రష్ట్రకూటుల కాలానికి చెందిన శాసనాలు మరియు మధ్యయుగాం తంలోని ఫ్రెస్కో చిత్రాలు కూడా ఈ కొండలపై గుర్తించబడ్డాయి. ఈ చిత్రాలు పూర్వాధికాళ ప్రజల జీవన శైలి, విశ్వాసాలను తెలియజేస్తూ ముఖ్య ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ చిత్రాలు మరియు నివాస స్థలాల ఉనికి ఈ ప్రాంతంలో ప్రాచీనకాలం నుండే మానవ వ్యవసాయాన్ని సూచించడమే కాక, ఈ ప్రదేశ భౌగోళిక ప్రాధాన్యాన్ని మరింతగా వివరిస్తున్నాయి. పండవులగుట్టలో కనిపించే భౌగోళిక లక్షణాలు మరియు ప్యాలియోలిథిక్ జీవన చరిత్ర ఆధారాలను సందర్శకులు అర్థం చేసుకునేందుకు పై సమాచారం ఎంతో ఉపయోగకరమని శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే, ఈ రాష్ట్రానికి ఏకైక జియో-హెరిటేజ్ ప్రదేశంగా ఉన్న పండవులగుట్టను ప్రజలు తప్పకుండా సందర్శించి, దాని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక ప్రాధాన్యతను అనుభవించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

భారతదేశంలో నానాటికీ తీవ్రతరమవుతున్న మధుమేహ వ్యాధి దేశంలో లభ్యతకు సంబంధించిన సవాళ్ళకు తెరతీస్తోంది. దేశంలో టైప్-1 మధుమేహరోగులకు, పదిశాతం టైప్-2 మధుమేహ రోగులకు 'ఇన్సులిన్' ప్రాణదాత. రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రించే హార్మోన్‌ను 'ఇన్సులిన్' అంటారు. శరీరకణాలు రక్తం నుంచి చక్కెరను గ్రహించి, శక్తి రూపంలో నిల్వ చేసుకునే ప్రక్రియలో ఇన్సులిన్ పాత్ర ప్రధానమైంది. ఆహారం తీసుకున్న వెంటనే రక్తంలో విడుదలయ్యే గ్లూకోజ్ శరీరకణాలకు సక్రమంగా చేర్చడం కోసం ప్యాంక్రియాస్ ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇలా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయడం, విడుదల చేయడం, వినియోగించుకోవడం వంటి ప్రక్రియల్లో చోటుచేసుకునే అసమతౌల్యత మధుమేహం అనే దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధికి దారితీస్తుంది. ఇప్పటికిప్పుడు ఒక్క వయల్ ఇన్సులిన్ ధర రమారమి 133 రూపాయలు పలుకుతోంది. దేశంలో ఇన్సులిన్ మార్కెట్ క్రమేపీ విస్తరిస్తోంది. దేశీయ కంపెనీలు కూడా ఈ మార్కెట్‌లోకి విరివిగా ప్రవేశిస్తున్నాయి. భారతదేశ ఇన్సులిన్ మార్కెట్ పరిమాణం 2024లో 635.70 మిలియన్ డాలర్లకు చేరుకుంది, 2033 నాటికి ఈ మార్కెట్ 897.06 మిలియన్ డాలర్లకు చేరుకుంటుందని వాణిజ్య అధ్యయన సంస్థ ఐఎంఎఆర్‌సి గ్రూప్ అంచనా వేస్తోంది, ఇది 2025-2033 మధ్యకాలంలో 3.90% వృద్ధి రేటు (సిఎజిఆర్)ను సూచిస్తోంది. పెరుగుతున్న డయాబెటిస్ కేసులు, బయోసిమిలర్ ఇన్సులిన్ కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఇన్సులిన్ అందుబాటును మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది, ఈ కారణంగా మార్కెట్ విస్తరిస్తోంది. ఇన్సులిన్ డెలివరీ పరికరాల్లో సాంకేతిక పురోగతి, పెరుగుతున్న దేశీయ తయారీ, పెరుగుతున్న ఆన్లైన్ ఫార్మసీలు, ఆధునిక రిటైల్ ఛానెళ్ళు ఇన్సులిన్ అందుబాటును పెంచుతున్నాయి, భారతదేశ ఇన్సులిన్ మార్కెట్ వాటాను బలోపేతం చేస్తున్నాయి.

# వరమా, శాపమా?!

## మధుమేహ వ్యాధిగ్రస్తులకు అందుబాటులో లేని మానిటరింగ్ ఉపకరణాల ధరలు




**భారతదేశంలో పదికోట్ల మందికి పైగా ప్రజలు మధుమేహంతో బాధపడుతున్నారు, అందుకే మన దేశాన్ని 'డయాబెటిస్ రాజధాని' అని అంటారు. డయాబెటిస్‌ను సమర్థవంతంగా నిరోధించడానికి రక్తంలో చక్కెర స్థాయిలను తరచూ తనిఖీ చేయడం చాలా ముఖ్యం. ప్రస్తుతం మధుమేహ రోగులకు అందుబాటులో ఉన్న ఆధునిక డయాబెటిస్ మానిటరింగ్ ఉపకరణాల గురించి తెలుసుకుందాం. ఈ పరికరాల్లో చాలామటుకు ఖరీదైనవే ఉంటాయి, కొన్ని మనదేశంలో లభ్యం కూడా కావు. అయినప్పటికీ, భవిష్యత్తులో ఇవి మనకు దొరికే అవకాశాలు లేవని అర్థం చేసుకోకూడదు.**

ఆధునిక పరికరాలైన 'కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటర్స్ (సిజిఎం), బ్లడ్ గ్లూకోజ్ మీటర్స్ (బిజిఎం), ఇన్సులిన్ డెలివరీ సిస్టమ్స్, నాన్-ఇన్వేసివ్' పరికరాలు ఈ ప్రక్రియను సులభతరం చేస్తాయి. ఈ పరికరాలు డయాబెటిస్ నిర్వహణలో ఎలా సహాయపడతాయి, వాటి ప్రాముఖ్యత ఏమిటి, భారతదేశంలో ఎలా లభిస్తాయో వివరంగా తెలుసుకుందాం.

మధుమేహరోగులకు చక్కెర స్థాయిలు ఎక్కువ (హైపర్ గ్లైసీమియా) లేదా తక్కువ (హైపోగ్లైసీమీయా) ఉండడం వల్ల గుండె సమస్యలు, కిడ్నీ వైఫల్యం, కంటి సమస్యలు వంటి తీవ్రమైన సమస్యలు రావచ్చు. సిజిఎం, బిజిఎం ఉపకరణాలు ఈ చక్కెర స్థాయిలను కచ్చితంగా తెలుసుకోవడానికి సహాయపడతాయి. సిజిఎం ఉపకరణాలు ప్రతి ఐదు నిమిషాలకు చక్కెర స్థాయిలను స్మార్ట్‌ఫోన్‌లో చూపిస్తాయి. ఎక్కువ లేదా తక్కువ స్థాయిలకు అలారమ్‌లు (హెచ్చరికలు) ఇస్తాయి, కాబట్టి వెంటనే చర్య తీసుకోవచ్చు. బిజిఎం ఉపకరణాలు రక్తంలో చక్కెర స్థాయిల్ని రోజుకు ఒకటి, రెండు సార్లు తనిఖీ చేయడానికి సరళమైనవి. వీటిని సులభంగా వాడుకోవచ్చు. ఈ పరికరాలు ఆహారం, వ్యాయామం, ఒత్తిడి, మందులు చక్కెర స్థాయిలపై ఎలా ప్రభావం చూపుతాయో తెలుపుతాయి. ఉదాహరణకు, ఫ్రీస్టయిల్ లీబ్రె లేదా డెక్స్‌కామ్ జి7 డేటా ఆధారంగా తక్కువ కార్బోహైడ్రేట్ ఆహారం తీసుకోవచ్చు లేదా వ్యాయామ సమయాన్ని సర్దుబాటు చేయవచ్చు. టైప్-2 డయాబెటిస్ ఉన్నవారు ఈ సమాచారంతో బరువు తగ్గడం, ఆహార నియంత్రణ ద్వారా మందుల అవసరాన్ని తగ్గించుకోవచ్చు. టైప్- 1 డయాబెటిస్ ఉన్నవారు ఇన్సులిన్‌పై ఆధారపడతారు. సిజిఎంలు (ఉదాహరణకు మెడ్‌ట్రోనిక్ గార్డియన్ కనెక్ట్), ఇన్సులిన్ పంపులు (ఉదాహరణకు మినిమెడ్ 780జి) కలిసి ఇన్సులిన్ డోస్‌ను ఆటోమేటిగ్గా సర్దుబాటు చేస్తాయి. దీనిని 'ఆర్టిఫిషియల్ ప్యాంక్రియాస్' అని అంటారు. స్మార్ట్ ఇన్సులిన్ పెన్స్ (ఉదాహరణకు నోవోపెన్6) డోస్‌ను రికార్డ్ చేసి, మర్చిపోకుండా రిమైండర్లు ఇస్తాయి.

### తీవ్ర సమస్యల నివారణ

రాత్రివేళల్లో చక్కెర స్థాయిలు తగ్గితే (హైపోగ్లైసీమియా) ప్రమాదకరం. గ్లూకోజ్ టాబ్లెట్స్ లేదా ఆహారం తీసుకోవచ్చు. దీర్ఘకాలంలో, ఈ పరికరాలు హెచ్‌బిఎ1సి (సగటు చక్కెర స్థాయి)ని తగ్గించడానికి సహాయపడతాయి, దీనివల్ల సమస్యలు తగ్గుతాయి.

### రోగులకు సాధికారత

ఈ పరికరాలు రోగులకు తమ ఆరోగ్యంపై స్వీయనియంత్రణ ఇస్తాయి. ఉదాహరణకు, డెక్స్‌కామ్ జి7 లేదా ఫ్రీస్టయిల్ లీబ్రె యాప్‌లు డేటాను డాక్టర్‌తో షేర్ చేయడానికి సహాయపడతాయి, దీనివల్ల చికిత్స ప్రణాళిక మెరుగుపడుతుంది.

### పరికరాల ప్రాధాన్యం, సమయోచిత నిర్ణయాలు

మధుమేహ రోగుల్లో రక్తంలో చక్కెర స్థాయిల గురించి సిజిఎంలు నిరంతర డేటాను ఇస్తాయి, కాబట్టి రోగులు వెంటనే చర్య తీసుకోవచ్చు. ఉదాహరణకు, చక్కెర స్థాయి తగ్గినప్పుడు జ్యూస్ తాగవచ్చు లేదా ఎక్కువైతే ఇన్సులిన్ వేసుకోవచ్చు. ముఖ్యంగా ఇన్సులిన్ వాడని టైప్ 2 రోగులకు బిజిఎంలు చక్కగా ఉపకరిస్తాయి, రోజువారీ తనిఖీలకు సరళమైన, కచ్చితమైన ఫలితాలకు ఇవి సహకరిస్తాయి.

### ఆసుపత్రి ఖర్చుల తగ్గింపు

చక్కెర స్థాయిలు అదుపులో ఉంటే ఆసుపత్రి సందర్శనలు, ఆపరేషన్ల అవసరం తగ్గుతుంది. సిజిఎంలు, ఇన్సులిన్ పంపులు ఈ స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడతాయి.

### వ్యక్తిగత చికిత్స

ప్రతి రోగి శరీరం భిన్నంగా స్పందిస్తుంది. సిజిఎం డేటా ఆధారంగా డాక్టర్లు మందులు, ఆహారం, లేదా ఇన్సులిన్ మోతాదును సర్దుబాటు చేయవచ్చు. ఉదాహరణకు న్యూట్రిసెన్స్ సిజిఎం ఆహార సలహాలు ఇస్తుంది.

### జీవన నాణ్యత మెరుగుపడటం

సిజిఎంలు సూదుల అవసరాన్ని తగ్గిస్తాయి, రోగుల జీవనశైలిని సులభతరం చేస్తాయి. ఇన్సులిన్ పంపులు రోజూ ఇంజెక్షన్లు వేసుకోవడం నుండి ఉపశమనాన్నిస్తాయి.

### ప్రమాద నివారణ

రాత్రివేళల్లో హైపోగ్లైసీమియా స్థితిని గురించి హెచ్చరించడం లేదా దీర్ఘకాల సమస్యలను నివారించడంలో సిజిఎం అలారమ్‌లు కీలకం. ఇవి టైప్ 1 డయాబెటిస్ రోగులకు, గర్భిణీ స్త్రీలకు ఎక్కువ ఉపయోగకరం.



## సరికొత్త పర్యవేక్షణ పరికరాలు

### కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటర్స్ (సిజిఎంలు)

సిజిఎంలు చర్మం కింద చిన్న సెన్సార్‌తో నిరంతరం చక్కెర స్థాయిలను తనిఖీ చేస్తాయి. ఇవి స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానమై, అలారమ్‌లతో సమస్యలను నివారిస్తాయి.

#### డెక్స్‌కామ్ జి7:

వివరాలు: చిన్న సెన్సార్‌తో 10 రోజులు పనిచేస్తుంది. రియల్-టైమ్ డేటా స్మార్ట్‌ఫోన్‌లో చూపిస్తుంది. ఇన్సులిన్ పంపులతో అనుసంధానమవుతుంది. టైప్ 1 డయాబెటిస్ రోగులకు, గర్భిణీ స్త్రీలకు రాత్రివేళ సమస్యలను నివారిస్తుంది. ఇన్సులిన్ మోతాదు సర్దుబాటుకు, జీవనశైలి మార్పులకు సహాయపడుతుంది. భారతదేశంలో దీని లభ్యత చాలా తక్కువ. ధర: సంవత్సరానికి సుమారు రూ.2,40,000. గమనిక: డాక్టర్ సలహాతో కొనాలి.

#### ఫ్రీస్టయిల్ లీబ్రె, లీబ్రె 3 ప్లస్:

ఇది చేతిపై ధరించే సెన్సార్, 14 రోజులు పనిచేస్తుంది. లీబ్రె 3 ప్లస్ ప్రతి నిమిషం డేటా ఇస్తుంది, అలారమ్‌లు ఉన్నాయి. టైప్ 1, టైప్ 2 డయాబెటిస్ రోగులకు సులభం. సూదుల అవసరాన్ని తగ్గిస్తుంది. ఆహారం, వ్యాయామం ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. ఇన్సులిన్ పంపులతో కలిపి ఉపయోగించవచ్చు. భారతదేశంలో ఇది 2020 నుండి ఒటిసిగా లభిస్తోంది. ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీలో ఫార్మసీలు, అమెజాన్ డాట్ ఇన్, ఎబ్బోట్ వెబ్‌సైట్‌లో లభిస్తుంది. లీబ్రె 3 ప్లస్ ఇంకా విస్తృతంగా రాలేదు. ధర: రీడర్+సెన్సార్ రూ.11,000. సెన్సార్ రూ.5,000, 14 రోజులకు మార్చాలి. సంవత్సరానికి రూ. 1,30,000. గమనిక: ఇన్సూరెన్స్ కవర్ చేయకపోవచ్చు.

#### ఎవర్‌సెన్స్ 365:

వివరాలు: చర్మం కింద 12 నెలలు ఉండే సెన్సార్ ఇది. స్మార్ట్‌ఫోన్‌లో డేటా చూపిస్తుంది. తరచూ సెన్సార్ మార్చడం ఇష్టం లేని వారికి ఉపయోగకరం. దీర్ఘకాల డేటా ఇస్తుంది, హెచ్‌బిఎ1సిని తగ్గించడంలో సహాయపడుతుంది. భారతదేశంలో దాదాపు లభించదు. దిగుమతి చేసుకోవాలి. ధర: రూ. 2,00,000 కంటే ఎక్కువ. గమనిక: డాక్టర్ ద్వారా ఇన్సర్ట్ చేయాలి.

#### న్యూట్రిసెన్స్ సిజిఎం ప్లాన్:

ఫ్రీస్టయిల్ లీబ్రె సెన్సార్‌తో ఆహార సలహాలు ఇచ్చే సేవను అందిస్తుంది, 14 రోజులు పనిచేస్తుంది. టైప్ 2 లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారికి వ్యక్తిగత ఆహార ప్రణాళికల్ని ఇస్తుంది. జీవనశైలి మార్పుల ద్వారా చక్కెర స్థాయిల్ని నియంత్రణలో ఉంచుతుంది. భారతదేశంలో లభించదు. ఫ్రీస్టయిల్ లీబ్రె సెన్సార్లను దిగుమతి చేసుకోవచ్చు. ధర: నెలకు రూ.20,000-రూ.30,000.



#### స్టెలో గ్లూకోజ్ బైసెన్సార్ సిస్టమ్:

ఇన్సులిన్ వాడని వారికి ఒటిసి సిజిఎం స్మార్ట్‌ఫోన్‌లో డేటా చూపిస్తుంది. టైప్ 2 డయాబెటిస్ ఆరంభ దశలో ఉన్నవారికి జీవనశైలి ప్రభావాన్ని తెలుసుకోవడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుంది. భారతదేశంలో లభించదు. దిగుమతి ద్వారా సెన్సార్‌కు రూ.4,000-రూ.8,000 చెల్లించి తెప్పించుకోవచ్చు. గమనిక: డాక్టర్ సలహా తప్పనిసరి.

#### మెడ్‌ట్రోనిక్ గార్డియన్ కనెక్ట్:

మినిమెడ్ 640 జి, 670జి, 780జి పంపులతో పనిచేస్తుంది. 6-7 రోజుల సెన్సార్, రోజుకు 2-3 సార్లు కాలిబ్రేషన్ అవసరం. టైప్ 1 డయాబెటిస్ రోగులకు ఆటోమేటిక్ ఇన్సులిన్ డెలివరీ ఇస్తుంది. రాత్రివేళ హైపోగ్లైసీమియా నివారణకు కీలకం. భారతదేశంలో లభ్యత: చెన్నై, బెంగళూరు, ముంబైలో ఆసుపత్రులు, ఫార్మసీలలో లభిస్తుంది. ధర: ట్రాన్స్మిటర్ రూ.50,000, సెన్సార్ రూ.3,000-రూ.3,500. సంవత్సరానికి రూ.2,40,000. గమనిక: ఖరీదైనది, కానీ ఆటోమేటిక్ ఫీచర్లు ఉపయోగకరం.

### భారతదేశంలో సిజిఎంలు

సిజిఎం మార్కెట్ 2025లో రూ. 207.52 మిలియన్లకు, 2030 నాటికి రూ.364.58 మిలియన్లకు చేరుతుంది. ఫ్రీస్టయిల్ లీబ్రె ఒటిసిగా లభిస్తుంది, కానీ డెక్స్‌కామ్ జి7, స్టెలో ఇంకా రాలేదు. నగరాల్లో (ముంబై, బెంగళూరు, హైదరాబాద్) లభ్యత ఎక్కువ, గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ. ఇన్సూరెన్స్ కవరేజ్ తక్కువ, జన్ ఔషధి కేంద్రాలలో సబ్సిడీలపై ఆశలు ఉన్నాయి.

## బ్లడ్ గ్లూకోజ్ మీటర్స్ (బిజిఎంలు)

బిజిఎంలు చిన్న రక్త నమూనాతో చక్కెర స్థాయిలను తనిఖీ చేస్తాయి. ఇవి చౌకగా, సులభంగా లభిస్తాయి.

#### కాంటూర్ నెక్స్ట్ వన్:

వివరాలు: ఐదు సెకన్లలో ఫలితం ఇస్తుంది. స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానమవుతుంది. సెకండ్-చాన్స్ ఫీచర్ స్ట్రిప్స్ వృథా కాకుండా చేస్తుంది. టైప్ 2 డయాబెటిస్ రోగులకు, తక్కువ బడ్జెట్ ఉన్నవారికి చౌకగా, సులభంగా అందుబాటులోకి వస్తుంది. రోజువారీ తనిఖీలకు కచ్చితమైన ఫలితాలు ఇస్తుంది.
భారతదేశంలో లభ్యత: అమెజాన్ డాట్ ఇన్, ట్రూమెడ్స్ ఫార్మసీలలో, జన్ ఔషధి కేంద్రాలలో రూ. 500-రూ.1,500.
ధర: స్ట్రిప్స్ రూ.10-రూ. 25. రోజు 8 స్ట్రిప్స్ వాడితే సంవత్సరానికి రూ.2,400-రూ.6,000.

#### వన్‌టచ్ వెరియో రిఫ్లెక్ట్:

వివరాలు: రంగుల డిస్‌ప్లే, సలహాలు ఇస్తుంది. వృద్ధులకు, కొత్తగా వాడేవారికి సులభం. తనిఖీలు సులభతరం చేసి, యాప్ ద్వారా డేటా షేర్ చేయడంతో మధుమేహ నిర్వహణ మెరుగుపడుతుంది.
భారతదేశంలో లభ్యత: అమెజాన్ డాన్ ఇన్, ఫార్మసీలలో రూ.1,000-రూ.2,000. 10-25 ఉచిత స్ట్రిప్స్‌తో కిట్లు.
ధర: స్ట్రిప్స్ రూ.15-రూ.25.

#### ఇతర ప్రముఖ బిజిఎంలు

యాక్యూచెక్ ఇన్‌స్టెంట్ /యాక్టివ్ : రూ.800-రూ.1,500, 10-50 స్ట్రిప్స్‌తో.
డాక్టర్ మోర్‌పెన్ గ్లూకోవన్ బిజి-03: రూ.300-రూ.1,000, స్ట్రిప్స్ రూ.10-రూ.15.
బీట్‌ఒకర్వ్ :స్మార్ట్‌ఫోన్‌తో కనెక్ట్ అయ్యే భారతీయ మీటర్, రూ.800-రూ.2,000.
అగారో గ్లూకోమీటర్: రూ.1,000-రూ.1,500, 50 స్ట్రిప్స్‌తో.
గ్రామీణ ప్రాంతాల్లో, టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి చౌకగా, సులభంగా లభిస్తుంటాయి. రోజుకు 1-3 సార్లు తనిఖీ చేయడానికి అనువైనవి. జన్ ఔషధి కేంద్రాలలో సబ్సిడీతో ఖర్చు తగ్గుతుంది.

## ఇన్సులిన్ డెలివరీ సిస్టమ్స్

#### స్మార్ట్ ఇన్సులిన్ పెన్స్ (ఉదాహరణకు నోవోపెన్ 6, ఇన్‌పెన్)

ఇవి ఇన్సులిన్ మోతాదును నిర్ణయించి, స్మార్ట్‌ఫోన్ యాప్‌లో రిమైండర్లు ఇస్తాయి. సిజిఎంతో అనుసంధానమవుతాయి. ఇన్సులిన్‌ను తీసుకోవడాన్ని మరచిపోవడం వంటి ప్రమాదాల్ని నివారిస్తాయి. పంపుల కంటే తేలికైనవి, వాడడానికి సులభమైనవి. టైప్ 1, 2 రోగులకు ఇన్సులిన్ నిర్వహణ సులభతరం చేస్తాయి.
భారతదేశంలో లభ్యత: ముంబై, ఢిల్లీ, బెంగళూరులో ఆసుపత్రులు, ఫార్మసీల్లో లభిస్తాయి. ధర రూ.5,000-రూ.15,000,
గమనిక: డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరం.

వీక్షణం

#### ఇన్సులిన్ పంపులు (ఉదాహరణకు మినిమెడ్ 780జి):

వివరాలు: నిరంతరం ఇన్సులిన్ ఇస్తాయి. సిజిఎంలతో కలిసి ఆటోమేటిక్‌గా ఇన్సులిన్ మోతాదును సర్దుబాటు చేస్తాయి. ప్యాంక్రియాస్ లాగా పనిచేస్తాయి. ఇంజెక్షన్ల సంఖ్య తగ్గిస్తాయి.
ధర: రూ.1.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు.
లభ్యత: ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయి.

### నాన్-ఇన్వేసివ్ పరికరాలు

ఇవి సూదులతో ప్రమేయం లేకుండా చక్కెర స్థాయిలను తనిఖీ చేసే పరికరాలు. ఇంకా అభివృద్ధి దశలో ఉన్నాయి.

#### ఐవా (బ్లూసెమీ):

ఇది భారతదేశంలో తయారైంది, అరవై సెకన్లలో చక్కెర స్థాయిల్ని, బిపిని, ఆక్సిజన్ స్థాయిల్ని తనిఖీ చేస్తుంది. ఇది సిజిఎంల కంటే చవకైంది, సూదులతో నిమిత్తం లేదు. టైప్ 2 మధుమేహ రోగగ్రస్తుల జీవనశైలి మార్పులకు సహాయకారిగా ఉంటుంది. ఇది అమెజాన్ డాట్ ఇన్‌లో లభ్యమవుతోంది, దీని ధర రూ. 16,650. దీని వాడకానికి డాక్టర్ సలహా తప్పనిసరి.

డయాబెటిస్ పర్యవేక్షణ పరికరాలు రియల్-టైమ్ డేటా ఇవ్వడం, సమస్యలు నివారించడం, జీవనశైలి, ఇన్సులిన్ నిర్వహణ మెరుగుపరచడం వంటి సహాయక చర్యల ద్వారా మధుమేహ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. సరైన పరికరం ఎంచుకోవడం, డాక్టర్ సంప్రదింపులతో మధుమేహాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ఆరోగ్య సంరక్షణ వంటి జాగ్రత్తల్లో ఆధునిక వైద్య ఉపకరణాల సహాయాన్ని తీసుకోవడం జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది.

**- పసుపులేటి గీత** (అసిస్టెంట్ ఎడిటర్)

# అభయం?!

కిటికీ

శారీరక వ్యాయామం కరవైన జీవనశైలి, పేలవమైన ఆహారపు అలవాట్లు, జన్యు సిద్ధత కారణంగా భారతదేశంలో మధుమేహం వ్యాప్తి ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. పట్టణీకరణ శారీరక శ్రమ తగ్గడానికి, ప్రాసెస్ చేసిన ఆహారాల వినియోగం పెరగడానికి దారితీసింది, ఇది టైప్ 2 డయాబెటిస్‌కు ప్రధాన ప్రమాద కారకంగా ఊబకాయానికి దారితీస్తుంది. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రచురించిన డేటా ప్రకారం, దక్షిణ భారతదేశంలో టైప్ 2 డయాబెటిస్ (టి2డిఎమ్) ప్రాబల్యం 10 సంవత్సరాల కాలంలో పెరిగింది. యువకులలో (20-39 సంవత్సరాల వయస్సు) దీని ప్రాబల్యం 4.5% నుండి 7.8%కి పెరిగింది, అయితే వృద్ధులలో (40 ఏళ్ళు, అంతకంటే ఎక్కువ వయస్సు) ఇది 28.4% నుండి 34%కి పెరిగింది. చిన్నవారిలో 0.5% నుండి 1.1%కి, పెద్దవారిలో 2% నుండి 5%కి, మొత్తానికి 150%నికి పెరిగిన టి2డిఎమ్ (టైప్ 2 డయాబెటిస్ మెల్లిటస్) కూడా గణనీయమైన పెరుగుదలను చూసింది. ఒత్తిడి, నిద్రలేమి ఇన్సులిన్ నిరోధకతను మరింత తీవ్రతరం చేస్తాయి. జీవితాంతం ఇన్సులిన్ చికిత్స అవసరమయ్యే పిల్లలు, యువకులలో టైప్ 1 డయాబెటిస్ కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలపై భారం పెరుగుతోంది, దీనివల్ల ప్రభుత్వం, ప్రైవేట్ రంగం డయాబెటిస్ నిర్వహణ కార్యక్రమాలను మెరుగుపరచడాన్ని మొదలుపెట్టాయి. విస్తరిస్తున్న రోగుల సంఖ్య, ఇన్సులిన్ చికిత్సలలో పురోగతితో, సరసమైన, సమర్థవంతమైన డయాబెటిస్ సంరక్షణ పరిష్కారాల కోసం డిమాండ్ పెరుగుతూనే ఉంది, ఇది భారతదేశ ఇన్సులిన్ మార్కెట్ దృక్పథాన్ని ప్రభావితం చేస్తోంది.

భారత ప్రభుత్వం ధరల పరిమితి, సబ్సిడీలు, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల ద్వారా ఇన్సులిన్‌ను మరింత సరసమైన ధరలకు అందించడానికి చురుకైన ప్రయత్నాలు చేస్తోంది. ఔషధ సంస్థల అధిక ధరలను నివారించడానికి నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వు కింద ఇన్సులిన్ ధరలను నియంత్రిస్తుంది. అదనంగా, ఆయుష్మాన్ భారత జన్ ఔషధి కేంద్రాలు వంటి పథకాలు ఆర్థికంగా బలహీన వర్గాలకు తక్కువ ధర ఇన్సులిన్‌ను అందిస్తాయి. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన ఖరీదైన బ్రాండ్లపై ఆధారపడటాన్ని తగ్గించి, సరసమైన జెనరిక్ ఇన్సులిన్‌ను పొందేలా చేస్తుంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ప్రచురించిన నివేదిక ప్రకారం, భారత ప్రభుత్వం ఎన్‌పి-ఎన్‌సిడి ద్వారా 724 జిల్లా ఎన్‌సిడి క్లినిక్‌లు, 6,110 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎన్‌సిడి క్లినిక్‌లకు నిధులు సమకూరుస్తుంది. ఇన్సులిన్ లభ్యత భారతదేశంలో ముప్పై ఏళ్ళకు పైబడిన 10.1 కోట్ల మందిని ప్రభావితం చేస్తుంది. ఎన్‌హెచ్‌ఎం చొరవ, పిఎంబిజెపి



కార్యక్రమం కింద ఇన్సులిన్‌తో సహా ముఖ్యమైన మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ తయారీదారులతో ప్రభుత్వ సహకారాలు దేశీయ ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తున్నాయి. ఈ ప్రయత్నాలు విస్తృత ఇన్సులిన్ స్వీకరణకు మార్గాన్ని సుగమం చేస్తున్నాయి, చికిత్సను మరింత అందుబాటులోకి తెస్తున్నాయి, భారతదేశ ఇన్సులిన్ మార్కెట్ వృద్ధికి దోహదపడుతున్నాయి.

**- కల్కి**

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.